సూపర్ గత వారంలోపు పై జరిగిన వరల్డ్స్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 200 పేజీలు: 12 వెల: 6.50

6 వేల విద్యార్థి వీసాలు రద్దు!

మరో 15 యేళ్లలో చంద్రునిపైకి భారత్ వ్యోమగామి

9లో

## విపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి



ప్రకటించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

న్యాయవేత్తగా సుదర్శన్ రెడ్డి ప్రఖ్యాతి

ఎన్డీయే అభ్యర్థి ఏకగ్రీవ యత్నాలకు గండికొడుతూ బరిలోకి దిగిన విపక్షం

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి జాతీయ స్థాయిలో విపక్ష కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. తమ అభ్యర్థిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటన చేశారు. ఇందుకు విపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయన్నారు. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగ ఎన్నుకోవాలని అధికార పక్షం విజ్ఞప్తి చేసిన సమయంలోనే విపక్ష పార్టీలు తమ అభ్యర్థిని ప్రకటించాయి. 'దేశంలోని ప్రఖ్యాత న్యాయనిపుణుల్లో బి.సుదర్శన్‌రెడ్డి ఒకరు. ఆంధ్రప్రదేశ్, గువాహటి హైకోర్టులతోపాటు సుప్రీంకోర్టులో సేవలందించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి. ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఓ అభిప్రాయానికి వచ్చి ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయి' అని ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నీ ఒకే పేరును అంగీకరించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమన్నారు.

**ఉస్మానియా వర్సిటీ నుంచి..**

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకులమైలారం. 1946 జూలైలో జన్మించిన ఆయన 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తి చేశారు. >>2

## సంపన్నుల చేయూత పేదలకు అందాలి



మంగళవారం కుప్పం బంగారు కుటుంబాలకు అడాప్ట్ ట్రీని అందించిన సిఎం చంద్రబాబు

పి-4 పథకాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ప్రజారోగ్య పరిరక్షణకు 'సంజీవని' కొత్త పథకం

విదేశాలలో ఉన్న మార్గదర్శులతో జూమ్‌లో మాట్లాడిన సిఎం

**విజయవాడ, ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్థిక సంస్కరణలవల్ల సంపద సృష్టించడం చాలా సులభమైన ప్పటికి, సమాజంలో పేదలు ఇంకా అలానే ఉన్నారని సిఎం చంద్రబాబు అన్నారు. అలాంటి వారిని ఆర్థికంగా అందరితో సమానంగా పైకి తీసుకొచ్చేందుకే పి4 కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని పేరిట కొత్త పథకం తీసుకొస్తున్నట్లు సిఎం స్పష్టం చేశారు. ఉత్తమ ఆరోగ్య విధానంగా సంజీవిని అమలవుతుందని అన్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతామని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే సంజీవనిలానే ఈ పథకం అమలవుతుందని వెల్లడించారు. మంగళగిరిలో నిర్వహించిన పి4 ప్రారంభ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత బంగారు కుటుంబాలు, వారిని దత్తత తీసుకున్న మార్గదర్శులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. మానవత్వంతో మంచి సమాజం కోసం పని చేయాలని కోరుతున్నానని అన్నారు. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోని అభివృద్ధి చెందాలని సిఎం ఆకాంక్షించారు.

సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలని తెలిపారు. విదేశాల్లో ఉన్న వారితో జూమ్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు. బంగారు కుటుంబాల దత్తతకు సౌదీ అరేబియాకు చెందిన పలువురు తెలుగువాళ్లు ముందుకొచ్చారు. అలాగే కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత తీసుకున్నారు. దత్తత సంకేతంగా అడాప్ట్ ట్రీని బంగారు కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ మార్గదర్శులు డబ్బులివ్వడమే కాదు, ఇబ్బందులు తొలగించేలా భరోసా ఇవ్వగలగాలని స్పష్టంచేశారు. ఓ అజ్ఞాత భక్తుడు తాను పెట్టిన కంపెనీ ద్వారా వచ్చిన సంపాదన నుంచి రూ.140 కోట్ల విలువైన 121 కేజీల బంగారాన్ని వెంకన్నకు ఇస్తున్నారని గుర్తుచేశారు. భూమి మీద ఎవరూ శాశ్వతం కాదని వెళ్లేటప్పుడు ఏం తీసుకెళ్లలేరు ఉన్నప్పుడు మనుషులుగా బతకాలి చనిపోయిన తర్వాత కూడా మనల్ని గుర్తుపెట్టుకునే పనులు చేయాలని అభిప్రాయపడ్డారు. మానవత్వంతో మంచి సమాజం కోసం పని చేయాలని కోరుతున్నానని అన్నారు.

మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోని అభివృద్ధి చెందాలని సిఎం ఆకాంక్షించారు. మార్గదర్శులు ఇచ్చిన చేయూతను బంగారు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సంస్కరణలతో సంపద వచ్చిందని, ఇప్పుడు సమాజంలో >>2

## అధికారంలోకి రాగానే సిఇసిపై చర్యలు

గయ సభలో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

ఓట్ల చోరీ కోసమే బిహార్ ప్యాకేజీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఓట్ల చోరీ వ్యవహారంలో సిఇసి జ్ఞానేశ్ కుమార్‌తో పాటు, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లపై కూడా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా గయాలో నిర్వహించిన సభలో రాహుల్ ప్రసంగిస్తూ ఇసిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో ఓట్ల అవకతవకల వ్యవహారం వెలుగుచూసినప్పటికీ, ఎలక్షన్ కమిషన్ తనను అఫిడవిట్ దాఖలు చేయాలని కోరుతోందని రాహుల్ విమర్శించారు. కొద్ది సమయంఇస్తే, ప్రతి అసెంబ్లీ, లోక్‌సభ స్థానంలో ఇసి లోపాలను ప్రజల ముందు ఉంచుతామని, అప్పుడు వారే ఎన్నికల సంఘాన్ని అఫిడవిట్ ఇవ్వాలని అడుగుతారని రాహుల్ అన్నారు.

**ఎస్ఐఆర్ ఓట్ల చోరీకి ఒక కొత్త రూపం!**

'ప్రధాని మోడీ స్పెషల్ ప్యాకేజీ గురించి మాట్లాడినట్లే, ఇసి కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరిట బిహార్ కోసం ప్రత్యేక ప్యాకేజీ తీసుకొచ్చింది. ఓట్ల దొంగతనానికి ఇదొక కొత్త రూపం. అయితే, బిహార్ ప్రజలు ఈ మోసాన్ని జరగనివ్వరు. అయితే ఒక్క విషయం కచ్చితంగా గుర్తుంచుకోండి. కేంద్రంలో, బిహార్‌లో కచ్చితంగా ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడే రోజు వస్తుంది. అప్పుడు సిఇసితో సహా ఎలక్షన్ కమిషనర్లపై చర్యలు తీసుకుంటాం'అని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఆ సమయంలో భోరున వర్షం పడుతున్నప్పటికీ రాహుల్ తన >>2

## డి.సిఎంపై సిబిఐ విచారణకు డిమాండ్

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** హరిహర వీరమల్లు సినిమా,వాణిజ్య కార్యక్రమాలను ప్రమోట్ చేసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వ నిధులు,అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని,ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ మాజీ ఐఎఎస్,లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ వేసిన పిటీషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. విచారణను వారంరోజులకు వాయిదావేసింది. సిబిఐ, ఎసిబి తరపు న్యాయవాదుల పేర్లను కేసుల విచారణ జాబితాలో (కాజ్‌లిస్ట్‌లో) చేర్చాలని రిజిస్ట్రీనిఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు ఇవ్వాలని పిటీషనర్ తరపు న్యాయవాది బాల చేసిన అభ్యర్ధనను తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి నోటీసులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. వ్యాజ్యంపై ప్రాథమిక విచారణ అనంతరం తగిన ఉత్తర్వులు ఇస్తామని తెలిపింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.




సిద్ధమవుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా

తెలంగాణ ఫోర్త్ సిటీకి ఈ ప్రాజెక్టు అనుసంధానం

## విజయవాడ నుంచి హైదరాబాద్ రెండు, మూడు గంటలే

**విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** రెండు తెలంగాణా రాష్ట్రాలను అనుసంధానం చేసే అత్యంత కీలకమైన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి ఆధునీకంగా తీర్చిదిద్దుతున్నారు. అమరావతి- హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మిస్తున్నారు.ఆంధ్రా-తెలంగాణ అనుసంధానంలో సరికొత్త గేమ్‌ఛేంజర్ అవుతుందంటున్నారు.ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల రాజధానుల నడుమ రెండు నుంచి మూడు గంటల్లోనే వెళ్లే అవకాశం ఉంది. ప్రతిపాదనలే కాదు ప్రభుత్వాల ప్రముఖులు కూడా తరచూ ఈ ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తున్నారు. 2 రాష్ట్రాల ముఖ్యమంత్రులు సుముఖంగా ఉండటంతో కేంద్రం కూడా ప్రాజెక్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. అందులో భాగంగానే సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు రోడ్లు, ఉపరితల రవాణా సత్వర చర్యలు ప్రారంభించాలని కేంద్రం ఆదేశించింది.

ఇరు రాష్ట్రాలు అమరావతి-హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాయి. తెలంగాణ సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్మించే ఫోర్త్‌సిటీకి ఈ ప్రాజెక్టులు అనుసంధానం చేయాలని భావిస్తోంది. హైదరాబాద్ శివారులో డ్రైపోర్టు నిర్మించి అక్కడి నుంచి మచిలీపట్నం పోర్టు వరకు కొత్త రైలు మార్గానికి ప్రణాళికలు చేస్తోంది. ఇదే విషయం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎపి సిఎస్, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్‌లతో చర్చలూ జరిపారు. ఇక ఈ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరిగితే ఇరు రాష్ట్రాల ప్రజలు, ప్రభుత్వాలకు లబ్ధి చేకూరనుందని రవాణారంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు చేరుకోవడానికి 5 గంటలకు పైగా సమయం పడుతుంది. అలాగే, ఇరు రాష్ట్రాలకు ఎగుమతులు, దిగుమతులు సులభం అవుతాయి. కారిడార్ సమీపంలోని గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. రహదారి వెంబడి వాణిజ్య, వ్యాపారాలు పెరిగి ఆర్థికవృద్ధి జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఇరు రాష్ట్రాలకు ఊహించిన దానికంటే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అభివృద్ధితో పాటు ప్రాంతీయ సమైక్యత బలపడి రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలు బలోపేతం కావాడానికి ఆస్కారం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఇరు రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చే అంశాలపై తెలంగాణ, ఎపి ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటోంది. అందులో భాగంగానే అమరావతిహైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం హైదరాబాద్‌విజయవాడ మధ్య 65వ నంబరు నేషనల్ హైవే ఉంది. ప్రస్తుతం >>2

## వివేకా కుమార్తె అల్లునిపై కేసులు క్వాష్ చేసిన 'సుప్రీం'

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్త ప్రతినిధి:** వివేకా హత్య కేసుపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ ఎంఎం సుందరేష్,జస్టిస్ ఎన్‌కె సింగ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. వివేకా కుమార్తె సునీతతోపాటు అల్లుడి నర్రెడ్డి రాజశేఖర రెడ్డి, అప్పటి సిబిఐ విచారణాధికారి రాంసింగ్‌పై పెట్టిన కేసులను క్వాష్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. వివేకాకుమార్తె సునీత తరపున న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. అవినాష్ సహా ప్రధాన నిందితుల బెయిలును రద్దు చేయాలనికోరారు. సుప్రీంకోర్టుగడువువల్లే దర్యాప్తు ముగించినటుల సిబిఐ చెబుతోందని లూథ్రా వివరించారు. వివేకా హత్యకేసులో మరింత లోతుగా దర్యాప్తు అవసరం ఉందని పేర్కొన్నారు. అసలు సూత్రధారులు, పాత్రధారులు ఎవరో బయటకు రావాల్సి ఉందన్నారు. సాక్షులను బెదిరించడం, సాక్ష్యాలను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారని లూథ్రా కోర్టుకు వెల్లడించారు. సునీత దంపతులతో పాటు రాంసింగ్ పైనా కుట్ర పూరితంగా కేసులు నమోదు చేశారని వివరించారు. దీంతో ఆ కేసులను సుప్రీం కోర్టు >>2



మంగళవారం ప్రకాశం బ్యారేజీ నుంచి భారీగా దిగువకు వదులుతున్న వరద నీరు

## ప్రకాశం బ్యారేజ్‌కి భారీగా వరద


మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా నదికి వరద పోటెత్తుతోంది..దాంతో అధికారులు విజయవాడ ప్రకాశం బ్యారేజీవద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజీకి ప్రస్తుతం 3.91లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగు తోంది. మంగళవారం సాయంత్రం లేదా బుధవారం నాటికి ఇన్‌ఫ్లో 6 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉంది. బ్యారేజీ 69 గేట్లు ఎత్తి పూర్తి స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పైనుండి చేరుతోన్న వరద నీటి కారణంగా ప్రకాశం బ్యారేజ్‌వద్ద కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3.25 లక్షల >>2

## 'ఉచిత బస్సు'కు భారీ స్పందన

• ఒక్కరోజే 18 లక్షల మంది ఉచిత ప్రయాణాలు • మహిళలకు రూ. 7 కోట్లు పైగా ఆదా

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం స్త్రీశక్తికి అద్భుతమైన స్పందన కనిపిస్తోంది. రోజు రోజుకీ మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. నిన్న ఒక్క రోజులోనే 18 లక్షల మందికి పైగా మహిళలు జీరో ఫేర్ టికెట్ తో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. దీంతో వారికి రూ.7 కోట్లకు పైగా ఆదా అయ్యింది. పథకం ప్రవేశపెట్టిన నాలుగు రోజుల్లో 47 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోగా.. దాదాపు రూ.19కోట్ల మేర వారికి ఆదా అయ్యింది.రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం అమలు తీరుపై ఆర్టీసీ ఉన్నతాధికారులతో సచివాలయంలో సిఎం సమీక్షించారు. ఘాట్ రూట్‌లలోని ఆర్టీసీ సర్వీసుల్లో స్త్రీ శక్తి పథకం అమలుకు సిఎం అంగీకారాన్ని తెలిపారు. ఈమేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్టీసీ ఉచితబస్సు ప్రయాణ పథకం కింద ప్రయాణించే మహిళల గుర్తింపు ధృవీకరణ కోసం ఆధార్ జిరాక్సుతో పాటు మొబైల్ డిజిటల్ లాకర్లోని సాఫ్ట్ కాపీని కూడా అనుమతించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మరోవైపు రోజువారీ ప్రయాణంలో తమకు ఎంతమేర ఆదా అవుతుందన్న అంశాలను మహిళలు తమతో సంతోషంగా పంచుకుంటున్నట్టు అధికారులు సిఎంకు తెలిపారు. స్త్రీశక్తి పథకం వర్తించే సర్వీసులను మహిళలు సులభంగా గుర్తించేలా బస్సు లోపలా బయటా బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న స్త్రీశక్తి పథకం ప్రభుత్వానికి భారం కాదు, బాధ్యతన్నారు. ప్రజలు ఆనందించే ప్రతీ పథకాన్ని అవహేళన చేయటమే వైఎస్సార్సీ పనిగా పెట్టుకుందన్నారు. దిగ్విజయంగా అమలవుతున్న స్త్రీ శక్తి పథకాన్ని చూసి కడుపుమంటతో వైఎస్సార్సీ ఓర్వలేక పోతోందన్నారు. ఆధార్, పాన్, ఓటర్ కార్డుల లాంటివి జిరాక్సులు, సాఫ్ట్ కాపీలు కూడా అనుమతిస్తున్నామన్నారు.స్త్రీ శక్తి పథకం దిగ్విజయంగా



అమలు కావడం వైఎస్సార్సీ వారికి నచ్చడం లేదన్నారు.లక్షలాది మంది అక్క, చెల్లెమ్మలకు ఈ పథకంద్వారా నేరుగా లబ్ధి చేకూరుతుంది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలులో వైఎస్సార్సీ నాయకులు సలహాలు, సూచనలు ఇవ్వాలి కానీ, అక్కసుతో ప్రవర్తించడం పట్ల ప్రజలు తీవ్ర ఆక్షేపణ చేస్తున్నారన్నారు.

## గోదావరి-శబరికి వరదపోటు

• నాలుగు రోజులుగా కుండ పోత • భద్రాచలం వద్ద 36.2 అడుగులు దాటిన గోదావరి • చింతూరు వద్ద 33 అడుగులు దాటిన శబరి • నీటమునిగిన ఎన్‌హెచ్ 326 ఎపి- ఒడిశా మధ్య రాకపోకలు బంద్

**చింతూరు/కూనవరం ఆగస్టు 19 ప్రభాతవార్త :** గోదావరి-శబరి ఎగువ ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా కుంభ వృష్టి కురుస్తుంది.దాంతో మంగళవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం 36.2 అడుగులు దాటింది.చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 33 అడుగులు దాటడంతో ఎపి నుంచి చింతూరు మీదుగా ఒరిస్సాను కలిపే జాతీయ రహదారి ఎన్‌హెచ్ 326 చింతూరు మండలం నిమ్మలగూడెం-కుయుగూరు గ్రామాల మధ్య నీటమునిగింది. కుయుగూరు వాగుపై ఉన్న వంతెన సైతం మునిగిపోవటంతో ఇరువైపుల వందలాది భారీ వాహనాలు బారులుదీరాయి. శబరి నదికి ఉపనదులు అయిన చంద్రవంక, సోకిలేరు, చీకటివాగు, అన్నవరంవాగు, రామవరంకాలువ, అత్తకోడళ్లవాగు పొంగిప్రవహిస్తున్నాయి. చింతూరు నుంచి విఆర్ పురం మండలాన్ని కలిపే 33కిలోమీటర్ల రహదారి అనేక చోట్ల నీటిమునిగిపోయి రవాణా వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోయింది. బంగాళా ఖాతంలో వరుస వాయుగుండాల కారణంగా గోదావరి,శబరి ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు దంచికొడుతున్నాయి.ఎడతెరపి లేని వర్షాల కారణంగా జనజీవనం స్థంభించింది.నాలుగు రోజులుగా ఇండ్ల నుండి ప్రజలు బయటకువచ్చే పరిస్థితికనిపించటం లేదు.వందలాది >>2



అన్నవరం వాగు వంతెన వద్ద వరద ఉధృతి

## తీరం దాటిన వాయుగుండం

24న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** వాయవ్య పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఒడిశాలోని గోపాల్‌పూర్‌కి సమీపంలో తీరం దాటినట్లు విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో 7కి.మీ వేగంతో వాయుగుండం కదిలినట్లు అధికారులు పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసేఅవకాశం ఉందన్నారు. గంటకు 35 నుంచి 45 కి.మీ >>2

20-8pg2exHMNWJQE 2nd_20-8pg2exHMNWJQE.qxd 8/20/2025 12:27 AM Page 1





మంగళవారం ఢిల్లీలో వరదలకు గురయిన ప్రాంతాలను సందర్శించిన సిఎం రేఖాగుప్తా

# సౌర కుటుంబంలో మరో అద్భుతం

## భూమికి సూర్యుడికి మధ్య పెరగనున్న దూరం

## నాలుగు రోజుల పాటు చల్లబడనున్న భూమి

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** సౌర కుటుంబంలో మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. రాబోయే నాలుగు రోజుల పాటు భూమికి సూర్యుడికి మధ్య దూరం ఒక్కసారిగా పెరిగిపోనుంది. దీని కారణంగా భూమిపై వాతావరణం చల్లబడనుందని నాసా, అంతరిక్ష శాస్త్రవేతలు చెబుతునా న్నరు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో వాతావరణంలో మార్పులు సంభవించి చల్లగా మారుతుందని వారంటున్నారు. సౌర కుటుంబంలో నాలుగైదు రోజుల పాటు ఏర్పడనున్న ఈ మార్పులను అఫెలియన్‌గా పిలుస్తారు. సాధారణంగా భూమికి, సూర్యుడికి మధ్య దూరం తొమ్మిది కోట్ల కిలో మీటర్ల వరకు వుంటుంది. కానీ అఫెలియన్ సమయంలో ఈ దూరం 15 కోట్ల 20 లక్షల కిలోమీటర్ల దూరం వరకు పెరుగుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. భూమికి, సూర్యుడికి మధ్య దూరం 66 శాతం పెరగడంవల్ల భూమికి సూర్యుడినుంచి వచ్చే వేడి చాలా వరకు తగ్గుతుం దని వారంటున్నారు. ఈ కారణంగా భూమి చల్లబడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. అయితే ఇదే సమయంలో అనారోగ్య సమస్యలు వున్నవారికి కొన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం కూడా వుందని వారంటున్నారు. అస్తమా, జలుబు, గొంతునొప్పి, జ్వరం, దగ్గు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడే వారు జాగ్రత్తగా వుండాలని వారంటున్నారు. ఈ క్రమంలో విద్యుత్ వినియోగం కూడా భారీగా తగ్గే వీలుంది.

# భారత్-చైనా సరిహద్దులు ప్రశాంతం

## జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** భారత్ – చైనా దేశాల మధ్య సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయని, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సానుకూల దిశగా పయనిస్తున్నాయని చెప్పారు. గత ఏడాది అక్టోబర్‌లో సరిహద్దుల్లో సైనిక ప్రతిష్టంభన తొలగినప్పటి నుంచి రెండు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొందని, దీనివల్ల రెండు దేశాలూ ప్రయోజనం పొందాయని దోవల్ పేర్కొన్నారు. సరిహద్దు వివాదంపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో మంగళవారం అజిత్ దోవల్ భేటీ అయ్యారు. ఇద్దరూ ప్రత్యేక ప్రతినిధుల స్థాయిలో 24వ విడత చర్చలు జరిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చైనా పర్యటనకు కొన్ని రోజుల ముందు ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. చైనాలోని టియాన్జిన్‌లో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఆ సదస్సుకు ప్రధాని మోడీ హాజరుకానున్నారని దోవల్ ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రతి నిధుల స్థాయి చర్చలు చాలా కీలకమైనవని ఆయన పేర్కొన్నారు. గత తొమ్మిది నెలలుగా భారత్‌చైనా సంబంధాలు మెరుగుపడుతున్నాయని అజిత్ దోవల్ తెలిపారు. 'సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయి. శాంతి, సామరస్యం నెలకొన్నాయి. మన ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడ్డాయి. గత ఏడాది అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ భేటీ తర్వాత ఈ కొత్త వాతావరణం ఏర్పడింది. అప్పటి నుంచి ఇరు దేశాలు ఎంతో లబ్ధిపొందాయి' అని దోవల్ చెప్పారు.
చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీమాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా రెండు దేశాల సంబంధాల్లో ఎదురైన ఆటుపోట్లు ఎవరికీ మంచివి కావని అన్నారు. గత యేడాది మోడీ, జిన్‌పింగ్ భేటీ ద్వైపాక్షిక సంబం ధాల అభివృద్ధికి సరైన దిశానిర్దేశం చేసిందని, సరిహద్దు సమస్య పరిష్కారానికి ఊతమిచ్చిందని తెలిపారు. 'సరిహద్దుల్లో ఇప్పుడు నెలకొన్న స్థిరత్వం మాకు సంతోషాన్ని కలిగిస్తోంది. ప్రధాని మోదీ మా ఆహ్వానం మేరకు ఎస్‌సిఒసదస్సు కోసం చైనాకు రానుండటాన్ని మేం ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నాం' అని పేర్కొన్నారు.కాగా 2020 ఏప్రిల్ –మే నెలల్లో లధక్‌లోని వాస్తవాధీన రేఖ వద్ద మొదలైన సైనిక ప్రతిష్టంభన, ఆ తర్వాత గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల కారణంగా ఇరు దేశాల సంబంధాలు ఆరు దశాబ్దాల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. 2024 అక్టోబర్ 21న ప్రతిష్టంభనకు తెరపడటంతో ఆ తర్వాత రెండు రోజులకే మోదీజిన్‌పింగ్ కజాన్‌లో సమావేశమై సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావాలని నిర్ణయించారు.

# పేదలకు అందాలి

>> అసమానతలు తగ్గించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గివ్ బ్యాక్ అనేది మన సమాజ నినాదం కావాలని దిశానిర్దేశం చేశారు. సమాజం వల్ల పైకి వచ్చిన వారు తిరిగి సమాజానికి ఎంతో కొంత తిరిగి చేయాలని కోరారు.ఉగాది రోజు పి4 కార్యక్రమం గురించి మొదటిసారిగా చెప్పానని.. నేడు ప్రారంభించానని గుర్తుచేశారు. 13,40,600 బంగారు కుటుంబాలను ఇప్పుడు మార్గదర్శులు దత్తతు తీసుకొంటున్నారని తెలిపారు. పి4లో 15 లక్షలు కుటుంబాలను టార్గెట్‌గా పెట్టుకున్నామని... ఇది మానవతా ధృక్పథంతో చేసే స్వచ్ఛంద కార్యక్రమమని ఉద్ఘాటించారు. పి4లో చేరాలని ఎవరినీ ఎలాంటి బలవంతం చేయడం లేదని... మీరు ఈ కార్యక్రమంలో పాల్గొంటే మీకు గొప్ప సంతృప్తి కలుగుతుందన్నారు.250 కుటుంబాలను తానే దత్తతు తీసుకొని వారిని స్వయంగా మానిటర్ చేస్తున్నానని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో మూడో స్థానానికి రానుంది.
ఐర్లాండ్ నుంచి వచ్చిన కార్తికేయను అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన నుంచి చదివిస్తే ఇప్పుడు గుర్తుపెట్టుకుని వచ్చి భాగస్వామి అవుతామంటున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రెండు శాతం వరకూ తీసుకువచ్చారు. దేశంలో సంపద సృష్టించడం చాలా కష్టంగా ఉండేది. ఆర్థిక సంస్కరణల వల్ల సంపద సృష్టించడం సులభమైంది.మంచి రోడ్లు, విమానాశ్రయాలు, టెలికమ్యూనికేషన్‌లు బాగా పనిచేస్తున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. త్వరలోనే అమెరికా, చైనా తర్వాత భారత్ త్వరలోనే మూడో స్థానానికి చేరుతుంది. రూ. 33వేలకోట్లు పెన్షన్‌ల రూపంలో పేదలకు కూటమి ప్రభుత్వం ఇస్తుంది. పేదల సేవ పేరుతో ఇంటికే వచ్చి అధికారులు వీటిని అందిస్తున్నారు. ఆగస్టు 1వ తేదీన పెన్షన్‌లు, ఆగస్టు 4వ తేదీన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం కింద పిల్లలకు ఫీజులు ఇచ్చాం ఏడుమంది పిల్లలు ఉన్నా వారికి తల్లికి వందనం ఇచ్చాం. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం ఆగస్టు 15వ తేదీన అమలు చేశాం.. వారికి ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చామన్నారు.ఆడపిల్లలు స్కూలుకు, వ్యాపారాలకోసం వెళ్లడం, దేవాలయాలకు వెళ్లడం, తదితర కార్యక్రమాలకు ఫ్రీ బస్సు ఉపయోగపడుతుంది. నేను ఇచ్చే పథకాలు వినియోగించగలిగితే మీ ఆదాయమే ఎక్కువగా వచ్చే పరిస్థితి ఉంటుంది ఐటీ రంగంలో భార్యభర్తలు ఉంటే వారిలో 80 శాతం మందికి భార్యలకే ఎక్కువ జీతం ఉంటుందని తేలింది. ఏపీలో జనాభా తగ్గిపోతుంది.గతంలో జనాభా పెరుగుతుందని 1995 తర్వాత చెప్పాం.. ఇప్పుడు రివర్స్ ప్రమోట్ చేస్తున్నాం. ఖర్చులు పెరగడంతో చాలామంది పిల్లలను కనడం కూడా మానేస్తున్నారు. యూరప్ , చైనా, జపాన్లు మన మీద ఆధారపడుతున్నారు... వారికి మిషన్లు ఉన్నాయి. వాటి ఆపరేషన్‌కు మనుషులు మనవద్ద నుంచి వెళ్తున్నారు.అందుకే పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై శ్రద్ధ పెట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# రెండు, మూడు గంటలే

>> ఉన్న రోడ్ల అభివృద్ధి, వరసల పెంపుతో ఆ ఫలితాలు ఇప్పటికే చూస్తున్నాం. వాటికి కొనసాగింపుగా ఇప్పుడు మరో మెగా ప్రాజెక్టు రానుంది. అదే అమరావతిహైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే. కేంద్ర ప్రభుత్వం కూడా దీని నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మరి, ఈ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్ట్‌కు అయ్యే ఖర్చెం? ఇది అందుబాటులోకి వస్తే ఇరురాష్ట్రాలకు కలిగే లాభాలేంటి? అనే అంశాలు తెలుసుకుందాం. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే హైదరాబాద్ నుంచి కాకుండా ఫోర్త్ సిటీ నుంచి ఉంటే బాగుంటుందని తెలంగాణ ప్రభుత్వం, ఏపీ సర్కారు తెలిపినట్లు సమాచారం. అమరావతిఫోర్త్‌సిటీని కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే వస్తే విజయవాడహైదరాబాద్ ప్రస్తుత జాతీయ రహదారికి అది సమాంతర రోడ్డు అవుతుంది. ఇప్పుడున్న జాతీయ రహదారికి అటూఇటుగా 10 కి.మీ. దూరంలో దీన్ని నిర్మిస్తే ప్రత్యేక బెల్ట్‌లా తయారు అవుతుంది. దీనిపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల చర్చల్లో ఎక్స్‌ప్రెస్ హైవే ఎలైన్‌మెంట్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలైన్‌మెంట్ ఇచ్చిన తర్వాత కూడా ఏవైనా మార్పులుంటే వాటినీ పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల సిఎంలు ఈ రహదారిపై చర్చించి ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్ విజయవాడ వరకు ఉన్న పాతరహదారితో పోల్చితే కొత్తగా రాబోతున్న గ్రీన్ ఫీల్డ్ హైవేతో సుమారు 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. పోర్టుల ద్వారానే విదేశాలకు సరకు రవాణా జరుగుతుంది. ఐతే, తెలంగాణకు సముద్రతీరం లేకపోవడంతో పోర్టులు ఏర్పాటు చేయడానికి అవకాశం లేదు. దీంతో సముద్రమార్గంద్వారా ఎగుమతులు, దిగుమతులు చేయడానికి ఏపీపై ఎక్కువ ఆధారపడుతోంది. అమరావతిహైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అందుబాటులోకి వస్తే ఎగుమతులు, దిగుమతులకు వ్యయప్రయాసలు తగ్గనున్నాయి. ఇందుకోసం తెలంగాణప్రభుత్వం రాజధాని నగర శివారులో డ్రైపోర్టు నిర్మించాలని భావిస్తోంది. ఇందుకోసం అమరావతిహైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను మచిలీపట్నం పోర్టు వరకు పొడగించాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరినట్లు సమాచారం.

# క్వాష్ చేసిన 'సుప్రీం'

>> క్వాష్ చేసింది. సిబిఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. 'నిందితులను కాలపరిమితి లేకుండా జైలులో ఉంచడం మంచిది కాదు.కానీ...హత్య తీరు చూస్తే నిందితులకు 2,5 ఏళ్లు చాలా తక్కువే అనిపిస్తోంది. ఆధారాలు చెరిపేయడం,సాక్షాధారాలు లేకుండా చేయడం నిరూపితమైంది.
ముందు గుండెపోటు అని..తర్వాత రక్తపు వాంతులని ప్రచారం చేశారు. హత్య అని తెలియకుండా అన్ని విధాలా ప్రయత్నం చేశారు. అన్ని వివరాలు దర్యాప్తులో పూర్తిగా బయటపడ్డాయి'అని ఎస్వీ రాజు కోర్టుకు వివరించారు. ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ వాదనలు వినిపిస్తూ 'నిందితుడు శివశంకర్‌రెడ్డి కొడుకు చైతన్య రెడ్డి మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లారు. ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు ఫొటోలతో సహా ఉన్నాయి.జైలు కెళ్లి అప్రూవర్ దస్తగిరిని బెదిరించినట్లు సాక్ష్యాలున్నాయి'అని పేర్కొన్నారు. ఇక ఈ కేసులో కోర్టు మరణ శిక్ష విధించే అవకాశం కూడ ఉందని సిబిఐ తరపు న్యాయవాది పేర్కొన్నారు.



చింతూరు-విఆర్ పురం మధ్య నీటమునిగిన రహదారి

# గోదావరి-శబరికి వరదపోటు

>> గ్రామాలకు రహదారులు నీటమునగటంతో బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా పోయింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సాలో భారీ వర్షాలతో గోదావరి–శబరి నదులు ఉప్పొంగుతు న్నాయి. భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 36.2 అడుగులకు చేరింది. మహారాష్ట్రలో భారీవర్షాలతో గోదావరి నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.ఇప్పటికే మహారాష్ట్ర లోని బాబ్లి,జయక్వాడి ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు చేరింది. అక్కడి నుండి తెలంగాణాలోని శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి,కాశేశ్వరం ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. గోదావరి నది నీటి మట్టం భద్రాచలంవద్ద 36.2 అడుగులు దాటగా, కూనవరం వద్ద గోదావరి నది నీటి మట్టం 37 అడుగులు దాటింది. గోదావరి,శబరి నదులకు వరద ముప్పు పొంచి ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కూనవరం మండలం టేకులబోరు–కొనరాజుపేట కావేజ్ మునిగిపోయింది. అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోయింది.చింతూరు నుంచి చూటూరు,ముకునూరు,ఎజికొడేరు,ఉలమూరు,మల్లెతోట గ్రామాలతో పాటు వి.ఆర్.పురం మండలంలోని అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు.ఈ రెండు మండలాలను కలిపే రహదారి నీట మునిగితె వారంరోజుల క్రితం వి.ఆర్.పురం మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోఉన్న అన్నవరం వాగుపై ఉన్న తాత్కలిక వంతెన కూలిపోయింది. ఇప్పటికే వేలాది ఎకరాల్లో వేసిన పంటలు నీటమునిగాయి. ప్రస్తుతం ఉన్న వరద తగ్గు ముఖం పడుతుందా? లేదా వాయిగుండాలు,వరుస తుఫానులతో 2022 పునఃరావృతం అవుతుందా? అనే ఆందోళనతో ముంపు మండలాల ప్రజలు బిక్కు బిక్కు మంటున్నారు.

# ప్రకాశం బ్యారేజ్‌కి భారీగా వరద

>> క్యూసెక్కులుగా ఉంది. ఇది 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరవచ్చని అధికారులు భావిస్తున్నారు కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉండడంతో.. ప్రభావిత జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని. లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వాగులు.. కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దు " అని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో ప్రజలను హెచ్చరించారు. వాయుగుండం ప్రభావంతో గడచిన 24 గంటల్లో.. పాడేరులో 16 సెంమీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రమంతటా ఇవాళ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు, అలాగే కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి ఈదురు గాలులు కొనసాగుతాయని పేర్కొంది. వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశా వద్ద తీరం దాటనుంది. ఈ క్రమంలో.. గడిచిన 24 గంటల్లో ఎపిలో కుండపోత వానలు కురిశాయి. నిన్న రాత్రి నుంచి వానలు తగ్గుముఖం పట్టినప్పటికీ.. ఈరోజు అక్కడక్కడ భారీ వానలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది.

# జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి

>> తర్వాత అదే యేడాది డిసెంబరు 27న బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో గువాహటి హైకోర్టు సిజెగా పనిచేశారు. 2007–11 మధ్య సుప్రీంకోర్టు జడ్జిగాను సేవలందించిన ఆయన.. 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించారు. వ్యక్తిగత కారణాలతో ఏడు నెలల్లోనే ఆ పదవికి రాజీ నామా చేశారు. మరోవైపు ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్‌ను ప్రకటించిన ఎన్డీయే.. ఆ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని ప్రయత్నాలుచేసింది. ఇందులో భాగంగాకాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్‌చేసి మద్దతుఇవ్వాలని కోరినట్లు సమాచారం. అంతకుముందు బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా కూడా రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. తాజాగా విపక్షాలు కూడా అభ్యర్థిని ప్రకటించడంతో రాధాకృష్ణన్, జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి మధ్య పోటీ అనివార్యమైంది.

# వరద ముంపులో ముంబయి

## భారీ వర్షాలకు 8 మంది మృతి

## 14 లక్షల ఎకరాల్లోని పంటలు ధ్వంసం



మంగళవారం ముంబయిలో కురిసిన భారీ వర్షానికి చెరువుల్లా మారిన రోడ్లు

**ముంబై, ఆగస్టు 19:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మంగళవారం కూడా భారీ వర్షం కొనసాగుతోంది. కుండపోత వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా ఎనిమిది మంది మృత్యువాత పడగా, 14 లక్షల ఎకరాల్లోని పంటలు ధ్వంసమయ్యాయి. 350 మిల్లీమీటర్ల వర్షం నమోదు కాగా, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రంగంలో 350 మందిని కాపాడి సురక్షితంగా ప్రాంతాలకు తరించాయి. వర్షం కారణంగా పాఠశాలలు, కళాశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సెలవు ఇచ్చారు. కొనసాగుతున్న భారీ వర్షం నేపథ్యంలో ప్రైవేటు సంస్థలు కూడా తమ ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. ఆర్థిక రాజధానిలో నిరంతరాయంగా కొనసాగుతున్న కుండపోత వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. విమాన రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ రాడార్ డేటా ప్రకారం.. దాదాపు 250 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబై ఎయిర్‌పోర్ట్‌నుంచి బయల్దేరే దాదాపు 155 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబైకి వచ్చే విమానాలు కూడా ఆలస్యం అవుతున్నాయి. దీంతో పలు ఎయిర్‌లైన్స్ తమ ప్రయాణికులకు ట్రావెల్ అడ్వైజరీలు జారీ చేశాయి. మరోవైపు రైల్వే ట్రాక్‌లపై పెద్ద ఎత్తున నీరు చేరటంతో సెంట్రల్ రైల్వే మార్గంలో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇదిలా ఉండగా.. ముంబై నగరం, శివారు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖహెచ్చరించింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

# సిఎం కార్యక్రమాల సమన్వయకర్తగా మంతెన సత్యనారాయణ రాజు

**విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఆయనకు సహాయ మంత్రి హోదా కల్పించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని జీఏడీ, ప్రోటోకాల్ డైరెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా టిడిపిలో క్రియాశీలకంగా పని చేసిన సత్యనారాయణ రాజు 2017–2023 మధ్య కాలంలో ఎమ్మెల్సీగా పని చేశారు. పార్టీలో వివిధ పదవులు నిర్వహించారు. 2007–2013 మధ్య కాలంలో తెలుగు యువత కార్యదర్శిగా, ఆ తర్వాత 2013లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించి పార్టీ అధినేత చంద్రబాబు అప్పజెప్పిన పనులను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సమయంలో చంద్రబాబు నిర్వహించిన 'మీ కోసం' పాదయాత్రలో రాజు వాలంటీర్ల సమన్వయకర్తగా పని చేశారు. శాసనమండలిలో ప్రజా సమస్యలను, పార్టీ గళాన్ని గట్టిగా వినిపించారు. గత వైఎస్సార్సీ హయాంలో శాసనమండలిలో నారా లోకేశ్ నేతృత్వంలో మూడు రాజధానుల బిల్లు పాస్ కాకుండా అడ్డుకోవడంలో సత్యనారాయణ రాజు తన వంతు పాత్ర పోషించారు. అంతే కాకుండా శాసన మండలిలో నారా లోకేశ్ మీదకు నాటి అధికార పార్టీ నేతలు దూసుకొచ్చిన సమయంలో ఆయనపై దాడి జరగకుండా ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్‌తో కలిసి అడ్డుకున్నారు. ఇక 2022 నుంచి పార్టీ కార్యక్రమాల సమన్వయకర్తగా వ్యవహరిస్తూ వచ్చారు.

# అధికారంలోకి రాగానే సిఇసిపై చర్యలు

>> ప్రసంగాన్ని కొనసాగించారు. మరోవైపు 'ఎన్నికల కమిషనర్లు బిజెపి సభ్యత్వం తీసుకున్నారని, ఆ పార్టీ కోసం పనిచేస్తున్నారు' అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు.అంతకుముందు, ఔరంగాబాద్ జిల్లాలో ఓట్లు కోల్పోయామని చెప్పిన పౌరులతో రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. 'గత 4 5 ఎన్నికల్లో ఓటు వేసిన వారి ఓట్లను కూడా చోరీ చేశారు. ఇదేమని ఎన్నికల సిబ్బందిని ప్రశ్నిస్తే, పైనుంచి ఆదేశాలు వచ్చాయని చెబుతున్నారు. మేము పేదల హక్కుల కోసం పోరాడుతున్నాం. కచ్చితంగా ఓట్ల చోరీకి అడ్డుకట్ట వేస్తాం' అని రాహుల్ పేర్కొన్నారు. అయితే ఈ వ్యవహారంపై బీహార్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కూడా స్పందించారు. ఓట్లు కోల్పోయామని చెబుతున్న వ్యక్తులు, తమ వివరాలు అందజేయాలని, అప్పుడు వారి సమస్యను పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**నిరాధార ఆరోపణలు**

అంతకుముందు, ఎస్ఐఆర్ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఖండించారు. ఇసికి అధికార, విపక్ష పార్టీలు అనే భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తుందని స్పష్టం చేశారు. ఓటు చోరీ పేరుతో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇసి లాంటి రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలు చేస్తున్న రాహుల్ గాంధీ వారం రోజుల్లోపు అఫిడవిట్ సమర్పించాలని కోరారు. లేనిపక్షంలో వాటిని నిరాధారమైన ఆరోపణలుగా పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**16 రోజులపాటు కొనసాగనున్న యాత్ర**

ఆగస్టు 17న ససారంలో ప్రారంభమైన 'ఓట్ అధికార్ యాత్ర' సెప్టెంబరు 1న పాట్నాలో ముగుస్తుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బిహార్‌లో ఇదే అతి పెద్ద యాత్ర. ఈ ఓట్ అధికార్ యాత్ర 24 జిల్లాలు, 60 అసెంబ్లీ స్థానాలను కవర్ చేస్తుంది. ఓటర్ల హక్కులను పరిరక్షించడం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత గురించి అవగాహన కల్పించడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా ఉంది. అందుకే ఈ యాత్రలో రాహుల్‌తో పాటు ఇండియా కూటమిలో భాగస్వాములైన ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్, ఇతర పార్టీల నాయకులు పాల్గొంటారు.

# తీరం దాటిన వాయుగుండం

>> వేగంతో గాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. మన్యం, అల్లూరి, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.బుధవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. వాయుగుండం తీరం దాటే సమ యంలో సముద్రం అలజడి దృష్ట్యా గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు సూచించారు. కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టుల్లో 3వ నంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగు తోంది. ఈ నెల 24 ఆదివారం వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 3.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీకి 6 లక్షల క్యూసెక్కులపైగా వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతోంది. శ్రీశైలం నుంచి ఐదున్నర లక్షల క్యూసెక్కులకు పైగా దిగువకు విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో మెదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. వరద పెరుగుతున్నందున లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వాగులు, కాలు వలు దాటేందుకు ప్రజలు యత్నించవద్దని చెబుతున్నారు.

**పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద వరద ప్రవాహం:**

గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం సాయంత్రానికి అడుగు మేర నీటిమట్టం పెరగడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. పోశమ్మగండి నుంచి డి.రావిలంక వరకు రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. సీతపల్లి వాగుకు వరద ప్రవాహం పెరగడంతో పోలీసులు రాకపోకలను నిషేధించారు. వర్షాలకు తోడు మధ్యలో కుంట వద్ద శబరి వచ్చి కలవడంతో గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద పెరిగే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం రాత్రికి నీటిమట్టం 31.15 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 6.89 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

**పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద వరద ప్రవాహం:**

గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం సాయంత్రానికి అడుగు మేర నీటిమట్టం పెరగడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. పోశమ్మగండి నుంచి డి.రావిలంక వరకు రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. సీతపల్లి వాగుకు వరద ప్రవాహం పెరగడంతో పోలీసులు రాకపోకలను నిషేధించారు. వర్షాలకు తోడు మధ్యలో కుంట వద్ద శబరి వచ్చి కలవడంతో గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద పెరిగే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం రాత్రికి నీటిమట్టం 31.15 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 6.89 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

## వారం - వర్జ్యం

20-08-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
ద్వాదశి మ.2.01
పునర్వసు రా.12.29
వర్జ్యం : ఉ.8.23–9.57
దు.ఉ.11.46–12.36
రాహుకాలం – మ.12.00–1.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. మొండి బాకీలు వసూలవుతాయి.

**వృషభం :** ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. బంధువుల నుండి వస్తులాభం.

**మిథునం:** నూతన వ్యక్తులు పరిచయమై చేయూతనందిస్తారు. ఆకస్మిక ధనలాభం.

**కర్కాటకం :** సంఘసేవా కార్య క్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వివాహ యత్నాలుఫలిస్తాయి.

**సింహం:** ఉద్యోగంలో అనుకోని చిక్కులు ఎదురవుతాయి. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**కన్య :** రాజకీయ, కళారంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. వాహన యోగం.

**తుల :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. సోదరుల కలయిక.

**వృశ్చికం:** కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఋణబాధల నుండి విముక్తిని పొందుతారు.

**ధనుస్సు:** దూరప్రాంతాలనుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. పెట్టుబడులకు అనుకూలం.

**మకరం:** భాగస్వామ్యవ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**కుంభం:** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రయాణాలు.

**మీనం:** కొన్ని కీలక వ్యవహారాలలో సన్నిహితుల సహాయం అందుకుంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

20-08Pg3exHMNWJQEK 3rd ONG_20-08Pg3exHMNWJQEK.qxd 8/20/2025 12:29 AM Page 1



## విజయవాడలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడులు

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు ఆకస్మిక దాడులను నిర్వహించారు.లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ జాయింట్ ఆపరేషన్‌తో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ దాడులు నిర్వహించారు.నగరంలోని గుర్తింపు పొందిన హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో కాలం చెల్లిన ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు.నిల్వ ఉంచిన మటన్.ఇతర మాంసాలను అధికారులు గుర్తించారు.ఆహార భద్రతా నియమాలను ఉల్లఘించి.నిర్దేశిత వ్యవధిని దాటినప్పటికి నిల్వ ఉంచిన ఆహార పద్దార్థాలను శాంపిల్స్‌ను వారు సేకరించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హోటల్స్ గుర్తించారు.వాటికి నోటీసులు జారీ చేసారు.ఈ దాడులకు సంబంధించి పూర్తి వివరాలు రావాల్సి ఉంది.

## గుంతల్లోకి నీరు వస్తే అమరావతి మునిగిపోయినట్లేనా?

### : వైసిపి నాయకులపై మంత్రి నారాయణ ఆగ్రహం



అమరావతిలో కొండవీటి వాగు ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

**విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోన్న వైసీపీ నాయకులపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు...అమరావతిలో కొండవీటి వాగు నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో వరద నీరు నిలిచిపోయిన ప్రాంతాలను మంత్రి నారాయణ పరిశీలించారు...అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్థసారధి తో కలిసి ఆయా ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. విజయవాడ పశ్చిమ బైపాస్ పై ఈ 11 రోడ్డు వద్ద కొండవీటి వాగుపై నేషనల్ హైవేస్ అధికారులు ఓ వంతెన నిర్మించారు...ఈ వంతెన నిర్మాణ సమయంలో అక్కడ మట్టిని అలాగే వదిలేయడంతో అక్కడే కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది...దీంతో వంతెన దిగువ నుంచి నీరు వెళ్లే మార్గం లేక నీరుకొండ పరిసర ప్రాంతాల్లో పొలాల్లో వరద నీరు నిలిచిపోయింది....వాస్తవపరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి నారాయణ అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసారు...ప్రొక్లెయిన్ లు ఏర్పాటు చేసి మట్టి తొలగించడం తో పాటు జాతీయ రహదారి పై కూడా స్వల్పంగా గండి కొట్టి నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు...ఆ తర్వాత అక్కడి కొచ్చిన మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడుతూ వైసీపీపై తీవ్రంగా మండిపడ్డారు. అమరావతిపై ఇకనైనా మీ ఏడుపులు ఆపాలంటూ వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసారు.లేదంటే ఈసారి ఆ 11 సీట్లు కూడా ప్రజలు మీకివ్వరన్నారు...ఎక్కడైనా నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే గుంతల్లోకి నీళ్లు రావా...?గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా?అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు..అమరావతిపై దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించరని అన్నారు... పశ్చిమ బైపాస్ పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో నీరు నిలిచిపోయిందన్న మంత్రి...అది కూడా కేవలం రెండు గ్రామాల పరిధిలో మాత్రమే పొలాల్లో నీరు నిలిచిందన్నారు.మిగతా గ్రామాల్లో వర్షం పడిన కొన్ని గంటల్లోనే నీరు బయటికి వెళ్లిపోయిందన్నారు...ప్రస్తుతం కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిని వేగంగా తొలగించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు మంత్రి..ఎవరెన్ని అనుకున్నా అమరావతి పనులు జరిగిపోతూనే ఉంటాయన్నారు.. వచ్చే మార్చి నాటికి అధికారులు, ఉద్యోగుల క్వార్టర్లు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు... రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేస్తున్న వారు వచ్చి చూడాలి.

## తిరుమల సమాచారం

### బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల దర్శనాలకే ప్రాధాన్యత !

#### - అన్ని రకాల ప్రత్యేక దర్శనాలు, విఐపి బ్రేక్ రద్దు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగవైకుంఠం తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామికి రానున్న సెప్టెంబర్ 24నుండిమొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల దర్శనాలకే అధిక ప్రాధాన్యతనిచ్చేలా టిటిడి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దేవుని బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు విఐపి బ్రేక్ దర్శనాలు,వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలుతోబాటు 300 రూపాయలు ఆన్‌లైన్ దర్శనాలు, ఆర్జితసేవలు కూడా రద్దుచేశారు. తొమ్మిదిరోజులు 14 వాహనాలపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగే మలయప్పస్వామి వాహనసేవలను ఉదయం 8గంటలకు ప్రారంభించి 10గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రాత్రి వాహనసేవలు 7గంటలకుమొదలవుతాయి.భక్తుల మధ్య భగవంతుని వాహనసేవలు జరగనున్నందున పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉంది. బ్రహ్మోత్సవాల్లో పూర్తిగా సర్వదర్శనం మాత్రమే అమలుచేస్తారు. భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డూలు నిల్వ ఉంచుతారు. భద్రత పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వాహనాల పార్కింగ్‌కు అసౌకర్యం కలగకుండా పోలీసులతో టిటిడి విజిలెన్స్ విభాగం సమన్వయంతో వ్యవహరించనుంది.తిరుమలలో పూర్తిగా శ్రీవారి ఆలయం, తిరుమలలోని పలు ముఖ్యకూడళ్లను సర్వాంగసుందరంగా అలంకరించే పనులు మొదలయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 24వతేదీ రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనం, సెప్టెంబర్ 28 గరుడసేవ, 31న స్వర్ణరథం, 1వతేదీ రథోత్సవం, 2న చక్రస్నానం ముఖ్యమైన ప్రధాన ఘట్టాలు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేసి ,భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తారు.

## టిటిడిలో విఅండ్ఇ దర్యాప్తు అంతా గప్‌చుప్!

### - ధార్మికసంస్థలో విచ్చలవిడి అనుమతులపై నో యాక్షన్



**ప్రభాత వార్త ప్రతినిధి- తిరుపతి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానమ్‌లో గత ఐదేళ్ళలో వైసిపి ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఈ విచారణ ఎంతవరకు సాగిందనేది అంతా గప్‌చుప్‌గా మారింది. ఆరునెలల క్రిందట రెండు దఫాలుగా టిటిడిలో పలు విభాగాలపై సోదాలు చేసిన విజిలెన్స్ అధికారులకు కీలక అంశాలు వెలుగు చూడటంతో ప్రకంపనలు మొదలయ్యాయి. భక్తులు తమ మొక్కుబడుల రూపంలో దేవుని హుండీకి సమర్పించుకుంటున్న నగలు,నగదు కానుకలతో భక్తుల సంక్షేమానికి ,సౌకర్యాలకు వెచ్చించాల్సిన నిధులను పక్కదారి పట్టించి భారీగా ముడుపులు దండుకున్నారనే ఆరోపణలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేపట్టింది. అప్పటికే శ్రీవాణి ట్రస్ట్ విరాళాలు, బ్రేక్ దర్శనాలు, పలు రకాల ఇంజనీరింగ్ పనులు, కీలక టెండర్లు, ప్రముఖుల సిఫార్సు లేఖలపై తిరుమలేశుని విఐపి బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవలకేటాయింపు వంటి అంశాలపై దృష్టి పెట్టిన ప్రభుత్వ విజిలెన్స్ అధికారులు కొన్ని కీలక రికార్డులు, ఆధారాలను కూడా సేకరించారనేది కీలక సమాచారం. ఇదే అంశంపై తిరుపతికి చెందిన బిజెపి నాయకుడు పి.నవీన్‌కుమార్‌రెడ్డి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీనియర్ ఎస్పీ కరీముల్లాషరీఫ్‌ను కలసి ఆధారాలతో ఫిర్యాదు కూడా చేయడం అప్పట్లో సంచలనం కలిగించింది. చేశారు. ఇప్పుడు ఈ అంశం పూర్తిగా పక్కదారిపట్టిందనేది టిటిడి వర్గాల్లో చర్చమొదలైంది. నవీన్ అందించిన సమాచారంతో టిటిడిలో ఇంజనీరింగ్ పనులకు టెండర్లు ఆమోదం, నిధులు విడుదల, శ్రీవాణి ట్రస్ట్ దర్శనాలు, విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించిన అక్రమాలపై ఆధారాలతో నివేదిక సమర్పించడం విజిలెన్స్‌కు మరింత మార్గం సుగమమైందని అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. అప్పుడే తిరుమలలోని అదనపు ఇఒ కార్యాలయంలో విధులు నిర్వహించిన ఇద్దరు కీలక అధికారులను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించి ఆధారాలు సేకరించారు. ఈ ఆధారాలతో దర్శనాల అక్రమాలపై కీలక అధికారిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందని చర్చ జరిగింది. 14 అంశాలకు సంబంధించి టిటిడిలో అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై కూపీ లాగింది. విజిలెన్స్ అధికారులు తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో అన్నప్రసాదం, ఇంజనీరింగ్ విభాగం, సేవాటిక్కెట్ల అక్రమాలు, నిధులు ప్రైవేటు బ్యాంకులకు మళ్లింపు,లడ్డూ తయారీకి వినియోగించే ముడిసరుకుల కొనుగోళ్ళలో అక్రమాలు, నాణ్యతా ప్రమాణాలు వంటివాటికి సంబంధించి సేకరించిన ఆధారాలతో సాక్ష్యాలను సేకరించారనేది అప్పట్లో వినిపించిన వార్తలు. మరీ ఈ దర్యాప్తు నివేదికలు ప్రభుత్వానికి చేరితే ఇంతకాలం ఎందుకు గప్‌చుప్‌గా ఉన్నారనేది టిటిడిలో ఇప్పుడు పెద్ద చర్చమొదలైంది.

## పాడనా తెలుగు పాట - కరోకే గాయనీ గాయకులకు ఆహ్వానం

### - డా.గజల్ శ్రీనివాస్

**విజయవాడ, ఆగస్టు 19, ప్రభాతవార్త ప్రతినిధి** :తెలుగు చలన చిత్ర అపూర్వ గీతాలను వెలికితీయడం, వాటిని యువతకు చేరవేయడం లక్షనంగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో, రానున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం "పాడనా తెలుగు పాట" నిర్వహిస్తున్నారు.ఆ పరిషత్ పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ ఈ విషయాన్ని తెలిపారు ఈ కార్యక్రమంలో డా. ఘంటసాల– ఎస్.పి.బాలు వేదికపై - తెలుగు పాటకు నీరాజనంగా ప్రతిభావంతులైన కరోకే గాయనీ గాయకులకు గానం చేసే అవకాశాన్ని అందిస్తోందనీ మంచి సాహిత్యం కలిగిన రెండు తెలుగు చలన చిత్ర గీతాలను కరోకే ద్వారా ఫోన్‌లో ఆడియో రూపంలో రికార్డు చేసి ఇమెయిల్ ద్వారా పంపాలి. మీ ఎంట్రీలు 10 సెప్టెంబర్ 2025 లోపున మాకు ఈమెయిల్ ద్వారా చేరాలి. అర్హత పొందిన గాయకులను ఎంపిక చేసి, ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై గానం చేసేందుకు అధికారిక ఆహ్వానం పంపబడుతుంది. పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రం,తెలుగు మహాసభల పతకము అందజేయబడతాయి. మీ ఎంట్రీలు అమ్మపండు ఈ మెయిల్ కు పూర్తి వివరాలతో పాటు, మీ ఫోటో, రెండు కరోకే పాటల ఆడియోలు పంపాలి. తెలుగు చలన చిత్ర అపూర్వ గీతాల సౌందర్యాన్ని ఆవిష్కరించడానికి, ప్రతిభావంతులైన గాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర సారస్వత పరిషత్తు విజ్ఞప్తి చేస్తోందని పరిషత్తు కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, మహాసభల సమన్వయకర్త పి.రామచంద్ర రాజు తెలిపారు.

## తిరుమలలో పెళ్లికి ఆన్‌లైన్‌లోనే బుకింగ్!

### - కల్యాణవేదికలో సకల సౌకర్యాలతో ఉచిత వివాహాలు



**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయన చెంత పేద,మధ్యతరగతి వర్గాల యువతీయువకులు ఉచితంగా కల్యాణాలు చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణవేదిక ఉంది. పాపవినాశనమ్ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కల్యాణవేదికను నిర్మించి అందులో అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు తెలుగురాష్ట్రాలనుండేగాక దేశం నలుమూలల నుండి కూడా యువతీయువకుల కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే వారివారికి ఇష్టమైన తేదీల్లో బుక్‌చేసుకునేలా అవకాశం ఉంది. తిరుమలలో టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25నుండి 2025 తాజా సమాచారం మేరకు 35వేలకుపైగా జంటలకు వివాహాలు అయ్యాయి. ఇందులో పురోహితుడు,మంగళవాయిద్యంతోబాటు పెళ్ళిసమయంలో పసుపు,కుంకుమ,కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది. వివాహానికి అవసరమైన సామాగ్రిని వధూవరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. పెళ్ళికి రాలేని సందర్భంలో అందుకు సంబంధించి ఆధార పత్రాలను సమర్పించాలి. వివాహానంతరం పెళ్ళికుమారుడు, పెళ్లికుమార్తెతోబాటు ఇరువురు తల్లిదండ్రులను 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల ద్వారా ఆరుమందికి సుపథం క్యూలైన్ ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనం కల్పిస్తారు. దర్శనానంతరం ఆరుమందికి 6ఉచిత లడ్డూలు కౌంటర్లలో అందుకోవచ్చు. తిరుమలలోని కల్యాణవేదికలో పెళ్లిచేసుకోవాలనే యువతీయువకులు ఉచిత వివాహాలు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లోనే కల్యాణవేదిక స్లాట్స్ బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. 2016 మేనెల నుండి నూతన వధూవరులకు టిటిడి కల్పించింది. ఆయా ప్రాంతాల్లోని నెట్‌సెంటర్‌లలో టిటిడి హెచ్‌టిటిపిఎస్://టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ ద్వారా బుక్‌చేసుకోవాలి. కరెంట్ బుకింగ్, ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకునే జంటలు తప్పనిసరిగా హిందూ మతస్థులై ఉండాలి. వధువుకు 18 సంవత్సరాలు, వరునికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ద్వితీయ వివాహాలు ,ప్రేమ వివాహాలు జరుపబడవు. ఇతర విరాలకు 0877-2263433నంబర్‌కు సంప్రదించాలి.

## న్యాయస్థానం నోటీసు సెలవుపై వెళ్లిన లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ హైకోర్టు అసహనం

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** కోర్టు నోటీసు తీసుకోకుండా ఉండేందుకు వారం రోజులు సెలవుపై వెళ్లిన కడప జిల్లా, లక్కిరెడ్డిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌పై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

సెలవులో ఉన్నట్లు పోస్టుమెన్ చేత రాయించారని వ్యాఖ్యానించింది ఎస్ఐ చెప్పకుంటే హైకోర్టు నోటీసుపై ఒక పోస్టుమెన్ ఎలా రాస్తారని ప్రశ్నించింది. ఈసారి నోటీసుకు స్పందించకపోతే ఎస్ఐ కౌంటర్ చేసినా, చేయకపోయినా తామే విచారణ పూర్తి చేస్తామని తేల్చి చెప్పింది. విచారణను సెప్టెంబర్ 2కి వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘు నందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ డివిజన్ బెంచ్ ప్రకటించింది.

## కృష్ణా, కర్నూలు జిల్లాల్లో విఎఎల బదలీలు రద్దు

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:**నిబంధనలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే గ్రామ సచివాలయాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల (వివిఎ)లను బదిలీ చేయడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. ఉమ్మడి కర్నూలు, కృష్ణా జిల్లాల్లో జరిగిన బదిలీలను రద్దు చేసింది. గత మే, జూన్ నెలల్లో వెలువడిన జీవోలు 23, 5లకు అనుగుణంగా తిరిగి కౌన్సెలింగ్/ బదిలీలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పై రెండు జిల్లాల్లో అత్యధికంగా ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే బదిలీలు జరిగాయని గుర్తించింది. పారదర్శకత, వ్యక్తిగతాభిమానం, ఆశ్రిత పక్షపాతం అడుకోవాలని పేర్కొంది. సిఫార్సులను యాంత్రికంగా జిల్లా కలెక్టర్లు ఆమోదించారని తప్పుపట్టింది. రూల్స్ ప్రకారమే బదిలీలు జరిగాయన్న ప్రభుత్వ వాదనను కొట్టివేసింది. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు అనుగుణంగా బదిలీలు జరిగాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం ఖండించలేదని చెప్పింది. బాధ్యత నుంచి అధికారులు తప్పుకున్నట్లు ఉన్నారని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ న్యాపతి విజరు ఇటీవల ఆదేశాలిచ్చారు. బదిలీ జరిగిన తీరును సవాలు చేస్తూ కడప, అన్నమయ్య, అనంతపురం, ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి కర్నూలు జిల్లాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు పెద్ద సంఖ్యలో పిటిషన్లు వేశారు. ఆ రెండు జిల్లాల్లోనే 217 మంది బదిలీకి ఎంపీ, ఎమ్మెల్యేలు సిఫారసు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 115 మంది, ఉమ్మడి కృష్ణా జిల్లాలో 102 మందిని బదిలీ చేయాలని ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేశారు. ఈ రెండు జిల్లాల్లో జరిగిన బదిలీలను రద్దు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. మిగిలిన జిల్లాల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సులు పెద్దగా లేవని, ఆ బదిలీల్లో జోక్యం చేసుకోబోమని ప్రకటించింది.

## ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలు

### పట్టుబడ్డ ఎర్రచందనం స్మగ్లర్




**రేణిగుంట ఆగస్టు 19 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్ద టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సూచనలతో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా మామండూరు వైపు నుండి రేణిగుంట వైపుకు రెండు కార్లు వేగంగా రావడాన్ని గుర్తించారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు రెండు కార్లను అడ్డుపడి ఆపారు. ఒక కారు డ్రైవర్ పారిపోగా, మరో కారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలు తనిఖీ చేయగా దాదాపు 20 ఎర్రచందనం దుంగలు దొరికాయి. పట్టుబడిన డ్రైవర్ కర్ణాటక వ్యక్తిగా గుర్తించారు. వాహనాలు తనిఖీ చేసిన వారిలో ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్సై వినోద్ కుమార్ బృందం ఉన్నారు. పట్టుబడిన వ్యక్తిని, ఎర్రచందనం దుంగలను, కార్లను తిరుపతి టాస్క్ ఫోర్స్ స్టేషన్ కు తీసుకెళ్లారు.

## కష్టమొస్తే గోవిందా అంటే అంతా శుభాలు

### - శ్రీవారిసేవలో క్రీడాకారిణి సైనాజైస్వాల్



**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే మనసు ఎంతో అనుభూతి కలుగుతుందని, అంతేగాక ఎవరికైనా కష్టమొస్తే,ఆపద ఉంటే గోవిందా అంటే ఆ కష్టం తీరిపోతుందని,కో.. అంటే కొండలరాయుడు పలికే దైవమని టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి సైనాజైస్వాల్ దేవునిపట్ల అత్యంత విశ్వాసం వ్యక్తం చేశారు. కొండల్లో నెలకొన్న తిరుమల క్షేత్రం తనకు ఎంతో ఇష్టమని, ఇక్కడ ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతుందన్నారు. భక్తులు ప్రశాంతమనస్సుతో దేవుని దర్శనం చేసుకుని మనసులో ఏది తలచుకున్నా అంతా శుభం జరుగుతుందని ఆమె అన్నారు. తనకు శ్రీవారి ఆశీస్సులతోనే అంతా మంచిజరుగుతుందని తెలిపారు. అథ్లెటిక్‌కు కూడా శిక్షణ పొందుతున్నట్లు సైనా చెప్పారు. భక్తులు కూడా దేవునిపట్ల భక్తితో విశ్వాసం కలిగి ఉండాలన్నారు. మంగళవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చిన సైనాజైస్వాల్ ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి ఆశీస్సులందజేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాణిపాకం బ్రహోత్సవాలకు పలువురు మంత్రులకు ఆహ్వానం



దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని బ్రహ్మోత్సవాలకు ఆహానిస్తూ ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీ, ఆలయ అధికారులు తదితరులు

**కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయ ుక సా ్వమివారి దేవస్థానంలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులను ఆహ్వానిస్తూ మంగళవారం దేవస్థానం తరపున ఆహ్వానపత్రికలను అందజేశారు. దేవస్థానంలో ఈనెల 27 నుండి సెప్టెంబర్ 16 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 21 రోజుల పాటు జరుగనున్నాయి. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహన్‌లను అమరావతిలోని సచివాలయంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఏఈఓ ధనుంజయ, స్థానిక టీడీపీ నాయకులతో కలసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం దేవస్థానం తరపున అర్చకులు, వేపదండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, టీడీపీ ఐరాల మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, జడ్పీటీసీ సుచిత్ర, నాయకులు గిరధర్‌బాబు, నాయకులు హేమాద్రినాయుడు, నరసింహులునాయుడులతో అర్చకులు, వేదపండితులుపాల్గొన్నారు.

## సంక్షేమపథకాల అమలులో సిఎం రేవంత్‌రెడ్డికి శక్తినివ్వమని వేడుకున్నా

### - పుట్టినరోజున శ్రీవారి దర్శనంతో ఆనందం - తెలంగాణమంత్రి కొండా సురేఖ



**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్‌పాలనలో పేదప్రజల కుటుంబాల్లో ఆనందం చూడాలనేది ఆశయమని, అందుకనుగుణంగా సిఎం రేవంత్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని తెలంగాణమంత్రి కొండా సురేఖ తెలిపారు. సంక్షేమపథకాలు అమలులో ,మరిన్ని మంచి పనులు చేసేందుకు అవసరమైన శక్తిని రేవంత్‌రెడ్డికి ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నట్లు చెప్పారు. పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణా సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలంతా సంతోషంగా జీవనం సాగించేలా చూడాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆమె కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆమెకు దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆదరణ 3లో మత్స్యకారులకు ప్రాధాన్యం

### :బిసి సంక్షేమ మంత్రి సవిత



మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజుతో మాట్లాడుతున్న మంత్రి సవిత

**విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధే చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. ఆదరణ 3.0 పథకం అమలులో కూడా మత్స్యకారులకు ప్రాధాన్యమిస్తామని, ఆధునిక పరికరాలు అందజేస్తామని వెల్లడించారు. మంత్రి సవితను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్ గా అవకాశమిచ్చినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చుతున్నారన్నారు. ఇప్పటికే వేట విరామ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి అందజేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు రూ.10వేల చొప్పున అందజేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ కూటమి ప్రభుత్వం రూ.20 వేలు అందజేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.29 లక్షలకు పైగా మత్స్యకారులకు రూ.259 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 217 ను రద్దు చేసిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనన్నారు. చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు భృతి ఇవ్వాలని నిర్ణయించిన ఘనత కూడా సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే ఫించన్లు అందజేసిన ఘనత కూడా టీడీపీదేనన్నారు. 2014లో తొలిసారిగా వేట నిషేధ సమయంలో భృతి అందజేశారన్నారు.

## ఆగస్టు 31న సండేస్ ఆన్ సైకిల్ పేరుతో ర్యాలీలు

### - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడఆగస్టు,19,ప్రభాతవారప్రతినిధి:** ఆగస్టు 29 నుండి 31 వరకు దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవం–2025ను నిర్వహించేందుకు క్రీడాశాఖ విస్తృత ప్రణాళికలు రూపొందించింది.ఈ సందర్భంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ అధ్యక్ష తన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సచివాలయ ఛాంబర్ నుండి పాల్గొన్నారు.

## ఇరుముడితో శబరిమలైకి మాజీమంత్రి పెద్దిరెడ్డి



**తిరుపతి,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన అనుచరులతో కలసి అయ్యప్పదీక్షలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఇరుముడులతో శబరిమలైకు బయలుదేరి వెళ్ళారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోబాటు ఆయన సోదరుడు తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పలువురు వైసిపి నాయకులు,మాజీ ఎంపి రెడ్డప్ప తో కలసి ఇరుముడులతో అయ్యప్పస్వామి దర్శనానికి తిరుపతి రైల్వేస్టేషన్ నుండి బయలుదేరారు.

వార్త

అందరికీ మంచిగా ఉండాలనుకోవడం అవకాశవాదమే తప్ప ఆచరణీయం కాదు.

-రామకృష్ణ పరమహంస

# సయోధ్య కుదిరేనా?


రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఆగాలంటే పుతిన్ మడతపేచీ పెట్టున్నాడని నిన్న మొన్నటివరకు అన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పుతిన్‌తోభేటీ అయ్యాక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ దిగిరాక తప్పదని హెచ్చరిస్తున్నారు. ట్రంప్‌యూటర్న్ తీసుకున్నట్లుంది. అంతకుముందు 'పుతిన్ తన మాట వినడం లేదని అక్కసు కొద్దీ జెలెన్‌స్కీని ఉదరగొట్టి పుతిన్ మీద యుద్ధానికి ఆయుధాలు సమకూరిస్తే యుద్ధానికి వెళ్లగలవా? అనే ధోరణిలో మాట్లాడారు. అప్పుడు రెచ్చగొట్టి ఇప్పుడు సముదాయించే మాటలు మాట్లాడడం ట్రంప్‌కే చెల్లింది. ఆయన చేష్టలకు అర్థాలుండవు. కానీ ఆయన ఎప్పుడూ ఒక మాట మీద నిలబడే మనిషి కాదన్నది అర్థమవుతుంది. అలస్కాలో ట్రంప్, పుతిన్‌ల మధ్య భేటీ శాంతి ఒప్పందాలపై ఎలాంటి కీలక నిర్ణయాలు లేకుండానే ముగిసింది. ఉక్రెయిన్, రష్యాలు నేరుగా శాంతి ఒప్పందం చేసుకోవడమే యుద్ధాన్ని ముగించేందుకు మేలైన మార్గాలని తన సొంత 'ట్రూత్' సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు సారాంశం. ఒకరినొకరు స్తుతించుకునే వ్యాఖ్యానాలు ఈ భేటీ ప్రధాన ఆకర్షణ. 2022లో అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ ఉంటే ఉక్రెయిన్ యుద్ధమే జరిగి ఉండేదికాదని పుతిన్ ట్రంప్‌ను కీర్తించారు. వారిద్దరి తాజా భేటీ ఉక్రెయిన్, రష్యా యుద్ధానికి తెరపడుతుందని, ఆశించిన ఉక్రెయిన్ ప్రజలకు రాజకీయనేతలకు నిరుత్సాహమే మిగిలింది. రష్యా విషయంలో ట్రంప్ జోక్యానికి ఏమాత్రం అవకాశమివ్వని పుతిన్ చాణక్యం బాగా బోధపడింది. కాగా మరోసారి చర్చలకు అవకాశముందని పుతిన్ ప్రకటన ఆశాజనకంగానే ఉంది. దీనిని బట్టి ఉక్రెయిన్, రష్యాలు ఏదో ఓ రోజు శాంతి ఒప్పందానికి సిద్ధమవుతాయని అనుకోవచ్చు. రష్యా ఆక్రమించుకున్న తమ భూభాగాల నుంచి వైదొలగాలని అనడంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎంతో తెలివిగా చాకచక్యంగా చూసారు. రష్యా 12ఏళ్ల నాడు క్రిమియాను ఉక్రెయిన్ నుంచి స్వాధీనం చేసుకుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఇదో జీడిపాకం వ్యవహారం. అయితే తాజాగా జెలెన్‌స్కీతో ట్రంప్‌ను కలిసివెళ్లాకఅన్ని అభయాలూ ఇచ్చి కూడా క్రిమియా గురించి నోరెత్తరాదని సూచించినట్లు తెలిసింది. ఇలాంటి అంశాల్లో జెలెన్‌స్కీ వైపు నుంచి సకారాత్మక అంగీకార ధోరణి ప్రకటిస్తేనే ముందుకు కదిలే అవకాశం ఉండొచ్చు. ఉక్రెయిన్ తన డిమాండ్లను వదులుకోవల్సిందేనని హితవు చెప్పిన ట్రంప్ రష్యా ఉక్రెయిన్‌ను అడుగుతున్న మరికొన్ని భూభాగాల విషయంలో ఎలా వ్యవహరించాలో ప్రస్తావించలేదు. మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధానికి రేపోమాపో ముగింపు పలికే సమయం ఆసన్నమైందనే భావన అందరిలోనూ ఉంది. కానీ ఫలితం నిష్క్రియ. గతంలో ఫిబ్రవరిలో ట్రంప్, జెలెన్‌స్కీల భేటీలో వాగ్వాదం తప్ప జెలెన్‌స్కీ వద్దట్రంప్ ప్రతిపాదనలేవీ చెల్లలేదు. తర్వాత ఇన్నాళ్లకు భేటీ జరిగింది. గత భేటీలో ట్రంప్,జెలెన్‌స్కీ మధ్య పొత్తు పొసుగకపోవడంతో ఈసారి ఐరోపా దేశాల అగ్రనేతలు కూడా భాగస్వాములైనారు. అయితే ఉక్రెయిన్‌కు అమెరికా దళాలు, ఐరోపా దేశాలు బాసటగా వెన్నంటి ఉంటాయని ముక్తకంఠంతో జెలెన్‌స్కీకి భరోసా ఇచ్చారు. ఆఇరుదేశాల మధ్య శాంతి కోసం తమవంతు సాయం ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. బలమైన సైన్యం ఆయుధాలు, శిక్షణ, నిఘా వ్యవస్థలు, తనకు తోడుగా నిలిస్తే చాలునని జెలెన్‌స్కీ సంతోషించాలి. ఇన్ని ప్రయోజనాలు జరుగుతున్నా పుతిన్ కేవలం కాల్పుల విరమణకు సిద్ధంగా లేరు. ఈ భేటీ జరుగుతున్న సమయంలోనే ఉక్రెయిన్‌పై రష్యా దాడులు జరిపి ఏడుగురిని పొట్టనపెట్టుకొంది. దానినే ఆసరాగా చేసుకొని ఉక్రెయిన్ అధ్యక్షుడు రష్యా దుశ్చర్యలను ట్రంప్ తదితర నేతల దృష్టికి తెచ్చారు. ఈ ఇరు దేశాల మధ్య శాంతి కోసం ఎన్నోదేశాల అధ్యక్షులు హాజరవడం అరుదైన విషయం. ట్రంప్‌తో భేటీ జరిగాకరష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం భారత ప్రధాని మోడీతో ఫోన్‌లో మాట్లాడారు. దౌత్యం, శాంతి మార్గాల ద్వారా దేశాల శ్రేయస్సుకోసం ఒప్పందాలు చేసుకోవాలని పుతిన్‌కు మోడీ సూచించారు. ఎన్ని భరోసాలున్నా, ఎన్ని ప్రతిపాదనలున్నా పూచిక పుల్లంత భూభాగాన్ని కూడా వదులుకునేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సిద్ధంగా లేరు. అయినా తాను ట్రంప్‌తో కలిసి పుతిన్‌తో త్రైపాక్షిక సమావేశం ద్వారానే యుద్ధ శాంతి జరుగగలదని జెలెన్‌స్కీ ఆశాభావం వ్యక్తం చేయడం కొసమెరుపు. భేటీ సవ్యంగా జరిగితే యుద్ధాన్ని ముగించేందుకు సహేతుకమైన అవకాశాలుంటాయని ట్రంప్ ఆశాభావం. పుతిన్‌కు కూడా దౌత్య, శాంతి మార్గాల ద్వారా శాంతి ఒప్పందాలు చేసుకోవడం మేలని భారత ప్రధాని నరేంద్రమోడీ హితబోధలు పనిచేయగలవు. వారి భేటీ సుగమం కావాలి. మూడున్నరేళ్లుగా యుద్ధంలో మునిగిన రష్యా ఉక్రెయిన్‌ల మధ్య శాంతి సమకూరాలని ఆకాంక్షలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. యుద్ధకాంక్ష ఉన్న చోట శాంతికి ఎన్ని దారులున్నా వారి ఆకాంక్షలు తీరే వరకు యుద్ధం ఆపేందుకు ఏఅవకాశాలు సానుకూలంగా కనిపించవన్నసూత్రం రష్యా, ఉక్రెయిన్‌ల యుద్ధానికి వర్తిస్తుంది. ఉక్రెయిన్‌కు నాటో కూటమి తరహాలో అమెరికా ఐరోపా దేశాలు రక్షణ భరోసా ఇచ్చినా తనకేమీ అభ్యంతరం లేదంటూ పుతిన్ ఫ్రీ హ్యాండ్ ఇవ్వడమే అమెరికా ఐరోపా సమాఖ్య చేయజూస్తున్న సయోధ్యకు మార్గమయ్యేందుకు కీలకం కానుంది. నాటోలో ఉక్రెయిన్ చేరకూడదన్న షరతును పుతిన్‌దాదాపు వదులుకున్నందున రష్యా,ఉక్రెయిన్‌లమధ్య శాంతి కుదిరేందుకు ఏ ఇతర అభ్యంతరాలు అడ్డుకావు.

మన ప్రవర్తనలో ముందుగా మార్పువస్తే, సహజంగానే ప్రపంచంలోనూ మార్పు వస్తుంది.



షేక్‌స్పియర్

మిత భోజనం వల్ల ఆరోగ్యం, ఆయుష్షు, బలం, సుఖం, మంచితనం అనే ఆరు గుణాలు లభిస్తాయి.



అరిస్టాటిల్

# ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

**చట్టంలో ఉన్న లొసుగులు, లోపాలు, మినహా యింపులతో పార్టీలు మారుతున్న శాసనసభ్యులు తప్పించు కోగలుగుతున్నారు కానీ నైతికత ఒకటి ఉంటుంది ఆ నైతిక ప్రమాణాలను పాటిస్తే ఒక పార్టీ బీఫామ్‌పై గెలిచి మరొక పార్టీలోకి ఫిరాయించిన శాసనసభ్యుడు రాజీనామా చేయాలి. అలాగే సభాపతులు కేవలం చట్టం ప్రమాణికంగానే కాకుం డా కళ్లముందే పార్టీ మారిన వాస్తవాలు కనపడుతున్నాయి కాబట్టి పార్టీ మారిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలి. పార్టీలో నాయకులు సిద్ధాంతాల ప్రతిపదికను కాకుం డా అవకాశాలు అధికారం ప్రాతిపదికన పనిచేస్తున్నంతకాలం వలసలు ఫిరాయింపులు కొనసాగుతూనే ఉంటాయి. ఎలాంటి మినహాయింపులు లేకుండా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేసినప్పుడే ఫిరాయింపులను నిరోధిం చగలుగుతారు. ప్రజాస్వామిక విలువలను కాపాడటానికి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం మరింత పదును తేలాల్సిన అవసరం ఉంది.**



డాక్టర్ తిరునహరి శేషు

తెలంగాణ రాష్ట్రంలో 2023 శాసనసభ ఎన్నికల తరువాత పార్టీ మారిన 10మంది శాసన సభ్యుల అనర్హత పిటిషన్‌లపైమూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచనల నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులు, ఫిరాయింపుదారులపై అనర్హత వేటు మరొక మారు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిపోయింది.ఒకనాడు సిద్ధాంతాలు, భావజాల ప్రాతిపదికన పార్టీలు నాయకులు రాజకీయాలు చేస్తే నేడు మాత్రం అధికారం, అవకాశాల కోసమే నాయకులు రాజకీయాలుచేస్తున్నట్లుగా కనిపిస్తుంది. రాత్రికి రాత్రే కండువాలు మారుస్తూ పార్టీలు ఫిరాయిస్తున్న నాయకులతో రాజకీయ విలువలు మరింత దిగజారిపోతున్నాయి.ఒకనాడు హర్యానా, పంజాబ్ ఈశాన్య రాష్ట్రాలకి పరిమితమైన ఆయారాం, గయారామ్‌ల సంస్కృతి నేడు దేశవ్యాప్తంగా ఫిరాయింపు రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయి. రాష్ట్ర విభజన తరువాతతెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం అవకాశవాద అధికారదాహ రాజకీయాలకు ఫిరాయింపులకి కేంద్రంగా మారిపోయిందనే చెప్పాలి. 2014 తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల తరువాత కాంగ్రెస్, తెలుగుదేశం, బహుజన సమాజ్ పార్టీ, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ, సిపిఐ పార్టీలకు చెందిన 29 మంది శాసనసభ్యులు పార్టీ మారితే 2018 శాసనసభ ఎన్నికల తరువాత కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకి చెందిన 14 మంది శాసనసభ్యులు అలాగే 2023 శాసనసభ ఎన్నికల తర్వాత బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన పది మంది శాసన సభ్యులు అంటే మొత్తం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తర్వాత 53 మంది శాసనసభ్యులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడినారు. కానీ విచిత్రం ఏంటంటే ఇప్పటివరకు పార్టీ ఫిరాయించిన ఏ ఒక్క శాసనసభ్యుడు పై అనర్హత వేటు పడలేదు. ఈ దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పార్టీ ఫిరాయింపులు రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేయనే చెప్పాలి. నాటి అధికార బిఆర్‌ఎస్ నేటి అధికార కాంగ్రెస్ పార్టీలు రెండూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయనే అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. నాటి ప్రభుత్వంలో కీలకమైన ఉపముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తి పార్టీ ఫిరాయించటం నాటి శాసనసభ స్పీకర్ నేటి పార్టీ ఫిరాయింపుదారుడుగా ఉండటం కూడా తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులు పరాకాష్టకు చేరాయనే భావన వ్యక్తం అవుతుంది. వివాదాస్పదమవుతున్న స్పీకర్ల చట్టపరంగా పార్టీ ఫిరాయించిన శాసనసభ్యులపై చర్యలు తీసుకునే విషయంలో స్పీకర్లు కాలయాపన చేస్తున్నారనే అభిప్రాయాలు కలుగుతున్నాయి. అనేక రాష్ట్రాలలో స్పీకర్లు వ్యవహరిస్తున్న తీరు పై వాదానికి బలం చేకూర్చుతుంది. నిర్ణయాలు తీసుకోవటంలో స్పీకర్లు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధానాన్ని అనుసరిస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. 2023లో హిమాచల్‌ప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ నుండి ఆరుగురు శాసనసభ్యులు బిజెపిలోకి ఫిరాయిస్తే ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారంగా పార్టీఫిరాయించిన ఆరుగురు శాసనసభ్యులను అర్హులుగా ప్రకటించారు. కానీ అదే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ నుండి అధికార కాంగ్రెస్ పార్టీలోకి 10 మంది శాసన సభ్యులు ఫిరాయిస్తే ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోకపోవడం వివాదాస్పదమవుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 శాసనసభ ఎన్నికల తరువాత టిఆర్‌ఎస్ పార్టీకి చెందిన పదిమంది శాసనసభ్యులు నాటి అధికార కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయిస్తే అనర్హత వేటు వేయకుండా తీవ్ర



జాప్యం చేసి శాసనసభ కాల పరిమితి ముగియటానికి కొద్ది నెలల ముందు పార్టీఫిరాయించిన వారిపై వేటువేసిన ఉదంతంతో పాటు ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీ ఫిరాయించిన ఎనిమిది మంది శాసనసభ్యులపై కూడా అదే విధంగా వేటు వేసినారు. అనేక రాష్ట్రలలో శాసనసభ స్పీకర్లు చట్ట నిబంధనల మేరకు ఫిరాయించిన శాసనసభ్యులపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలతో పాటు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. చట్టం వచ్చినా ఆగని ఫిరాయింపులు పార్టీ ఫిరాయింపులకి అడ్డుకట్ట వేయాలనే తలంపుతో 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం చేసి పదో షెడ్యూల్‌లో చేర్చినారు. ప్రారంభంలో చట్టం బలంగా పని చేసిందని చెప్పాలి. చట్టాన్ని మరింత బలోపేతం చేయటం కోసం 2003లో 91 వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్‌కి సవరణలు చేశారు కానీ చట్టంలో ఉన్న మినహాయింపులను అడ్డంపెట్టుకొని ఫిరాయింపులను కొనసాగిస్తూనే ఉన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం వచ్చినతర్వాత ఫిరాయింపులు వ్యక్తిగత ఫిరాయింపుల స్థాయినుండి సామూహిక ఫిరాయింపుల స్థాయికి దారితీసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సభ్యుని ఫిరాయింపుపై నిర్ణయం తీసుకునే అధికారం కేవలం సభాపతి స్పీకర్‌కి ఇవ్వటం ప్రధాన లోపంగా కనిపిస్తుంది. 2/3 వ వంతు సభ్యులు పార్టీ మారినప్పుడు చట్టంవర్తించకుండా మినహాయించటం కూడా సామూహిక ఫిరాయింపులను ప్రోత్సహించే నిబంధనగా మారిపోయింది. చట్టం వచ్చిన తర్వాత ఫిరాయింపులు ఆగలేదు కానీ ఫిరాయింపులరూపం మారిందనే చెప్పాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన ఈదశాబ్ద కాలంలో పార్టీలు ఫిరాయించిన ఏ ఒక్క శాసనసభ్యుడి పైనైనా వేటుపడిన దాఖలాలు లేవు. గతంలో పార్టీ మారిన శాసనసభ్యులు ఫిరాయింపుల నిరోధక చట్టానికి దొరకకుండా ముక్కుమడిగా పార్టీలు మారి అనర్హత వేటు నుండి తప్పించుకున్నారు. గత రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ లెజిస్లేటివ్ పార్టీ బిఆర్‌ఎస్‌లో విలీనం కావడంతో ఫిరాయింపుల నిరోధక చట్ట పరిధిలోకి రాకుండా అనర్హత వేటునుండి తప్పించుకున్నారు కానీ ప్రస్తుతం బిఆర్‌ఎస్ పార్టీ నుండి ఫిరాయించిన పదిమంది శాసనసభ్యులు ఫిరాయింపుల నిరోధక చట్ట పరిధిలోకి వస్తారు. 2023శాసనసభ ఎన్నికలలో బిఆర్‌ఎస్ పార్టీ నుండి 39 మంది శాసనసభ్యులు విజయం సాధించారు. చట్టం ప్రకారంగా బిఆర్‌ఎస్ పార్టీ నుండి 26 మంది శాసనసభ్యులు పార్టీ ఫిరాయిస్తేనే వేటుపడకుండా తప్పించుకోగలుగుతారు కానీ పదిమంది శాసనసభ్యులుపార్టీ మారటం వలన వారిపై చట్ట ప్రకారంగా వేటుపడాలి. కానీ నిర్ణయాలు తీసుకునే అధికారం సభాపతిగా స్పీకర్‌కి ఉండటం వలన పార్టీ మారిన శాసనసభ్యులు ఇంతకాలం వేటు నుండి తప్పించుకోగలిగారు. పార్టీ మారిన పదిమంది శాసన సభ్యుల పైన వేటువేయాలని బిఆర్‌ఎస్ పార్టీ చట్టసభలను న్యాయస్థానాలలో పోరాటం చేస్తుంది. రాజ్యాంగం ప్రకారంగా కోర్టులకి ఉన్న పరిధి దృష్ట్యా స్పీకర్ తీసుకునే నిర్ణయాలలో కోర్టులు జోక్యం చేసుకోలేవు కాబట్టి సుప్రీంకోర్టు తెలంగాణ శాసనసభ స్పీకర్‌కి పార్టీ ఫిరాయించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది శాసనసభ్యులపైమూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని ఒక సూచన మాత్రమే చేసినది. కాబట్టి ఆ పది మంది శాసనసభ్యుల వివరణ మరొకసారి స్పీకర్ కోరి ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. పార్టీ మారిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించే అధికారం చట్ట ప్రకారంగా కోర్టులకు లేదు కాబట్టి తుది నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోగలుగుతారు. పార్టీ ఫిరాయించిన శాసనసభ్యులపై వేటు పడటానికి ఒక్క అవకాశమే ఉంటే వేటునుండి తప్పించుకోవటానికి అనేక మార్గాలున్నాయి. చట్టంలో ఉన్న లొసుగులు, లోపాలు, మినహాయింపులతో పార్టీలు మారుతున్న శాసనసభ్యులు తప్పించుకోగలుగుతున్నారు కానీ నైతికత ఒకటి ఉంటుంది ఆ నైతిక ప్రమాణాలను పాటిస్తే ఒక పార్టీ బీఫామ్‌పై గెలిచి మరొక పార్టీలోకి ఫిరాయించిన శాసనసభ్యుడు రాజీనామాచేయాలి. అలాగే సభాపతులు కేవలం చట్టం ప్రమాణికంగానే కాకుండా కళ్లముందే పార్టీ మారిన వాస్తవాలు కనపడుతున్నాయి కాబట్టి పార్టీ మారిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలి. పార్టీలో నాయకులు సిద్ధాంతాల ప్రతిపదికను కాకుండా అవకాశాలు అధికారం ప్రాతిపదికన పనిచేస్తున్నంతకాలం వలసలు ఫిరాయింపులు కొనసాగుతూనే ఉంటాయి.ఎలాంటి మినహాయింపులు లేకుండా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేసినప్పుడే ఫిరాయింపులను నిరోధించగలుగుతారు. ప్రజాస్వామిక విలువలను కాపాడటానికి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం మరింత పదును తేలాల్సిన అవసరం ఉంది. ●

# పునరుత్పాదక ఇంధనాలే రేపటి శక్తికి నిధులు!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జన్మదినం రోజున భారత ప్రభుత్వ పునరుత్పాదక శక్తి మంత్రిత్వశాఖ 2004 నుంచి ప్రతి ఏటా నిర్వహిస్తున్న జాతీయ పునరుత్పాదక శక్తి దినోత్సవం లేదా నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీడే పాటించడం జరుగుతున్నది. పునరుత్పాదక లేదా తరగని శక్తి వనరులను విరివిగా వాడుకోవడం,అవగాహన కలిపించడం, ప్రయోజనాలను వివరించడం, తరిగే శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించడం, పునరుత్పాదక శక్తిని సులభంగా ఉత్పత్తి చేయడం, పునరుత్పాదక శక్తి అభివృద్ధికి తగిన సాంకేతిక పరిజ్ఞానాలను మెరుగుపరచడం లాంటి అంశాలను సామాన్య జనాలకు వివరించడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2025 జాతీయ పునరుత్పాదక శక్తి దినోత్సవం సందర్భంగా పోటీతత్వంతో తరగని ఇంధనాలను ఉత్పత్తి చేయడం, సమిష్టిగా శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడంతో పాటు వాతావరణ సమతుల్యతకు కృషి చేయడానికి నేటి ప్రభుత్వమే కాకుండా పౌర సమాజం కూడా నిరంతర కృషిని కొనసాగించాలి. సహజ వనరుల నుండి ఎంత కాలం వాడినా, ఎంత పరిమాణం ఉత్పత్తి చేసినా తరగని ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి చేసే శక్తిని పునరుత్పాదక లేదా తరగని శక్తి అని అంటాం. సూర్యరశ్మి (సౌర శక్తి), గాలి (పవన శక్తి), సముద్రం (అలల శక్తి), నదులు లేదా జలాశయాలు (జల విద్యుత్తు శక్తి), నీటి బుగ్గలు (భూ ఉష్ణశక్తి), బయోమాస్ (జీవ ఇంధనాలు) వంటి సహజ తరగని శక్తి వనరుల నుంచి ఉత్పన్నం చేస్తున్న శక్తిని పునరుత్పాదక లేదా తరగని శక్తి లేదా సాంప్రదాయేతర శక్తి" అని అర్థం చేసుకోవాలి. అనాదిగా మనం వాడుతున్న సాంప్రదాయ వనరులైన బొగ్గు, డిజిల్, పెట్రోల్, కిరోసిన్, వంట గ్యాస్ లాంటి వనరులను శిలాజ ఇంధనాలు లేదా సాంప్రదాయ తరిగే ఇంధనాలుగా పిలుస్తున్నాం. ఇవి ప్రకృతిలో పరిమితంగా ఉంటాయి.వీటిని వాడిన కొద్దీ క్రమంగా తగ్గుతాయి. కొంత కాలం తర్వాత ఈ వనరులు పూర్తిగా అయిపోవచ్చు. ఇలాంటి భూమి నుంచి లభించే శిలాజ ఇంధనాలను వాడినపుడు కార్బన్ ఉద్గారాలు విడుదల అవడం వల్ల భూతాపంతో పాటు పర్యావరణ కాలుష్య సమస్య కూడా ఉత్పన్నం అవుతున్నది. పునరుత్పాదక శక్తి వినియోగం ఫలితంగా వాతావరణ కాలుష్యం తగ్గడం, కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో భూతాపం అదుపులో ఉండడం, నిరంతరం అందుబాటు ఉంటూ సుస్థిరాభివృద్ధికి దోహదపడడం, ఉద్యోగ ఉపాధులు కల్పించడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. నేటివరకుభారత దేశంలో ఉత్పత్తి అవుతున్న 452 గీగా వాట్ల విద్యుచ్ఛక్తిలో దాదాపు 46 శాతం (191 గీగా వాట్లు) పునరుత్పాదక శక్తి వినియోగపడుతున్నది. నేడు దేశవ్యాప్తంగా 203 గీగావాట్ల విద్యుత్తు తరగని ఇంధన వనరుల నుంచి ఉత్పత్తి అవుతుండగా, 2030 నాటికి 500 గీగా వాట్ల సామర్థ్యానికి పెంచాలని ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నది. ప్రపంచ దేశాల్లో అధికంగా పునరుత్పాదక శక్తి ఉత్పత్తి చేస్తున్న దేశాల జాబితాలో (అమెరికా, చైనా, బ్రెజిల్ తర్వాత) భారత్‌కు 4వ స్థానం లభించడం హర్షదాయకం. ●

# కొత్త చరిత్ర లిఖించే సామర్థ్యం యువతకే

డి జె మోహన రావు

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. తాజా నివేదికల ప్రకారం, మన దేశం మొత్తం జనాభాలో 15 నుండి 29ఏళ్ల వయస్సుగల యువ జనాభా 42కోట్ల మంది ఉన్నారు. వీరు మొత్తం జనాభాలో సుమారు 29శాతం ఉన్నారు. భారతదేశ భవిష్యత్తుకు యువతే మూల స్తంభాలు. వారి కలలు, ఆశయాలు, శక్తి దేశాభివృద్ధికి చోదక శక్తులు. నేటి యువత కేవలం రేపటి నాయకులు మాత్రమే కాదు, నేటి మార్పులకూ నాయకులు. సాంకేతికతను, సృజనాత్మకతను ఉపయోగించి దేశాన్ని సరికొత్త శిఖరాలకు చేరుస్తున్నారు. కష్టాలకు వెరవని ధైర్యం, సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగే పట్టుదల, సమాజంలో మార్పు తీసుకురావాలన్న తపన ఇవే భారత యువతకు ఉన్న ముఖ్య లక్షణాలు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ, సవాళ్లను ఎదుర్కొంటూ, భారత యువత కొత్త చరిత్రను లిఖిస్తోంది. వారి శక్తి, సామర్థ్యం దేశ ప్రగతికి కొత్త దిశానిర్దేశం చేస్తాయి. ప్రస్తుత యువత వివిధ దేశాల యువతతో కలిసి వాతావరణ మార్పు, టెర్రరిజం, ఆర్థిక అసమానతలు వంటి అంతర్జాతీయ సమస్యలపై పని చేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి యూత్ ఫోరం వంటి అంతర్జాతీయ వేదికలపై మాతృదేశ గళాన్నివినిపిస్తున్నారు. సాంకేతికతను ఉపయోగించి యువ పారిశ్రామికవేత్తలు కొత్త స్టార్టప్‌లను స్థాపించి, సామాజిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను అందిస్తున్నారు. ఈ సానుకూల అంశాలతో పాటు, తమ కలలు, ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి యువత కొన్ని సవాళ్లను కూడా ఎదుర్కొంటున్నారు. ఈ సవాళ్లు కేవలం వ్యక్తిగత సమస్యలు కాదు. భారతీయ విద్యా వ్యవస్థ సిద్ధాంతపరమైన జ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. కానీ పరిశ్రమలకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను అందించడంలోవిఫలమవుతోంది. దీని ఫలితంగా, ఉన్నత విద్య పూర్తి చేసిన యువతలో కూడా నిరుద్యోగ రేటు ఎక్కువగా ఉంది. పట్టభద్రులలో నిరుద్యోగ రేటు 29.1 గా ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ భారతదేశ ఉపాధి నివేదిక 2024 తెలిపింది. ఇది వారి నైపుణ్యాలకు, ఉద్యోగ మార్కెట్ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టంగా సూచిస్తోంది. ఉద్యోగ లేమి, ఆర్థిక అనిశ్చితి, సామాజిక ఒత్తిళ్లు, పోటీ వాతావరణం వంటివి యువతపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ గణాంకాల ప్రకారం, దేశంలో రోజుకు సుమారు 30మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇది యువతలో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యలకు, తగిన మద్దతు వ్యవస్థ లేకపోవడానికి స్పష్టమైన నిదర్శనం. భారతదేశం డిజిటల్ విప్లవంలో దూసుకుపోతున్నప్పటికీ, గ్రామీణ, పట్టణ యువత మధ్య డిజిటల్ విభజన ఇంకా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ, స్మార్ట్‌ఫోన్ల లభ్యత తక్కువగా ఉన్నాయి. ఇది వారికి ఆన్‌లైన్ విద్య, ఉద్యోగ అవకాశాలు, సమా



చారం అందుబాటులోకి రాకుండా అడ్డుకుంటోంది. 2023లో సెంటర్ ఫర్ డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, గ్రామీణ యువతలో కేవలం 35 మందికి మాత్రమే ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉంది. యువత జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, రాజకీయ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో వారి భాగస్వామ్యం తక్కువగా ఉంది. రాజకీయ రంగంలో మార్పులు తీసుకురావాలన్న ఆసక్తి ఉన్నప్పటికీ, అందుకు తగిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లభించడం లేదు. దీనివల్ల విధానాల రూపకల్పన, అమలులో తమ గళాన్ని వినిపించలేకపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రాజెక్టుల వంటి వాటిలో అవినీతి కారణంగా యువత నిరాశకు గురవుతున్నారు.మెరిట్ ఉన్నప్పటికీ, సరైన అవకాశాలు లభించకపోవడం వారిలో అసంతృప్తిని పెంచుతోంది.పారదర్శకత లోపించడంవల్ల ప్రభుత్వ వ్యవస్థలపై వారికి నమ్మకం సన్నగిల్లుతోంది. మహిళా యువత ఇంకా అనేక రంగాల్లో అసమానతలను ఎదుర్కొంటున్నారు. విద్య, ఉద్యోగ అవకాశాలు, సమాజంలో గుర్తింపు వంటి విషయాల్లో వారికి పురుషులతో సమాన అవకాశాలు లభించడం లేదు. ఇది దేశ అభివృద్ధికి ఒకపెద్ద అడ్డంకిగా ఉంది. నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడానికి, పాఠ్య ప్రణాళికలో మార్పులు తీసుకురావాలి. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా విద్యా వ్యవస్థను సంస్కరించాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆచరణాత్మక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లను తప్పనిసరి చేయాలి. స్కిల్ ఇండియా మిషన్ వంటి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. విద్యా సంస్థలు, కార్యాలయాల్లో మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. యువతకు సహాయం అందించే హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేసి, వాటి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని విస్తరించాలి. డిజిటల్ అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కార్యక్రమాలను చేపట్టాలి. ఉపాధి అవకాశాలను కల్పించడానికి స్టార్టప్‌లను, చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి. వీటికి అవసరమైన ఆర్థిక వనరులు, సరళమైన రుణ విధానాలను అందుబాటులోకి తీసుకురావాలి. పాఠశాలలు, కళాశాలల్లో రాజకీయ వ్యవస్థ, పౌర బాధ్యతలపై అవగాహన కల్పించాలి. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడానికి యువ పార్లమెంట్‌లు, డిబేట్‌ల వంటి కార్యక్రమాలను నిర్వహించాలి. రాజకీయ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువత భాగస్వామ్యాన్ని పెంచాలి. పంచాయతీల నుండి పార్లమెంట్ వరకు యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలి. ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకతను పెంచడానికి డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించాలి. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, ప్రాజెక్టుల కేటాయింపుల్లో పారదర్శకతను కచ్చితంగా పాటించాలి. అవినీతికి వ్యతిరేకంగా పోరాడే యువ సంస్థలకు మద్దతు ఇవ్వాలి. పాఠశాలల నుంచే లింగ సమానత్వం గురించి బోధించాలి.మహిళా యువతకు విద్య,ఉపాధిలో సమాన అవకాశాలు కల్పించాలి. ఉద్యోగాల్లో లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించే చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి.రేపటి భారతదేశానికి పునాదులు వేయగల యువత భవిష్యత్తుకు సంబంధించిన సవాళ్ళను పరిష్కరించడం ద్వారా, మన దేశంలోని యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవచ్చు. ఇది దేశాన్ని సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా వేగంగా నడిపిస్తుంది. ●

# ప్రజావాక్కు



## నీతి లేని చదువు జీతాల చేటు

రక్తి లేని యాట రాత్రి నిద్దుర చేటు, భక్తి లేని పూజ పత్రి చేటు, నీతిలేని చదువు జీతాల చేటురా అని తెలుగుబాల శతకంలో కరుణశ్రీ చెప్పినట్లు నీతి లేని చదువులే ఎక్కువౌతున్నాయి. సార్వత్రిక విద్యలు, ఒకే సంవత్సరంలో రెండు సంవత్సరాల ఇంటర్, ఒకే ఏడాదిలో మూడు సంవత్సరాల డిగ్రీ,రెండు సంవత్సరాల పి.జి.కోర్స్ చదవకుండానే సర్టిఫికేట్,డబ్బులకుడాక్టరేట్ పట్టాలతో? ప్రమోషన్ల కోసంపరపతిని, ధనాన్ని వినియోగించి మీది మీదికి ఉన్నతోద్యోగులుగా కీలకమైన స్థానాల్లో స్థిరపడి, మాతృ సంస్థలకు చేయవలసిన పనుల నైపుణ్యం కొరవడి, దానిని కప్పిపుచ్చుకోవడానికి, వారి ఉన్నతోద్యోగ ఆధిక్యాన్ని ప్రదర్శించుకోవడానికి సంస్థలోని ఇతర నిజాయితీగా పని చేసిన ఉద్యోగుల చెడ్డచేస్తూ గొప్పవారిగా చెలామణీ అవుతుంటారు. వీరు వచ్చిన మార్గం అక్రమం కావున ఫ్రాడ్ పాలకులుగా మారుతారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

## మోసపోతున్న భక్తులు

ప్రపంచంలో అతి పెద్ద వైభవ ప్రాచుర్యం కల్గిన దేవుడు తిరుపతి నారాయణుడు. దాని పరిపాలన పరిధి కూడా అంతే.ధనంతో ప్రమేయం లేకుండా ఏ ఏర్పాట్లు అయినా సులువుగా చేయొచ్చు. గానీ భక్తులదర్శనానికి దేవస్థానం వసతిగానీ ప్రత్యేకదర్శన టిక్కెట్లు గానీఆన్లైన్‌లో భక్తులకు మోసగించి నకిలీ ఫేస్బుక్ లేక ఇంటర్నెట్‌లో చదువుకున్న వారినిసైతందగా చేస్తున్నారు.ఇక్కడ భక్తుల అతితోందర, అజ్ఞానం ఉండొచ్చు.గానీ వారికి ఆవెబ్సైట్లు, వగైరా ఎలా పొందుచున్నారు ఆశ్చర్యం తప్పదు.ఎన్ని సూచనలు ఇచ్చినా, దేవస్థానం నిఘా వ్యవస్థ తగిన చర్యలు చేయాలి. ఏ సడలింపు లేకుండా వారి ఆగడాలను అరికట్టాలి.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## విపత్తులను ముందే గుర్తించాలి

ప్రపంచంలో వచ్చేసమస్యలను విపత్తులనుగుర్తించి ప్రభుత్వాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటేఆస్తి, ప్రాణనష్టాలు జరిగే అవకాశంఉంది.ముఖ్యంగా తుఫానులు, భూకంపాలు, సునామీలు,ప్రకృతి ప్రళయాలు, కాలుష్యం,కార్చిచ్చులు,లావాలు,తదితర విపత్తులనుండి బయటపడేందుకు ప్రజలను అప్రమత్తం చేయాలి.ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

## సమస్యకు పరిష్కారం చూపాలి

ఆగస్టు 15వ తారీకున ట్రంప్‌కు పుతిన్‌కు మధ్య అమెరికాలోని అలాస్కా రాష్ట్రంలో ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధ పరిసమాప్తికోసం జరిగినచర్చలు ఫలప్రదమయ్యాయని ఇద్దరు మహానేతలు చెప్పుకున్నారు. కాని యుద్ధం ఆపడానికి రష్యా అధినేత పూర్తిగా సమ్మతించినట్టు లేదు. ఉక్రెయిన్ అధినేత జలెన్ స్కీ లేకుండాసంధి ఏలాసాధ్యం? యుద్ధాలు చేసుకుంటున్న దేశాలు స్వయంగా ఒప్పందాలు చేసుకుంటేనే కదా సమస్యలు సమసిపోయేది.ఉక్రెయిన్‌లోఆపారంగా లభించే భూగర్భసంపద అమెరికాకు కావాలి. అందుకోసం యుద్ధం ఆపాలి. ఈ యుద్ధంలో ఇరు దేశాలకు చెందిన వేలాది మంది సైనికులు, అమాయక పౌరులు ప్రాణాలు పోతున్నాయి. ఆస్తులు, ఆయుధాలు, ఆర్థిక వ్యవస్థ నాశనమోతున్నాయి. జలెన్ స్కీ కోరుతున్నట్లు భారత ప్రధాని నరేంద్ర మోడీ కూడా చర్చల్లో పాల్గొంటేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందేమోననిపిస్తోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## సవాలు విసురుతున్న ప్రకృతి విపత్తు

మేఘ విస్ఫోటనం అనేది వాతావరణశాస్త్రంలో అత్యంత విధ్వంసకరమైన ప్రకృతి విలయ ఘటనల్లో ఒకటి. ఇది తక్కువ కాలవ్యవధిలో, స్వల్పవిస్తీర్ణంలో అసాధారణ వర్షపాతం కురిసే పరిస్థితి. శాస్త్రీయంగా, 1015చ.కి.మీ.పరిధిలో గంట వ్యవధిలో 10 సెం.మీ. కంటే ఎక్కువ వర్షం పడితే దానిని మేఘ విస్ఫోటనంగా నిర్వచిస్తారు. సాధారణ వర్షం క్రమంగా కురుస్తుంది. అయితే మేఘ విస్ఫోటనంలో నీరు ఒక్కసారిగా కురవడం వల్ల నాశనం విపరీతమవుతుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, పర్యావరణ సున్నిత భూభాగాల్లో ఇవిఎక్కువగా చోటుచేసుకునే ప్రాంతాలు. ఒరోగ్రాఫిక్ లిఫ్టింగ్, కాన్వెక్టివ్ అస్థిరత్వం, మాన్సూన్ ప్రభావం, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ సంఘర్షణ వంటి కారకాలు దీనికి ప్రాథమిక శక్తులుగా నిలుస్తాయి.

- వెంకట రమణ గిలకత్తుల, హైదరాబాద్

## ఓట్ల చోరీ

నిత్య జీవితంలో ప్రజాస్వామికరణ ప్రజాస్వామ్యం అనే మాటను విరివిగా వాడుతుంటాము. ఆ ప్రజాస్వామికరణ నిలబడడానికి పౌరులకు అధికారణ 324 ద్వారా రాజ్యాంగ రూపకర్తలు ఇచ్చారుకదా. మరి ఎందుకు పౌరులు బ్రతికుండగానే చంపివేస్తున్నారు అనేది ఒక అంశం. ఇకపోతే కర్ణాటకలోని ఒక నియోజక వర్గంలోనే ఒక లక్ష ఓట్ల దాకా ఓట్ల చోరీ జరిగింది.

-భారత అవినాష్, జనగామ

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసిన మానవత సేవా సంస్థ



**ఒంగోలు, ప్రభాతవార్త**
ప్రపంచ మానవతా దినోత్సవ సందర్భంగా మానవత సేవా సంస్థ పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసింది.మానవత సేవ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు అంబేద్కర్ భవనం దగ్గర మేడిశెట్టి సుబ్బారావు ఆర్థిక సహకారంతో పేదలకు బియ్యం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచ మానవత దినోత్సవ సందర్భంగా నిత్యవసర వస్తువులు పేదలకు అందజేశామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు చెందిన పేదలకు మానవతా సంస్థ అండగా నిలుస్తుందని తెలిపారు. సేవ చేస్తే దేనిలో దక్కని ఆత్మసంతృప్తి దీనిలో దొరుకుతుందని మానవుని ఆయస్సు పెరుగుతుందని తెలిపారు. అందరూ మానవతా సేవా సంస్థ సభ్యులుగా చేరాలని కోరారు. ఈ సేవ కార్యక్రమంలో నైనాల రామకృష్ణ సర్దార్ భాష, నేరెళ్ళ శ్రీనివాసరావు, చిక్కాల కిరణ్ కుమార్, గొల్లపూడి రవి, జనసేన శ్రీనివాసరావు, దివ్య, షహనాజ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వరల్డ్ ఫోటోగ్రఫీ డే




**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలు నగరంలో వరల్డ్ ఫోటోగ్రఫీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ది ఒంగోలు ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేసన్ ఆధ్వర్యంలో ఒంగోలు గుప్తాస్ స్క్వేర్‌లో నిర్వహించిన వరల్డ్ ఫోటోగ్రఫీ డే వేడుకల్లో పెద్ద సంఖ్యలో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ వైద్య శిబిరంలో షుగర్, శ్వాస కోశ నిపుణులు డాక్టర్ మహమ్మద్ జహంగీర్ సుల్తార్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కే.వెంకట హరీష్ కుమార్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులకు పోస్టల్ భీమా, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ పత్రాలను, ఫోన్ పే స్కానింగ్ బాక్స్‌లను అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దగ్గుపాటి వెంకటరావు మాట్లాడుతూ అసోసియేషన్ పతిష్టానానికి సభ్యులు అందరూ సహకరించాలన్నారు. సభ్యుల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ దొడ్డా చంద్రశేఖర్,ట్రెజరర్ నబీరసూల్, గౌరవ సలహాదారులు ఉదయ్ హరి, ఉపాధ్యాక్షుడు ఉప్పుటూరి చంద్రశేఖర్, ప్రసాద్, రమణ మాధవరావు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తులు

- జిల్లాలో కొత్తగా 29 బార్లు కేటాయింపు - గీత కార్మికులకు 3 కేటాయింపు
- 28న ఒంగోలులో లాటరీ ప్రక్రియ



**ఒంగోలు, ప్రభాతవార్త**
జిల్లాలో కొత్తగా 29 బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 26 గీత కార్మికులకు 3 బార్ అండ్ రెస్టారెంట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈనెల 31వ తేదీ నాటికి గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన బార్ల పాలసీ గడువు ముగియనున్నది. దీంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. జనాభా ప్రతిపాదికన బార్లకు లైసన్స్ ఫీజులను కేటాయించారు. బార్ల సమయ వేళను ఉదయం 10నుంచి రాత్రి 12గంటల వరకు పెంచారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగష్టు 31వ తేదీ వరకు మూడేళ్ల పాటు కొత్త పాలసీ అమల్లో ఉంటుంది. కొత్త పాలసీ ప్రకారం జిల్లాకు 29 బార్లు కేటాయించారు. ఒంగోలు నగరానికి 16, మార్కాపురానికి 5 కేటాయించారు. పొదిలి, కనిగిరి, దర్శి, చీమకుర్తి, గిద్దలూరుకు ఒక బార్‌ను కేటాయించారు. ఒంగోలు నగరంతో పాటు మార్కాపురంకు ఒక్కో దానికి రూ.55లక్షలు లైసెన్స్ ఫీజులు నిర్ణయించారు. మిగతా బార్లకు రూ.35లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 18వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. 28వ తేదీ ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన బార్లు కేటాయించనున్నారు. జిల్లాలో గీత కులాల కోసం 3 బార్లను కేటాయించారు. డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ.5లక్షలను డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ పేరు మీద ప్రాసెసింగ్ ఫీజును రూ.10వేలను సమర్పించి దరఖాస్తును పూర్తి చేసి ఎక్సైజ్ కార్యాలయంలో అందించాలి.

### నిబంధనలు ఇవే :

ఒక వ్యక్తి ఎన్ని బార్లు అయినా, ఎన్ని దరఖాస్తులు అయినా చేయవచ్చు. ఎన్ని బార్ లైసన్సులు అయినా పొందవచ్చు. 21 ఏళ్ల దాటిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలి. ఒక్కో దరఖాస్తు నాన్ రిఫండబుల్ రుసుం రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు చెల్లించాలి. దరఖాస్తు విధానం పూర్తయ్యాక దరఖాస్తు దారుడు రిజిస్ట్రేషన్ సర్టిఫికేటు, ఎంట్రీ పాస్‌లను డౌన్లోడ్ చేసుకుని లాటరీ జరిగే ప్రదేశానికి చేరుకోవాలి. ప్రతి దరఖాస్తుతో పాటు రెండు పాస్ ఫోర్ట్‌సైజు ఫొటోలు గుర్తింపు కార్డు, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్ కార్డును జత చేయాలి. దరఖాస్తు దారుడితో పాటు మరొకరికి మాత్రమే లాటరీ జరిగే ప్రదేశానికి అనుమతి ఉంటుంది. బార్ కేటాయించిన వెంటనే సంవత్సరం లైసెన్సు ఫీజులోని ఆరో వంతు మొత్తాన్ని అదే రోజుకు చెలానా రూపంలో చెల్లించారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వచ్చిన తరువాత మాత్రమే లాటరీ తీస్తారు .ఒక వేళ రాకుంటే కమీషనర్ దరఖాస్తు సమయాన్ని పొడిగిస్తారు. అయినా రాకుంటే ఆ బార్ కు రీ నోటిఫికేషన్ ఇస్తారని ఎక్సైజ్ అధికార వర్గాలు తెలిపాయి.

# ప్రకాశం



తెలుగు వాకిలి దినపత్రిక వార్త

## ఎమ్మెల్యే కందులను సత్కరించిన భగత్‌సింగ్ కాలనీవాసులు



**మార్కాపురం రూరల్, ఆగస్టు 19 ,ప్రభాతవార్త**
పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోగల తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయం నందు మంగళవారం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డిని కలిసి 16వ వార్డు ప్రజలు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గత 30సంవత్సరాల నుంచి నివాసముంటున్న భగత్‌సింగ్ కాలనీ వాసులకు ఇంటి పట్టాలను మంజూరు చేయించిన ఎమ్మెల్యే నారాయణ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ త్వరలో ఇంటి పట్టాలను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేని సన్మానించిన వారిలో 16వ వార్డు కౌన్సిలర్ దరివేముల హర్షిత బాబి, వార్డు ఇన్చార్జి చల్లగాలి విద్యాసాగర్, వార్డు నాయకులు కాయకాకుల తిరుపతయ్య,, తిరుమల శెట్టి శివ, జానపాటి గంగయ్య, జక్కి వెంకటేశ్వర్లు, పంది శ్రీను, చెవుల పౌల్ రాజు, గోమసాని చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## యూరియాను వ్యవసాయ అవసరాలకు ఉపయోగించాలి

**ఒంగోలు, ప్రభాతవార్త**
జిల్లాకుకేటాయించిన యూరియాను వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా కలెక్టర్‌క్యాంపు కార్యాలయం లో యూరియా వినియోగంపై జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా వినియోగంపై డీఎస్ఓ, ఇండస్ట్రీస్, లేబర్, ఎక్సైజ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, డీటీసీ, విజిలెన్స్ అండ్ ఫోర్స్‌మెంట్, పోలీసు, అగ్రికల్చర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.యూరియా వ్యవసాయానికి కాకుండా వేరేదానికి ఉపయోగించారా అనేది కనిపిపెట్టాలని,ఇందుకు సంబంధించి ఆయా శాఖల అధికారులు కలిసికట్టుగా తనిఖీలు నిర్వహించి సమగ్ర నివేదిక అదించాలన్నారు. సౌర సరఫరాల శాఖతో సమన్వయం చేసుకుని ఎడీబీఎల్ యుయూనిట్లను తనిఖీలు చేయాలన్నారు. పరిశ్రమ,కార్మిక విభాగాలు, కాలుష్య బోర్డుతో సమన్వయం చేసుకుని ప్లేవుడ్/రెసిన్ యూనిట్ల తనిఖీలు చేయాలని, పరిశ్రమ కార్మిక విభాగాలు, కాలుష్య బోర్డుతో సమన్వయం చేసుకుని పెయింట్స్/ వార్నిష్ యూనిట్ల తనిఖీలు చేయాలని ఆదేశించారు. సరిహద్దు రాష్ట్రాలకు సబ్సిడీ యూరియాను, ఎరువులను అనధికారికంగా తరలింపును నిరోధించడానికి విజిలెన్స్, రవాణా,పోలీసు శాఖల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంత యూరియా కేటాయించారు. ఎంత పంపిణీ చేశారు తదితర వివరాలకు సంబంధించిన నివేదిక అందించాలన్నారు. జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏప్రిల్ నుంచి ఆగష్టు నెల వరకు 54,468 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌కు జిల్లాలో 27,111మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఇప్పటి వరకు జిల్లాకు 34,051



మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ఇప్పటి వరకు 30,565 మెట్రిక్ టన్నుల యూరియావిక్రయించగా,ఇంకా జిల్లాలో 30,597 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, డీటీసీ సుశీల, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, లేబర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్.. సూపర్ హిట్

- ప్రజాదరణ చూసి ఓర్వలేకే వైకాపా విమర్శలు...
- కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రశంసల వెల్లువ...
- దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శం.
- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**మార్కాపురం ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలు రాష్ట్రంలో సూపర్ హిట్ అయ్యాయని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మార్కాపురం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, శ్రీ శక్తి, గ్యాస్ సిలిండర్ రాయితీ వంటి సంక్షేమ పథకాల అమలు ద్వారా కూటమి ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ప్రశంసల వెల్లువ కురిపిస్తున్నారన్నారు కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే సూపర్‌సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు చేస్తుంటే ఓర్వలేని వైసిపి నాయకులు, "బాబు షూరిటీ - మోసం గ్యారంటీ" అంటూ తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు గత రెండు నెలల్లోనే ముఖ్యమైన పథకాలను అమలు చేసి, ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చినప్పటికీ వైసిపి తట్టుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. 75 ఏళ్ల వయసులో కూడా నారా చంద్రబాబు నాయుడు యువకుడి మాదిరిగా ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకొని పథకాల రూపకల్పన చేసి అమలు చేస్తున్నారని ప్రశంసించారు.ఐదేళ్ల వైకాపా పాలనలో ప్రజల్లోకి వెళ్లారా పథకాల తీరుతన్నులు తెలుసుకున్నారా.. ప్రజల బాగోవులు అడిగి తెలుసుకున్నారా.. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన మీరా కూటమి ప్రభుత్వాన్ని విమర్శించేది అంటూ వైకాపాపై మండిపడ్డారు.అమరావతి రాజధానిపై వైసిపి నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ,ప్రజల ఆశయాలకు,విరుద్ధంగా వ్యవహరించే వారిని ప్రజలు తప్పక గుణపాఠం గత ఎన్నికల్లో చెప్పారని మర్చిపోవద్దు అన్నారు. ఇదే పద్ధతి కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో ఒక్క సీటు దక్కదని కూడా హెచ్చరించారు. ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం మూడు రాజధానులు అంటూ రాష్ట్ర ప్రజలను అయోమయాన్ని గురిచేసి రాష్ట్ర ప్రతిష్టనుగంగ లోకలిపేసారన్నారుప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. తప్పుడు ప్రచారాలతో ప్రజలు మోసపోవడం జరగదన్నారు.వెలుగొండ ప్రాజెక్టును ఐదేళ్లు పట్టించుకోలేదని, కనీసం నిర్వాసితుల కాలిన నిర్మాణాన్ని కూడా నిధులు మంజూరు చేయకుండా ముందు చేయి చూపారన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పట్ల నిరక్ష్య వైఖరి ప్రదర్శించి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. కరువు కాటకాలతో అలమటించే పశ్చిమ ప్రాంత ప్రజలు వెలిగొండ ప్రాజెక్టు పూర్తవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారని కానీ వైకాపా ప్రభుత్వం వారి ఆశల పై నీళ్లు చల్లి మట్టి విదిలిచ్చిప్రజల చెవుల్లో పువ్వులు పెట్టి మోసంచేశారన్నారు. మార్కాపురం డివిజన్ ను ప్రత్యేక జిల్లా చేయాలని ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారని, ప్రజల ఆకాంక్షలను పరిగణలోకి తీసుకోకుండా వైకాపా మొండి చేయి చూపిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తున్నారన్నారు.మార్కాపురం జిల్లా ఏర్పాటుతో పాటు వెలుగొండ ప్రాజెక్టు కూడా కూటమి ప్రభుత్వ హయాంలోని పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టంచేశారు. రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు





నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. 75 వేలకోట్లరూపాయలతో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతుందన్నారు.దేశానికి ఆదర్శంగా అమరావతి రాజధాని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు మాలపాటి వెంకటరెడ్డి,సొసైటీ అధ్యక్షులు జవ్వాజి రామాంజనేయరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు వక్కలగడ్డ మల్లికార్జునరావు, సీనియర్ నాయకులు కాకర్ల శ్రీనివాసులు, దూదేకుల మస్తాన్,నాసర్‌రెడ్డి,షేక్ ఖాసిం, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీలు తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి

**కొండపి,ఆగస్టు 19, ప్రభాతవార్త**
కొండపి మండలంలోని ముప్పవరం వెన్నూరు పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు మంగళవారం తనిఖీ చేశారు పంచాయతీల్లో సేకరించిన తడి చెత్త పొడి చెత్త లను వర్మి కంపోస్టర్ కేంద్రాల్లో వర్మ పోస్ట్ తయారు చేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా పారిశుధ్య పనులలో ముందు ఉండేలా పంచాయతీ అధికారు తగు చర్యలు తీసుకోవాలి అని పంచాయతీ సిబ్బంది కి తెలియజేసారు. పంచాయతీ లలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్ల పరిస్థితి మొదలైన వాటి గురించి గ్రామ పంచాయతీ అధికారుల ను అడిగి తెలుసుకున్నారు.

## ఉల్లాస్- అక్షర ఆంధ్ర అక్షరాస్యతపై శిక్షణ







**ఒంగోలు ,ప్రభాతవార్త**
ఒంగోలు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధ్యక్షతన జిల్లా అధికారుల సమక్షంలో ఎంపీడీఓ, ఎంఈఓ, డీఆర్‌డీఏ, ఏపీఎం, డీడబ్ల్యూఎంఏ, ఏపీఓ, నగర పాలక కమీషనర్లు, సిటీమిషన్ మేనేజర్లకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం మంగళవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్-అక్షర ఆంధ్ర అక్షరాస్యత కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, దీనికి సంబంధించి సంబంధిత జిల్లా అధికారులందరూ తమ సహకారం తోడ్పాటు అందించాలని తమ ప్రసంగంలో కోరారు.15-19 సంవత్సరాల మధ్య నిరక్షరాస్యులైన వయోజనులకు ఉద్దేశించిన సాంకేతికత, వయోజన విద్య అందుబాటులోకి తెచ్చే కార్యక్రమమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో స్వచ్ఛంద బోధకులుగా కనీసం 10వ తరగతి విద్యార్హత గల వారు ఎవరైనా సరే 10 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయవలసి ఉంటుందని చెప్పారు. ఇది స్వచ్ఛందంగా జరిపే కార్యక్రమమని తెలియజేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ బి.వెంకాయమ్మ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఉల్లాస్- అక్షర ఆంధ్ర అక్షరాస్యత కార్యక్రమం ఒక వరమని పేర్కొన్నారు. జడ్పీ, సీఈఓ, ఎంపీడీఓ, డీఆర్‌డీఏ పీడీ ఏపీఎంలకు మెప్మా పీడీ సీఎంఎం, సీఓఆర్‌పీలకు, డ్వామా పీడీ, ఏపీఓలకు, డీఈఓ, ఎంఈఓలకు ఉల్లాస్-అక్షర ఆంధ్ర అక్షరాస్యత కార్యక్రమ గ్రామ స్థాయిలో విజయవంతం అగుటకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు బి.జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారులు, గణాంక అధికారి తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమసేవా పురస్కారం అందుకున్న అద్దంకి యస్.టి.ఓ ఖాదర్ భాషా

**అద్దంకి ,ఆగస్టు 19, ప్రభాతవార్త**



స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్, జె. వెంకటమురళి చేతుల మీదుగా అద్దంకి యస్.టి.ఓ యస్.కె.అబ్దుల్ ఖాదర్భాషా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం-బాపట్ల జిల్లా-2 కోశాధికారి పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి ఘనంగాఖాదర్ భాషాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వి.సునీత, కె.శ్రీనివాస్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## తాండవకృష్ణ పుట్టినరోజు సందర్భంగా
## తిమ్మాయపాలెం పాఠశాలకు క్రీడా సామగ్రి బహూకరణ

**అద్దంకి , ఆగస్టు 19 ప్రభాతవార్త**



పుట్టంరాజుబుల్లెయ్య-రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో, పుట్టంరాజు తాండవకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రూ.8 వేలు రూపాయలు విలువైన క్రీడా సామగ్రిని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాయపాలెంకు బహూకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. గంగాధర్ అధ్యక్షత వహించారు. ట్రస్టు ప్రతినిధులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు క్రీడా సామగ్రిని పి.డి. మధుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో క్రీడలు అంతర్భాగం. క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక చురుకుదనాన్ని పెంపొందిస్తాయిని, పాఠశాల స్థాయిలోనే తగిన సదుపాయాలు లభిస్తే, విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదగగలరు అని అన్నారు. దాత శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత తరానికి పుస్తకాభ్యాసం మాత్రమే కాకుండా క్రీడల్లోనూ సమాన ప్రాధాన్యత అవసరమని, క్రమశిక్షణ, సమయపాలన, సమన్వయం, ఆరోగ్యకరమైన పోటీ భావన వంటి విలువలను క్రీడలు విద్యార్థుల్లో పెంపొందిస్తాయని, పాఠశాలల్లో క్రీడా సామగ్రి సమృద్ధిగా ఉండటం అత్యవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి మండల విద్యాశాఖ అధికారి కె. వి. శ్రీనివాసరావు , వి. సుధాకరరావు, జె. ప్రతాప్, పి. డి .మధు,ధనలక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## 22వ తేది శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో
## వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమం

**అద్దంకి , ఆగస్టు 19, ప్రభాతవార్త**



సింగరకొండ పై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా 22తేదిన శుక్రవారం మహిళలకు ప్రీతి కరమైన వరలక్ష్మీ వ్రతములు జరుగునని, మహిళలు ఉదయం 9గంటలకు దేవస్థానం వద్దకు వచ్చి వ్రతములో పాల్గొని, పూజకు కావలసిన సామాగ్రి దేవస్థానం వారు ఏర్పాటు చేయనున్నట్లు,కలశమునకు చెంబు మాత్రం మీరు తెచ్చుకోగలరనిభక్తులందరూ ఈ కార్యక్రమములో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావలసినదిగా ఆలయ అధికారులు తెలిపారు.

## శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవాలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం
### - చైర్మన్ జాగర్లమూడి సుబ్బారావు





**జె. పంగులూరు ,ఆగస్టు 19,ప్రభాతవార్త**

పూర్వులచే నిర్మించబడిన దేవాలయాలకు పూర్వ వైభోగం రావాలన్నా గ్రామస్తుల సహాయ సహకారాలతోనే సాధ్య పడుతుందని ఇన్స్పెక్టర్ ఎం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీ భీమలింగేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో మేడ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఏరియా ఇన్స్పెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, ఈవో శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నూతన పాలకమండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. అనంతరం కమిటీ చైర్మన్ జాగర్లమూడి. బుచ్చియ్య ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వడ్డీ వెంకట శ్రీరామ ప్రసాద్,కట్టమల్లేశ్వరి, దేవరకొండ ముత్యాలమ్మ, పి.మల్లికసాయి సుధా,కనకాల సుందరమ్మ,గుడిపాటి వెంకటేశ్వర్లు, కొల్లా పద్మ,టి.వీరేంద్ర,కారంచేటి. సాంబశివరావులు బోర్డు మెంబర్లుగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేవాలయానికి ధర్మకర్త సభ్యులు, అర్చకులు సహాయ సహకారాలతో వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి తీసుకునే పని నిబంధనలకు లోబడి ఉండాలని, పని అవుతుందా అవ్వదా అనే నిర్ణయం కమిటీ సభ్యులతో చర్చలు జరపాలన్నారు. ఈవో. శ్రీనివాసరావు మాలకొండ, సింగరకొండ క్షేత్రాలలో నిబంధనలతో పనిచేసి ఆలయాల అభివృద్ధికి తోడ్పటునందించారని అదేవిధంగా శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధికి కమిటీ సభ్యులతోనూ, గ్రామస్తుల సహాయసహకారంతో అభివృద్ధికి తోర్పడతానన్నారు. బాచిన కీర్తిశేషులు బాచిన. నాగేశ్వరరావు జ్ఞాపకార్థం జనవరిలో జరిగే ఉత్సవాలకు, అభివృద్ధి పనులకు లక్ష ,50 నుండి రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు చేస్తామని రావూరి రామారావు అన్న రావుల రమేష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కుక్క పల్లి పద్మా ఏడుకొండలు, రోటరీ క్లబ్ అధ్యక్షులు బత్తుల వీరనారాయణ, చింతల సహదేవుడు, ధూళిపాల నారాయణస్వామి ,జి. ఆదిరెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు కె వి సుబ్బారావు, చిలుకూరి కోటయ్య గ్రామ సెక్రెటరీ బి రాంబాబు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సేంద్రీయ సాగు పద్ధతులతో లాభసాటి వ్యవసాయం

**జె. పంగులూరు ,ఆగష్టు 19, ప్రభాతవార్త**



మండలంలోని నూజిల్లపల్లి చందలూరు గ్రామాల్లో పెద సేవ కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి మాట్లాడుతూసేంద్రీయ సాగు పద్ధతుల ద్వారా వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. ప్రతి రైతు కనీసం ఒక్క ఎకరమైన రసాయన రహిత సేద్యానికి సన్నద్ధం కావాలని సూచించారు. రసాయన రహిత ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో మంచి ధర లభిస్తుందని అన్నారు. రసాయన అవశేషాలు కలిగిన ఆహార పదార్థాలు తినడం వలన చిన్న వయస్సు లోనే దీర్ఘకాలిక వ్యాధులకు గురిఅవుతారన్నారు. అన్నదాత సుఖీభవ నగదు పడని రైతులు గ్రీవెన్స్ నమోదు చేసుకునే అవకాశం 20.08.2025 దాకా ఉందన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశం ప్రకారం మండలములో నల్ల బర్లి, తెల్ల బర్లీ పొగాకు నర్సరీలు పెంచవద్దని, బర్లీ పొగాకు పంట సాగు చేయవద్దని, మరియు నిషేధించుట జరిగిందని తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నూజెళ్లపల్లి సర్పంచ్,చందలూరు సర్పంచ్, చందలూరు పి .ఎ. సి. ఎస్ .చైర్మన్, మురుకొండ సుబ్బారావు, కాజా, స్వామి, వేణు, వి. ఏ. ఏ డి.అశోక్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పేద వర్గాల ఆరోగ్యానికి భరోసానిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి

**మార్టూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త**



ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సు మేరకు చికిత్స కొరకు లెటర్ ఆఫ్ క్రెడిట్ ఎల్ఓసీ ద్వారా పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన షేక్ జుల్ఫికర్ అలీ భుట్టో 1,00,000, ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన గర్నపూడి మేఘన 1,75,000, పర్చూరు మండలం పర్చూరు గ్రామానికి నాగళ్ళ దివ్య జ్యోతి 1,75,000, యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన గన్నమనేని వెంకటరత్నం రూ.70వేలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు నాయకులు, క్యాంపు కార్యాలయం ప్రతినిధులు చెక్కు అందజేశారు.

## సామాజిక తనిఖీ అంశాలు వెల్లడించేది ఎప్పుడో..?

- శ్రావణ ముహూర్తాలు దాటిపోయాయి - భాద్రపద మాసంలో చెప్తారేమో చూద్దాం
- ప్రజల ఎదురుచూపులు

**బల్లికురవ, ఆగస్టు 19, ప్రభాతవార్త**



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో పాతాళ స్థాయికి చేరిన అవినీతి బాగోతం సామాజిక తనిఖీల బృందాల సాక్షిగా వెలుగు చూశాయి. ఆగస్టు 6,7వ తేదీలలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం అర్ధరాత్రి వరకు కొనసాగింది. మండలంలోని ఇరవై ఒక్క పంచాయతీల పరిధిలోని 32 గ్రామాలలో మూడున్నర కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. ప్రజా వేదికలో ఆయా గ్రామాల నేతలు ఉపాధి కూలీలు, స్థానిక నేతలు నానా రగడ సృష్టించారు. ప్రజా వేదికకు హాజరైన పీడీ విజయలక్ష్మి సిబ్బందికి అరదండాలు అంటించారు. అంతటితో సరి చేయాల్సింతంతా చేసి, మెక్కాల్సిన దంత మెక్కి దోచుకొని దాచుకున్నా వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ చిరుద్యోగిని పత్రికల వారికి సమాచారం అందించారంటూ దండించటం కొసమెరుపు. మండలంలో 21 పంచాయతీలలో రూ.12 కోట్ల వ్యయంతో 645 ఉపాధి హామీ పనులలో నెలకొన్న అవినీతి లెక్కలను ముగించారు. మరి ముహూర్త బలం వాల కేనేమో వివరాలను వెల్లడించలేదు. శ్రావణ మాసం వెళ్లిపోతుంది, భాద్రపద మాసంలోనైనా అవినీతిని కొత్త పుంతలు తొక్కించిన క్షేత్ర సహాయకుల చేతివాటాన్ని, ప్రభుత్వ సొమ్ము తిలాపాపం తలాపిడికెడు అన్న చందంగా భోక్కిన వారి నుండి ఎంత మేరకు కక్కిస్తారో వేచి చూడాలి మరి. అప్పుడే కోట్ల రూపాయల అవినీతిని వెలికి తీసేందుకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి చీరాల ఆర్డీఓను కన్వీనర్గా, సంయుక్త కలెక్టర్ నాగిరెడ్డిని విచారణ అధికారిగా నియమించినందుకు సార్థకత ఏర్పడుతుంది. లేదంటే ఎప్పటిలాగే కొండను తవ్వి ఎలుకను పట్టటమే.

## రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలు

**మార్టూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో స్టూడియో వృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తున్న పొలూరి సింగయ్య, భీమవరపు సుబ్బారావు, పులిపాటి సుబ్బారావు, దేవరపల్లి శివకుమార్, షేక్ నాసర్వలిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, జాష్టి సాంబశివరావు, కొర్రపాటి భాజారావు, షేక్ కాజా హుస్సేన్, రోటేరియన్ కొయిలమూడి హనుమంతరావు, పెంట్యాల లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహానికి ఆర్థిక సహాయం

**పెద్దదోర్నాల, ఆగస్టు 19, ప్రభాతవార్త**



వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పెద్దదోర్నాల మండలం అయినముక్కల దాసరికాలనీలో ఏర్పాటు చేసే గణేష్విగ్రహ ప్రతిమకు మంగళవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు, స్టేట్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు షేక్ షేక్షావలి రూ.10వేలు ఆర్థిక సాయం గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు అందించారు. కులం, మత అనే భేదాలను పక్కనపెట్టి మానవత్వమే గొప్ప మతం అనే ఆదరణాత్మక సందేశాన్ని షేక్షావలి తన సహాయంతో చాటి చెప్పారు. ఇలాంటి మంచి మనసు కలవారు సమాజానికి ఆదర్శమని ఆ కాలనీ వాసులు అభినందిస్తున్నారు.

## గణేష్ ఉత్సవ మండపాలు పందిళ్లకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి
### - ఎస్సై వి.మహేష్

**పెద్దదోర్నాల, ఆగస్టు 19, ప్రభాతవార్త**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే గణేష్ మండపాలు పందిళ్లకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి అని పెద్దదోర్నాల ఎస్సై వి.మహేష్ తెలిపారు. మంగళవారం పోలీసు స్టేషన్లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వి.మహేష్ మాట్లాడుతూ వినాయకుడు విగ్రహాలు ఏర్పాటు చేసిన మండపాల వద్ద భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు కూడా అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. మండపాలు పందిళ్ల స్థలాల వద్ద వివాదాలు జరగకుండా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నూతనంగా ఒక యాప్ను కూడా ప్రవేశపెట్టారన్నారు. యాప్లో కమిటీ సభ్యుల వివరాలు నమోదు చేసుకోవాలని, నిమజ్జనం ఎప్పుడైతే అప్పుడు తేదీ నమోదు చేయాలని యాప్లో పోలీసు వారు మానిటర్ చేస్తారని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముందుగానే పోలీసు స్టేషన్లో అర్జీ పెట్టుకొని అనుమతులు పొందాలని ఎస్సై వి.మహేష్ తెలిపారు.

## నల్లగుంట్ల, కొర్రపోలులో పొలం పిలుస్తోంది



**పెద్దదోర్నాల, ఆగస్టు 19, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలంలోని నల్లగుంట్ల, కొర్రపోలు గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను క్షేత్ర సందర్శన చేసి రైతులకు మొక్క జొన్న పంటలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు తెలియజేశారు. అలాగే వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న ఈ పంట డిజిటల్ సర్వే, ప్రధాన మంత్రి ఫసల్ భీమా పథకం, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, కౌలు రైతులకు కౌలు కార్డుల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శేఖర్, గ్రామ వ్యవసాయ సహాయకులు మాధురి, రైతులు పాల్గొన్నారు.

## పిన్నికను పరామర్శించిన ఎమ్మెల్యే బి.ఎన్

**చీమకుర్తి, ఆగస్టు 19, ప్రభాతవార్త**



ప్రజాకవి, ఉద్యమ నాయకుడు పిన్నిక శ్రీనివాసరావు వారి కుటుంబ సభ్యులను సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయకుమార్ పరామర్శించారు. పిన్నిక శ్రీనివాసరావు భార్య మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న విజయమ్మ విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మరణించారు. విషయం తెలుసుకున్న సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్ కుమార్ వారిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె లేని లోటు తీరనిది, మీరు ధైర్యంగా ఉండాలి అని చెప్పి, మున్సిపాలిటీలో మీకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన ఇన్సూరెన్స్, పిఎఫ్ ఫండ్, ఇతర బెనిఫిట్లు త్వరగా అందిస్తామని తెలిపారు. మున్సిపాలిటీలో స్వీపర్ వర్కర్ ఉద్యోగం ఒకరికి ఇప్పిస్తాని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో చీమకుర్తి మండల జడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ కొత్తపు రాఘవరావు, మాజీ వైస్ చైర్మన్ కందిమళ్ళ గంగాధర్, టీడీపీ పట్టణ అధ్యక్షులు ముప్పూరి చల్లయ్య, గొల్లపూడి సుబ్బారావు యద్దపల్లి రామబ్రహ్మం, సీనియర్ నాయకులు గొల్లపూడి లింగయ్య, జేసీపీ వ్యవసాయ అధ్యక్షులు పేరం ఏడుకొండలు, బీసీ నాయకులు బత్తుల మల్లిఖార్జునరావు, సీనియర్ నాయకులు బండ్ల కొండలరావు, బక్కా రత్నం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకల్లో
# పాల్గొన్న వైసీపీ నేత చెంచిరెడ్డి తదితరులు

**సంతనూతలపాడు, ఆగష్టు 19, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో మంగళవారం నుండి ప్రారంభమైన పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకలు లో మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోలేరమ్మ ఆలయంలో చెంచిరెడ్డి పూజలు నిర్వహించారు. పేర్నమిట్ట పోలేరమ్మ తల్లి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19, 20వ తేదీల్లో గల రెండు రోజులు పాటు ఈ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదాన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలేరమ్మ అమ్మవారికి విద్యుత్ ప్రభ ద్వారా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ బీసీ సెల్ అధ్యక్షులు గుంజా ఏడుకొండలు, మండల వైసీపీ ప్రచార విభాగం అధ్యక్షులు తెళ్ళ అనిల్ కుమార్, వైసీపీ నేతలు, వడ్డెర సంఘం యూత్, అభిమానులు ఈ సందర్భంగా పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

## పోలేరమ్మ తల్లి తిరునాళ్ల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్కుమార్





**సంతనూతలపాడు, ఆగష్టు 19, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో మంగళవారం ప్రారంభమైన పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకల్లో సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అర్చకులు లక్ష్మణాచారి ఆధ్వర్యంలో పోలేరమ్మ తల్లికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ పూజల్లో పాల్గొన్నారు. ఈ నెల 19, 20వ తేదీల్లో గల రెండు రోజులు పాటు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 19న మంగళవారం నాడు మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదాన వేడుకలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి ఈ వేడుకలకు విశేషంగా తరలివచ్చారు. మంగళవారం రాత్రి పోలేరమ్మ తల్లికి విద్యుత్ ప్రభ ద్వారా వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన పొంగల్ళు, సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. పేర్నమిట్ట పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గత 40 సంవత్సరాల నుండి ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పేర్నమిట్టలో ఈ వేడుకలు ఒక పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్కుమార్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరు వెంకటేశ్వరరావు అలియాస్ బాబు, మాజీ ఎంపీపీ వివరం గోవిందు, మాజీ వైస్ ఎంపీపీ టీడీపీ నేత వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, పేర్నమిట్ట మాజీ ఉపసర్పంచ్ టీడీపీ నేత కరిచేటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కందుకూరి మల్లిఖార్జునరావు, పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తన్నీరువెంకటరావు,వెంకటేశ్వర్లు, రామారావు,చెంచయ్య,లింగాల,అంకమరాజు తదితరులు పాల్గొన్నారు. పేర్నమిట్ట పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి.

## కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమించాలి

**సంతనూతలపాడు, ఆగష్టు 19, ప్రభాతవార్త**




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ద్వంద విధానాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతిబాబు పిలుపునిచ్చారు. రైతు సంఘం సంతనూతలపాడు మండలం 7వ మహాసభ సంతనూతలపాడులోని సుందరయ్య భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈ మహాసభకు రైతు సంఘం నాయకులు ఎన్వి నరసింహం అధ్యక్షత వహించారు. మహాసభలో ముఖ్య అతిధిగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ విధానాల కారణంగా వ్యవసాయ రంగం కునారిల్లుతుందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. రైతులు ఏ పంటవేసినా గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీ కరించేందుకు దొడ్డి దారిన నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయం నుండి రైతులను దూరం చేసి వారి భూముల్లో వారిని కూలీలుగా మార్చే విధానాలను తీసుకొస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం దేశంలోకి విదేశాల నుండి వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటూ ఈ దేశ రైతులను దివాలా తీయిస్తున్నారని అన్నారు. మాటలకు స్వదేశీ జపం చేస్తూ విదేశాలకు బానిసలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మనం పండించిన వస్తువులను అమెరికాకు ఎగుమతి చేస్తుంటే ఆ వస్తువులపై ట్రంప్ 50 శాతం సుంకాలు విధిస్తుంటే 56 ఇంచెల చాతి గల మన ప్రధాని మోడీ మౌనంగా వ్యవహరించడం ఎవరి ప్రయోజనాల కోసమో ప్రజలు గమనించాలని ఆయన ఆరోపించారు. కోట్లాది ఎకరాల భూములను కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టడానికి రైతులను, ప్రజలను బలవంతంగా భూముల నుండి ఖాళీ చేయిస్తున్నారని ఆయన విమర్శించారు. వ్యవసాయాన్ని ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడానికి కావాల్సిన చర్యలు చేపట్టకుండా రాష్ట్రంలో కూడా భూ కేంద్రీకరణ కోసం కావాల్సిన ప్రయత్నం చేస్తుందని అన్నారు. రెండో వైపు ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైతులు ప్రజలు కార్పొరేట్ భూ దోపిడికి వ్యతిరేకంగా,గిట్టుబాటు ధరల కోసం ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయు జిల్లాకార్యదర్శి బంకా సుబ్బారావు పాల్గొని సందేశాలు ఇచ్చారు. మహాసభలో మండల కార్యదర్శి కరిచేటి హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు అబ్బూరి వెంకటేశ్వర్లు, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, రైతు నాయకులు అన్నా వెంకట సుబ్బారావు, గుండవరపు వెంకట సుబ్బారావు, బొడ్డపాటి లక్ష్మీ నారాయణ, ముద్రగడ సుబ్రహ్మణ్యం, ముళ్ళమూరి నారాయణ, షేక్ కమాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కరిచేటి హనుమంతరావు, నల్లూరి వెంకట నరసింహంలతో పాటు మరో తొమ్మిది మందితో కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## విభిన్న ప్రతిభావంతులైన విద్యార్దులపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి
### - గూడూరి ఎరిక్షన్బాబు

**యర్రగొండపాలెం,19ప్రభాతవార్త**





పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలోని ఆడిటోరియంలో మంగళవారం జిల్లా ఐఇ కోఆర్డినేటర్ నాగేంద్ర నాయక్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఉచిత ఉపకరణాలు యర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయి నిర్ధారణ శిబిరంను యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్బాబు హాజరైనారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎరిక్షన్బాబు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విరి కోసం 6000వేలు పెన్షన్ ఇవ్వడమే కాకుండా వారి చదువులకోసం ప్రత్యేక పాటశాలలు,భవితా సెంటర్లు,ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి చదువు చెప్పించడం జరుగుతుందని ఆయన అన్నారు.ప్రతి మండలంలో వారం వారం డాక్టర్ల ద్వారా ఫిజియోధెరపీ క్యాంపులు ఏర్పాటు చేసి వారికి అవసరమైన చికిత్సలు చేయించి ఆదుకుంటుందన్నారు.ఏ స్క్రీనింగ్ కాంప్ద్వారా సెలెక్టు ఆయిన వారికి త్వరలోనే వారికి అవసరమైన వీల్చైర్లు,ట్రైసైకిల్స్ వినికిడి యంత్రాలు,అందజేస్తామని ఆయన తెలిపారు.అనంతరం విభిన్న ప్రతిభావంతుడైన షేక్.షమీర్ భాష ట్రిబుల్ఐటీ సీటు సాధించిన సందర్భంగా ఆయన యంఇవోలతో కలిసి పూలదండా శాలువాతో ఘనంగా సన్మానించారు.షేక్.అర్షియా అజుం అనే విద్యార్ధికి వీల్చైర్ అంజేసి అందరికి ప్రత్యేక ఐడికార్డులు పంపిణీ చేశారు.యంఇవో అంజనేయులు మాట్లాడుతూ సుమారు 120మంది నడవలేని,మతిస్థిమితం లేని చేవిటి,మూగ,విద్యార్థులకు అలింకో డాక్టర్లు పరీక్షలు జరిపి యంఆర్ కిట్స్ సిపిచైర్స్,వీల్చైర్లు,ట్రైసైకిల్ చేతికర్రలు మరియు కళ్లద్దాలు అవదసమగు ఉపకాణాలు సిఫార్సు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు,మాజీ యంపిపి యం.మంత్రునాయక్,తెలుగుదేశంపార్టీ నాయకులు చిట్యాల వెంగల్రెడ్డి, యంఇవోలు మస్తాన్నాయక్,ఖాశిం,రాజశేఖర్ రెడ్డి,ఇందిర,ఫిజియోదెరపి డాక్టర్ అంకారావు, ఐఇ టీచర్లు సాదిక్,చెన్నకేశవులు,సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ కాలువలకు పుష్కలంగా ప్రవహిస్తున్న సాగర్ నీరు

- ఆనందోత్సవాలతో సాగర్ కాలువల్లో యువత కేరింతలు
- ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకు, ఆర్‌డబ్ల్యూఎస్ చెరువులకు

నీటిని నింపుతున్న ఎన్నెస్పీ, ఒంగోలు నగర పాలక సంస్థ తదితర శాఖ అధికారులు




**సంతనూతలపాడు, ఆగస్టు 19, ప్రభాతవార్త**
సంతనూతలపాడు, చీమకుర్తి, దర్శి, కురిచేడు, ఒంగోలు తదితర ప్రాంతాల సాగర్ కాలువలకు ఓ అండ్ ఎం డివిజన్ 0/0 మైలు రాయి ఎగువ ప్రాంతం నుండి సాగర్ నీటిని విడుదల చేశారు. ముఖ్యంగా 550 క్యూసెక్కుల నీటిని సాగర్ కాలువలకు ఒంగోలు వరకు విడుదల చేశారు. ఇందులో భాగంగా రామతీర్థం రిజర్వాయర్ నుండి ఒంగోలు ఎన్నెస్పీ కాలువలకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముఖ్యంగా త్రోవగుంట మేజర్‌కు 40, ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకులకు 100 ఈతముక్కల మేజర్‌కు 80,చిలకలపాడు మేజర్‌కు 20 క్యూసెక్కుల నీటిని ప్రస్తుతం విడుదల చేశారు. ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకులకు, మండలాల్లోని ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులకు ప్రస్తుతంనీటినివిడుదల చేస్తున్నారు.సంతనూతలపాడు మండలం చంద్రపాలెం సమీపంలో ఓ అండ్ ఎం సంతనూతలపాడు సబ్ డివిజన్ పరిధిలో సాగర్ కాలువలకు సాగర్ నీరు పుష్కలంగా విడుదల అవుతుంది. రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు లభిస్తుంది.

**నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడు ప్రధాన చెరువులో అడుగంటిన నీరు :**
సంతనూతలపాడులోని ప్రధాన పెద్ద చెరువులో చేపలు పట్టుకునేందుకు సంబంధిత నిర్వాహకులు పుష్కలంగా ఉన్న నీటిని బయటకి వదిలేశారు. ప్రధానంగా సంతనూతలపాడు పెద్ద చెరువులో నీరు వల్ల ఒక పక్క తాగునీరు, మరొక పక్క వరి సాగుకు కల్పవృక్షం ప్రస్తుతం సంతనూతలపాడు వద్ద చెరువులో చేపలు పట్టడం ద్వారా నీరు అడుగంటి పోయాయి. దీని వల్ల గ్రామంలో తాగునీరు, వరి సాగుకు ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత నీటి సంఘం వారు కానీ, మైనర్ ఇరిగేషన్ వారు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సంతనూతలపాడు పెద్ద చెరువులో ఎన్నెస్పీ కాలువల ద్వారా నీటిని నింపే కార్యక్రమం నేటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సంతనూతలపాడు పెద్ద చెరువుకు ఎన్నెస్పీ కాలువలు ద్వారా తాగునీరు విడుదలకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ప్రజలు తాగునీటి ఇక్కట్లు, రైతులు వరి పంటసాగు సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

## వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి - సీఐ సుబ్బరాజు

**అద్దంకి రూరల్ ,ఆగస్టు 19, ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా అద్దంకి పట్టణం మరియు గ్రామాలలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే ప్రజలు తప్పనిసరిగా అనుమతులు పొందాలని అద్దంకి సీఐ సుబ్బరాజు పత్రికాముఖం గా తెలిపారు. మైక్ సెట్, ఎలక్ట్రిసిటీ ఉపయోగించుకునేందుకు అనుమతులు తప్పనిసరి అని అంతేకాకుండా విగ్రహం ఏర్పాటు చేసే కమిటీ మెంబర్ల పూర్తి సమాచారం ముందుగానే పోలీసులకు ఇవ్వాల్సి ఉంటుందని ఎన్ని రోజులు విగ్రహం ఏర్పాటు చేస్తారో ముందుగానే తెలియజేయాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో పూర్తి సమాచారం తెలియజేస్తూ లిఖితపూర్వకంగా అందించాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎందుకంటే ఎవరైనా ఉద్దేశపూర్వకంగా విగ్రహాన్ని ధ్వంసం చేస్తే అది గొడవలకు దారి తీసే అవకాశం ఉందని అన్నారు. అలానే రాత్రి వేళల్లో విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలో తప్పనిసరిగా ఒక్కరు కాపలాగా పడుకోవాలన్నారు. ఏ వార్డ్, గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేస్తున్నారో అదే గ్రామానికి చెందిన మహిళ పోలీస్ కు పూర్తి సమాచారం అందించాలన్నారు. వినాయకుడి విగ్రహం నిమజ్జనం రోజు ఎవరైనా సరే డీజే సౌండ్స్ పెట్టి మద్యం తాగి గొడవలకు కారకులైతే మాత్రం అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా గొడవలు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని సీ.ఐ సుబ్బరాజు వార్నింగ్ ఇచ్చారు.

## మానసిక వికలాంగుల పాఠశాలలో ఫోటోగ్రాఫర్స్ డే దినోత్సవ కార్యక్రమం



**గిద్దలూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త**
ప్రపంచ ఫోటోగ్రాఫర్‌డే సందర్భంగా పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల మానసిక వికలాంగుల పాఠశాలలో గిద్దలూరు తాలూకా ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఫోటోగ్రాఫర్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో లూయిస్ డాగ్‌రే ఫోటోకు పూలమాలవేసి కేక్ కట్ చేసి బిస్కెట్లు, పండ్లు, 25కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు తాలూకా ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ మానసిక వికలాంగుల పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ బుజ్జిబాయి



**మార్కాపురం రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త**
మార్కాపురం మండల వ్యవసాయాధికారి కె బుజ్జిబాయ్ మంగళవారం ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. అందులో భాగంగా ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, కల్తీలేని ఎరువులను రైతులకు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఎరువులు అధిక ధరలకు అమ్మినా, రైతుకు రశీదు ఇవ్వకపోయినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.




పొలం పిలుస్తోంది కార్యక్రమంలో

**రైతులకు సూచనలు చేసిన ఏఓ బుజ్జిబాయి :**
మండలంలోని కోల భీమునిపాడు, కొత్తపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయ శాఖాధికారిణి కె బుజ్జిబాయి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె రైతులతో అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతినకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది. కందిలో వర్షపునీరు నిల్వ నిలువకుండా ఎప్పటికప్పుడు తీసివేయాలని, 3గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటర్ నీటిలో కలిపి మొక్కల తడిచేలా పిచికారి చేయాలని సూచించారు. పొటాషియం నైట్రేట్ 10గ్రాములు లీటర్ నీటిలో కలిపి 200లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. పెరుగుదల దశలో ఉన్న పత్తి అధిక వర్షాల గురైనప్పుడు 30కిలోల యూరియా,15కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి. వర్షాలు తగ్గాక సాఫ్ లేదా కంపానియన్ అనే శిలీంద్ర నాశిని మందును 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వర్షాలు తగ్గిన 3-4రోజుల తర్వాత వరసల మధ్య భాగాన్ని గుంటకతో సేద్యం చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్లంపల్లిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్




**త్రిపురాంతకం, ఆగస్టు 19 ,ప్రభాతవార్త**
మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగోలమారి బాల కోటిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ సంబంధించిన క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకోటిరెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల అనుగుణంగా, ఎర్రగొండపాలెంశాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని వారు తెలిపారు.గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన అలవికాని హామీలను ఈ క్యూఆర్ కోడ్‌లో పొందుపరచడం జరిగిందని, ఎవరైనా ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా బాబు ఇచ్చిన హామీలన్నీ వెలువడుతాయని తెలియజేశారు. సవాలక్ష హామీల నుండి ఏవో ఒకటి రెండు హామీలను అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అసంపూర్తిగా నెరవేర్చామని చెప్పుకోవడం దారుణమని ఈ క్యూఆర్ కోడ్ ఓపెన్ చేసే వారు ఇచ్చిన హామీలు ఎన్నో, నెరవేర్చినవి ఎన్నో ప్రజలకు తేటతెల్లం అవుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలకోటిరెడ్డితోపాటు గ్రామ సర్పంచ్ ఏలియా, ఎంపిటిసి సభ్యులు దూదేకుల సిద్దయ్య, ఎక్స్ పిఏసిఎస్ ప్రెసిడెంట్ బద్దిగం వెంగళరెడ్డి, దార్ల దేవయ్య, భవనం వెంకటరెడ్డి, కటకం చిన్న వెంకటయ్య, బద్దిగం మునిశా రెడ్డి, దూదేకుల కాశయ్య, దూదేకుల నాగూరు, దార్ల రాజారావు, కొల్లి శ్రీనివాస్ రెడ్డి, తప్పెట్ల వెంకటేశ్వర్లు, తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జిల్లాగా పేరు మార్చాలి

- జిల్లా సాధన సమితి జేఏసీ డిమాండ్



**చీరాల, ఆగస్టు 19, ప్రభాతవార్త**
బాపట్ల జిల్లాను దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జిల్లాగా పేరు మార్చాలని అదే విధంగా చీరాలను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జిల్లా సాధన సమితి జేఏసీ కన్వీనర్ డాక్టర్ తాడివలస దేవరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం చీరాల పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ ముగింపు సందర్భంగా డాక్టర్ తాడివలస దేవరాజు మీడియాతో మాట్లాడుతూ ఆగష్టు 29వ తేదీన బాపట్ల కలెక్టర్ ఆఫీసు నందు ప్రజా విజ్ఞప్తులు స్వీకరించబడానికి జిల్లాల పునర్విభజన మంత్రుల సంఘం రానున్నదని, కావున చీరాలను జిల్లా కేంద్రంగా చేస్తూ బాపట్ల జిల్లాకు ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలనే డిమాండ్‌తో అన్ని రాజకీయ పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజా సంఘాలు, వ్యాపార సంస్థల ప్రతినిధులు, నాయకులు విన్నపాలు ఇవ్వడానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నాటి బ్రిటీష్ నిరంకుశ పాలనలో అధిక పనులకు వ్యతిరేకంగా చీరాల పట్టణ ప్రజలను రామదండు పేరుతో ఊరు ఖాళీ చేయించి రాంనగర్ ఏర్పాటు చేసి ప్రజలలో చైతన్య స్ఫూర్తిని నింపి ప్రజా పోరాటాన్ని నిర్మించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ను భవిష్యత్తు తరాలకు గుర్తు చేస్తూ ఆయన పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాలు అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు జిల్లాల పునర్విభజన మంత్రుల సంఘంను కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రజా సంఘాల నాయకులు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, ప్రజా సంఘాల నాయకులు మేడ వెంకటరావు, శీలం రవి, జనసేన నాయకులు శివప్రసాద్, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు జిలానీ, నాయి బ్రాహ్మణ సేవ సంఘ నాయకులు సత్యనారాయణ, వెంకటస్వామి, సత్యం, ఎస్సీ సెల్ నాయకులు చిట్టిబాబు, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు హరిహరరావు, రామారావు, రైతు, ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పడని వారు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలి



**చీరాల, ఆగష్టు 19, ప్రభాతవార్త**
మండలంలోని చీరాల నగర్, కొత్తపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి పి.నిర్మల దేవి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం పొందని రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి తమ పేరును గ్రీవెన్స్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. దీనికి గడువు ఆగష్టు 20వ తేదీ వరకు ఉందని తెలిపారు. గ్రామ పశుసంవర్ధక సహాయకులు అనూహ్య మాట్లాడుతూ ప్రస్తుతం గడ్డి గింజలు సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని, రైతులందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ మనీషా, రైతులు పాల్గొన్నారు.

## ఒక క్షణం జరిగిన సంఘటన చిరుకాలం గుర్తుండాలంటే ఫోటోతోనే సాధ్యం

- ఫోటోగ్రాఫర్ దినోత్సవ కార్యక్రమంలో సిఐ సుబ్బారావు
- ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం




**మార్కాపురం రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త**
ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా మార్కాపురం ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వరనయంలో మంగళవారం మధ్యాహ్నం స్థానిక గడియార స్తంభం వద్ద పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమాన్ని మార్కాపురం సిఐ సుబ్బారావు,ఎస్సైలు సైదుబాబు , రాజమోహన్,అంకమరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బారావు మాట్లాడుతూ ఒక క్షణం జరిగిన సంఘటన చిరకాలం గుర్తుండాలంటే అది ఫోటోతోనే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా ఫోటోగ్రాఫర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ దొంత వెంకటేశ్వర్లు గౌడ్, గడ్డం నాగరాజు, బాబి, శివమణి, నారాయణ రెడ్డి, గూటూరి సురేష్ కుమార్, శ్రీకాంత్, పుల్లారావు, శివ, హరి, శ్రీనివాస్ రెడ్డి, బద్రి, హిమామ, వెంకీ, చెన్నయ్య, రమేష్, పవన్, దిగిపర్తి రమేష్, భారీ సంఖ్యలో ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## పాలకులు మారినా ప్రయాణీకుల ప్రాంగణ దుస్థితి మారదా..?

- బురదమయంగా మారిన ఆర్టీసీ ప్రయాణీకుల ప్రాంగణం





**త్రిపురాంతకం, ఆగస్టు 19 ప్రభాతవార్త**
ఏ పార్టీ అధికారం చేపట్టినా ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించడమే మా లక్ష్యం అని ఎన్నికల్లో చెప్పడమే తప్పా ఆచరణలో ఏమాత్రం లేదని నిరూపించడానికి త్రిపురాంతకం ఆర్టీసీ ప్రయాణీకుల ప్రాంగాణంలో దర్శనమిస్తున్న బురదగుంటలతో దర్శనమిస్తున్న దృశ్యాలే నిదర్శనం. కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిలోని త్రిపురాంతకం మండలంలో సుమారు 45గ్రామాల కూడలి ఇక్కడి నుండి ఎంతోమంది రాయలసీమ ప్రాంతానికి, కర్ణాటక ప్రాంతంలోని హోస్పేట్, గంగావతి, చిత్రదుర్గ, బెంగుళూరు పట్టణాలకు అటువైపు నుండి కూడా అదే విధంగా గుంటూరు, కృష్ణ, ఉభయగోదావరి జిల్లాలతోపాటు ఏలూరు, మచిలీపట్నం, విశాఖపట్నం, విజయనగరం, ఒరిస్సా వరకు నిత్యం ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రాత్రింబవళ్లు తిరుగుతుంటాయి. ప్రయాణీకుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తెలుగుదేశం ప్రభుత్వమే త్రిపురాంతకంలో ప్రయాణీకుల సౌకర్యార్థం నాగార్జున సాగర్ ప్రజెక్టు కార్యాలయాల ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ప్రయాణీకుల ప్రాంగాణాన్ని నిర్మించేందుకు స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టారు. అప్పటి నుండి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, అధికారం చేపట్టినప్పటికి ప్రయాణీకులకు తగిన సౌకర్యాన్ని కల్పించలేకపోయారు. అంతమాత్రమే కాదు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదేండ్లు ఏకధాటిగా మంత్రిగా చేసిన సురేష్ కూడా ఏమి చేయలేకపోయాడు. కాగా ప్రస్తుతం రాయలసీమ ప్రాంతమైన అనంతపురం నుండి రాజధాని ప్రాంతమైన అమరావతి వరకు నిత్యం ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పాటు త్రిపురాంతకం పెద్ద పుణ్యక్షేత్రం. ఇక్కడ శ్రీమత్ బాలా త్రిపుర సుందరి దేవీ, శ్రీ పార్వతి సమేత త్రిపురాతకేశ్వర స్వామి వార్లు స్వయంభుగా వెలసిన సుప్రసిద్ధ శైవక్షేత్రం త్రిపురాంతకం క్షేత్రం.

**మాటలతో మభ్యపెట్టి ప్రయాణీకుల ప్రాంగాణం అభివృద్ధిని మరచిన నాయకులు :**
గత ఐదేళ్ళుగా పరిపాలన సాగించిన ఈ ప్రాంత నాయకులు మాటలతో మభ్యపెట్టి ప్రజలకు అవసరమైన ఈ ప్రయాణీకుల ప్రాంగాణాన్ని చూస్తూ కళ్ళుండి చూడలేని ధృతరాష్ట్రుని వలే త్రిపురాంతకం బస్టాండు అభివృద్ధికి ఏ ఒక్కరూ చొరవచూపక పోవడం ఎంతో బాధాకరమైన విషయం అని మండల ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం దృష్టిలో పెట్టుకొని నాడు తెలుగుదేశం ప్రభుత్వం ప్రయాణీకుల ప్రాంగాణ భవనాన్ని నిర్మానం చేపట్టడం జరిగింది. నేడు తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టింది. కాబట్టి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తగిన విధమైన మరమ్మతులు చేసి ప్రజల మనసులో శాశ్వతంగా గుర్తుండే విధంగా పాలకులు, అధికారులు చొరవ తీసుకొని ఈప్రయాణీకుల ప్రాంగాణాన్ని బుదగుంటల దుస్థితిని మార్చివేయాలని మండలంలోని ప్రయాణీకులు కాక ఇతర ప్రాంతాలను చూసిన వారు కూడా ప్రభుత్వానికి, అధికారులకు, పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ విషయంలో అధికార పార్టీ నాయకులు, అధికారులు,మంత్రులు చొరవ తీసుకోకపోతే ఎంతోచెప్పి ఏమి చేయలేదన్న విమర్శకు గురై రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలకు వ్యతిరేకమై అధికారానికి దూరమయ్యే పరిస్థితి తెచ్చుకోవద్దని మండల ప్రజలు భావిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, నాయకులు, అధికారులు ఏ నిర్ణయం తీసుకొని ఏమి చేస్తారో వేచి చూడాల్సిందే మరీ..

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

- గిద్దలూరు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వర్లు



**రాచర్ల, ఆగష్టు 19, ప్రభాతవార్త**
పాఠశాల సిబ్బంది,బాలికలు సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని గిద్దలూరు సబ్‌యూనిట్ అధికారి జి వెంకటేశ్వర్లు అన్నారు. దోమలనివారణ చర్యల లో భాగంగా రాచర్ల గురుకుల పాఠశాలలో మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణం లోని కాలువలు, మురికిగుంటలు తదితర ప్రదేశాలలో ఎబెట్‌ను పిచికారి చేయించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశముందని తెలిపారు. కావున బాలికల ఆరోగ్యంపట్ల సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేరీ మంజుల, వైద్య సిబ్బంది ఎం ప్రసాద్, శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీఅంకాలమ్మ అమ్మవారి తిరుణాళ్ళ
## మహోత్సవంలో పాల్గొన్న కృష్ణకిషోర్ రెడ్డి



**కంభం, ఆగస్టు 19, ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని తెలుగు వీధిలో శ్రీ మాదాసు అంకాలమ్మ అమ్మవారి తిరుణాళ్ళ మహోత్సవంలో మంగళవారం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కంభం పట్టణంలోని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొదిలిలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



**కొనకనమిట్ల, ఆగష్టు 19, ప్రభాతవార్త**
పొదిలిలోని సర్ సివి రామన్ బీఈడీ కాలేజీ నందు పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఓల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ ప్రసాద్, స్టూడియో ప్రొప్రైటర్ వై.బాల ప్రసాద్ దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలోఓల్డ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## పంట వేసిన ప్రతి రైతుకు పంట నమోదు ధృవీకరణ పత్రం తప్పనిసరి





**కొనకనమిట్ల, ఆగష్టు 19, ప్రభాతవార్త**
పంట సాగు చేసిన ప్రతి రైతు ధృవీకరణ పత్రాన్ని తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు సూచించారు. మంగళవారం గార్లదిన్నె, నాగంపల్లి రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట ధృవీకరణ పత్రం పొందిన రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పంట నష్టపోయినప్పుడు వచ్చే పరిహారం అందుతాయన్నారు. తరువాత పొలాల్లోకి వెళ్లి క్షేత్ర పరిశీలన చేసి తగు సూచనలు, సలహాలు రైతులకు ఇచ్చారు. పొలం లేకుండా కౌలు తీసుకొని వేసే ప్రతి ఒక్క రైతు కౌలు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎవరికైనా అన్నదాత సుఖీభవ డబ్బులు జమ కానట్లయితే దగ్గర్లో ఉన్న రైతు సేవ కేంద్రంను సందర్శించి తగు డాక్యుమెంట్లు ఇచ్చి వెళ్లవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రమేష్, ఏఈఓ రవికాంత్, విక్రం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ గ్యారేజ్ బురదమయం...

- జారిపడి గాయాలపాలవుతున్న ఉద్యోగులు

**గిద్దలూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త**
ఇటీవల కురిసిన వర్షాలకు గిద్దలూరు ఆర్టీసీ గ్యారేజీ మొత్తం బురదమయంగా మారింది. దీంతో ఆర్టీసీ గ్యారేజీలో ఉద్యోగులు గాయాలపాలవుతున్నారు. ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న వీరమ్మ అను కండక్టర్ జారిపడి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనలో ఆమెకు కుడికాలు విరగడంతో ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. గతంలో సైతం ఆర్టీసీ గ్యారేజీలో వర్షం పడిన సందర్భంగా ఏర్పడిన బురద వలన పలువురు ఆర్టీసీ ఉద్యోగులు జారిపడి గాయపడినట్లుగా ఉద్యోగులు అసహనం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు గాయపడుతున్నా గ్యారేజీ ప్రాంతాన్ని ఉన్నతాధికారులు మరమ్మతులు చేయలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

## కిమ్స్‌లో ఎబినేజర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అన్నా..



**మార్కాపురం రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త**
ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ నందు తర్లుపాడుకు చెందిన ఎబినేజర్ అనారోగ్యానికి గురై హాస్పిటల్‌లో చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపి ఇన్చార్జి అన్నా రాంబాబు ఎబినేజర్‌ను ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. డాక్టర్లకు మెరుగైన వైద్యం అందించాలని సూచించడం జరిగింది. కుటుంబ సభ్యులకు ఏమి కాదని భయపడవలసినది ఏమీ లేదని భరోసా కల్పించారు. కార్యకర్తలకు కానీ, నియోజకవర్గ ప్రజలకు కానీ ఏ ఆపద వచ్చిన విషయం తెలిస్తే వెంటనే కలిసి ధైర్యం చెప్పడంలో ముందుంటారని పలువురు మాట్లాడటం గమనార్హం.

## గిద్దలూరులో ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు
## లైసెన్స్ కేటాయింపుకు దరఖాస్తులు ఆహ్వానం

**గిద్దలూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన కొత్త బార్ పాలసీ -2025 ప్రకారం ప్రకాశం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశానుసారం గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్స్ కేటాయింపుకు దరఖాస్తులు ఆహానించడం జరుగుతుందని గిద్దలూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్‌శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు సమర్పించవచ్చని ఒక్కో దరఖాస్తుకు రూ.5లక్షల ఫీజు, అదనంగా రూ.10వేలు ప్రాసెసింగ్ చార్జీలు మొత్తం రూ.5,10,000 చలానా లేదా డిడి రూపంలో చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ రుసుము తిరిగి ఇవ్వబడదని తెలిపారు. దరఖాస్తుదారుల ఎంపిక ఈనెల 28వ తేదీన ఒంగోలులో జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో జరుగుతుందని ఒక్కోబార్‌కు నాలుగు కంటే దరఖాస్తులు తక్కువగా వచ్చినట్లయితే అటువంటి బార్ల లాటరీ ప్రక్రియ నిర్వహించబడదని తెలిపారు. లాటరీ దాకవనా బార్ అండ్ రెస్టారెంట్‌ని పొందిన వారు సంవత్సరానికి రూ.35లక్షల లైసెన్స్ ఫీజు 6 వాయిదాలలో చెల్లించవలసి ఉంటుందని లైసెన్స్ కాలపరిమితి 3సంవత్సరాలు కాగా ప్రతి ఏడాది 10%చొప్పున లైసెన్స్ ఫీజు పెరుగుతుందని తెలిపారు. కొత్త పాలసీ ప్రకారం బార్ వ్యాపార సమయాన్ని రెండుగంటలు పెంచడం జరిగిందని ఆసక్తిగల అభ్యర్థులు గడువులోగా తమ దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

IN THE COURT OF THE
HON'BLE VII SENIOR CIVIL
JUDGE, CITY CIVIL COURTS
:: AT HYDERABAD
O.S.No. 782 OF 2025
Between:-
Smt. Deverapalli Komali & others
...Plaintiffs
AND
1. The Tahasidar, Moosarambagh, Hyderabad.
2. The Tahasildar, Santanuthalapadu Mandal, Ongole District, A.P
To
All Condemed ...Defendants
NOTICE
Please take notice that the plaintiffs herein have filed the above suit for declaration to declare them as the legal heirs of late Deverapalli Venkata Krishna Reddy which is posted on 09-09-2025 by the of Hon'ble court to receive the objections of persons opposing. If any person or persons have any objections, claim or concern of whatsoever against such relief, they may put forth their objections before the Hon'ble court on 09-09-2025 at 10.30 AM either personally or through authorized counsel or otherwise the matter will be adjudicated in due process of law. SCHEDULE OF PROPERTY "B": All that part and parcel of the open land bearing Plot No 4 &5, in Survey No 108/2 admeasuring Sq.533.33 Square Yards or equivalent to 442.66square Meters, situated at Pernamitta Village, Santanuthalapadu Mandal, Ongole District, A.P and bounded by:- North:-Plot No 66. South:-Sheikh Mastan Saheb's land. East:- Plot No 9,8 in my Taluk, West:- Road. Hence, this NOTICE.
(BY ORDER OF THE COURT)
Sd/- S. NAGESH KUMAR
Advocate
H.No: 16-11-741/D/78,
SBH Colony, Moosarambagh,
Hyderabad-36
Cell:9848933669.

# ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి

**కనిగిరి, ఆగస్టు 19, ప్రభాతవార్త**



కనిగిరి మండలంలోని పునుగోడు చెరువులో ఈతకు దిగిన ఇద్దరు యువకులు మునిగి మృతి చెందిన విషాధ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు సమాచారం మేరకు.. కనిగిరి పట్టణానికి చెందిన బొందలపాటి శివప్రసాద్(19), శంఖవరం గ్రామానికి చెందిన ఏనుగంటి గౌతం(17) ఆదివారం భైరవకోన జలపాతం చూడడానికి వెళ్తామని ఇంట్లో చెప్పి బయలుదేరారు. అయితే మంగళవారం పునుగోడు గ్రామస్తులు చెరువులో రెండు మృతదేహాలు తేలుతున్నట్లు గుర్తించి కనిగిరి ఎస్సై శ్రీరామ్‌కు సమాచారం అందించారు. వెంటనే డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ షేక్ ఖాజావలి, ఎస్సై టి.శ్రీరామ్, తహశీల్దార్ ఏవీ రవిశంకర్,సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. వారిని శివప్రసాద్, గౌతంగా గుర్తించారు. ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు మునిగిపోయారని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు బయటకు వెళ్ళినప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు. ఏం చేస్తున్నారు అన్నది తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని కనిగిరి పోలీసులు సూచించారు. యువకుల అకాల మృతి రెండు కుటుంబాల్లో తీవ్ర విషాధాన్ని నింపగా, బంధువులు కన్నీరు మున్నీరై విలపించారు.









## ప్రజల సమస్యలకు తక్షణం స్పందించిన ఎమ్మెల్యే ఉగ్ర

### - కనిగిరి 9వ వార్డులో తొలగిన మురుగు కాలువ ఇక్కట్లు

**కనిగిరి, ఆగస్టు 19, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీ 9వ వార్డులో సుదర్శన్ హాల్ నుంచి బోయపాలెం మీదుగా వెళ్లే పెద్ద మురుగు కాలువ వలన ప్రజలు ఎన్నాళ్లుగానో తీవ్రమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కాలువలో మురుగునీరు నిల్వ ఉండి అపరిశుభ్రత వాతావరణం నెలకొనడంతో స్థానికులు జ్వరాలు, వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు ఇటీవల శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వెంటనే చర్యలు చేపట్టడంతో మురుగు కాలువ సమస్య పరిష్కారం పొందింది. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తక్షణమే చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఏపీలో 5 జిల్లాలకు రెడ్ అలెర్ట్

**దొనకొండ,ఆగస్టు 19,ప్రభాతవార్త**

దక్షి ణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరో 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశముందని, ఈ నెల 19న దక్షి ణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ కేంద్రం డైరెక్టర్ భారతి తెలిపారు. దీని ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. విశాఖ, అనకాపల్లి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు,కృష్ణ,బాపట్ల,పల్నాడు, ప్రకాశం,నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. కర్నూలు,అనంతపురం,వైఎస్సార్ కడప,నెల్లూరు,తిరుపతి,చిత్తూరుజిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు.

## వానరాలతో అవస్థలు

**దొనకొండ,ఆగస్టు 19,ప్రభాతవార్త**




ప్రకాశం జిల్లా దొనకొండ మండలం చందవరం గ్రామం వానరాల కోతి బెడద ఎక్కువైంది. పంటలను నాశనం చేస్తున్నాయి. రోడ్డుపై వెళ్లే వాహనాలపై దాడి చేస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారు.కోతి ఇళ్లలోకి చొరబడి ఆహారం పదార్థాలను తీసుకెళ్తున్నాయి.ఈ సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

### దర్శి మున్సిపాలిటీ నందు ఒక బార్ లైసెన్సు పొందుటకు దరఖాస్తుకు ఆహ్వానం

### - ఎక్సైజ్ సీఐ కే.శ్రీనివాసరావు

**దర్శి, ఆగస్టు 18, ప్రభాతవార్త**



దర్శి మున్సిపాలిటీ నందు ఒక బార్ లైసెన్సు పొందుటకు గాను ఈనెల 18న నోటీఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐశ్రీనివాసరావు తెలిపారు. సంవత్సరానికి 35 లక్షల రూపాయల లైసెన్సు ఫీజు, ప్రతి సంవత్సరం 10 శతం చొప్పున లైసెన్సు ఫీజులో పెరుగుదల ఉంటుంది. లైసెన్సు ఫీజును సంవత్సరానికి 6 కిస్తీలలో కట్టువచ్చును అన్నారు. బారు యొక్క వ్యాపార గంటలు ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు ఉంటుంది. దర్శి మున్సిపాలిటీ నందు పీకేఎం/2బీ/24 గెజిట్ సీఇయల్ నెంబర్‌తో ఒక బార్ లైసెన్సు పొందుటకు అప్లికేషన్‌లు ఈనెల 18 నుండి సమర్పించవచ్చని, 26తో ఆఖరి తేదీ అని చెప్పారు. అప్లికేషన్ ఫీజు రూ.5లక్షలుగా నిర్ణయించారు. ప్రాసెసింగ్ ఫీజు కింద మరొక పది వేలు చెల్లించాలన్నారు. ఒక్కొక్కరు ఎన్ని అప్లికేషన్లు అయినా వేయవచ్చన్నారు. అప్లికేషన్‌లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతిలో సమర్పించవచ్చు అన్నారు. లాటరీ విధానంలో ఈనెల 28వ తేదీ జిల్లా కలెక్టర్ ఒంగోలు నందు లాటరీ తీసి బార్లు వచ్చిన వ్యక్తులకు కేటాయిస్తారన్నారు. ఆసక్తిగల వారు పూర్తి వివరాలకు దర్శి ఎక్సైజ్ స్టేషన్ నందు సంప్రదించాలన్నారు. దీనికి సంబంధించిన విషయాల గురించి ప్రస్తుత లైసెన్సు దారులతో, ఆసక్తి గల వ్యక్తులతో మంగళవారం దర్శి ఎక్సైజ్ స్టేషన్ నందు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు.

### ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి ప్రయోజనాలే ఎజెండాగా సాగిన లోకేష్ అన్న ఢిల్లీ పర్యటన

### - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, ఆగస్టు 19, ప్రభాతవార్త**



ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి జెండాగా గత రెండు రోజులుగా ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు పర్యటన ఎంతో మేలు చేస్తుందని దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం నుండి విశాఖ వరకు రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ ఘట్కరి నుండి హామీ పొందారు. క్వాంటం వ్యాలీ ఆర్టిఐ హెచ్‌లకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర ఐటీ ఎలక్ట్రానిక్ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరడం జరిగింది. అదే విధంగా ఆంధ్ర రాష్ట్రానికి రావాల్సిన నిధులు లోటు బడ్జెట్, రాజధాని నిర్మాణం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తదితర ఆర్థిక లోటు నుండి ఆంధ్ర రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు సంపూర్ణ సహకారం అందించాలని ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారాంని లోకేష్ కలిసి కోరడం వీటన్నింటిపై సానుకూలత వ్యక్తమవడం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిలో మరో మైలురాయిగా చెప్పవచ్చని డాక్టర్ లక్ష్మీ వివరించారు.

## ఇండోసోల్ సోలార్ ప్రవేట్ లిమిటెడ్..

### - స్థానికులకు ఉద్యోగావకాశాలు

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

భారతదేశంలో వేగంగా ఎదుగుతున్న సోలార్ మాడ్యూల్ తయారీ సంస్థల్లో ఒకటైన ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, స్థానిక యువత ప్రాజెక్టుకు భూములు సమకూర్చిన కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. పరిశ్రమ అభివృద్ధి కోసం తమ భూములు ఇచ్చిన కుటుంబాలకు కృతజ్ఞతగా ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, సమీప గ్రామాల నైపుణ్యం కలిగిన యువతకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్, కందుకూరు సబ్ కలెక్టర్ దమేర హిమ వంశీ హాజరు కానున్నారు.

## పులిపాడు, పెద్దఉల్లగల్లు గ్రామాలలో పొలం పిలుస్తోంది

**ముండ్లమూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని పులిపాడు, పెద్దఉల్లగల్లు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏ.తిరుమలరావు మాట్లాడుతూ రైతులందరూ వేసిన ప్రతి పంటకు పంట భీమా నమోదు చేయించుకోవాలని కోరారు. వరికి ఎకరాకు 860 రూపాయలు, కందికి రూ.430, సజ్జకి రూ.150, మిర్చికి రూ.4500, మినుము కు రూ.205, నువ్వులు రూ.180గా ప్రీమియంగా ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. ప్రతి రైతు పొలం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ నెంబర్‌తో పాటు పంట సాగు ధృవీకరణ పత్రం దగ్గర్లోని మీ సేవ కేంద్రం లేదా సీఎస్‌సీ సెంటర్లోన మోదు చేసుకోవాల్సిందిగా తెలియజేయడమైంది. పంటల భీమా నమోదుకు ఆఖరు తేదీ ఆగష్టు 31 అని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన కౌలు రైతులందరూ సంబంధిత వీఆర్వోని కలిసి కౌలుకార్డులు పొందాలన్నారు.కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవవర్తిస్తుందని,బ్యాంకు ద్వారా పంటరుణాలు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు విజయ నిర్మల, క్రాంతి రత్న, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

**దర్శి, ఆగస్టు 19, ప్రభాతవార్త**



దర్శి టౌన్ పరిధిలోని శివరాజ్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కరిపిరెడ్డి రమణారెడ్డి నూతన గృహ ప్రవేశ వేడుకలకు ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వారి నివాసంలో జరిగిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి, వైసీపీ మున్సిపల్ విభాగం కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మిల్లర్ బుజ్జి, మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, దొంత ఏడుకొండలు, మల్లె రామకృష్ణ, కవలకుంట్ల లాజరు తదితరులు పాల్గొన్నారు.

### తహశీల్దార్ చేతుల మీదుగా ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

**దర్శి, ఆగస్టు 19, ప్రభాతవార్త**



ఒంగోలు కిమ్స్ వారి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ దర్శి, ఎస్‌టీఆర్ మార్కెటింగ్ సహకారంతో పీజీఎన్ తాలూకా కాంప్లెక్స్ నందు ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించు ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిధిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ఘన విజయం చేయాల్సిందిగా ఎమ్మార్వో శ్రవణ్ కుమార్‌ని రోటరీ క్లబ్ సభ్యులు కోరడం జరిగింది. తదుపరి ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ప్రారంభించి ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల పేద ప్రజలు ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారికి ఉన్నటువంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను కనుగొని వాటికి సూచించిన మందులను వాడుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిందిగా, ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఆర్ మార్కెటింగ్ యజమాని సానికొమ్ము తిరుపతిరెడ్డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బోయిళ్ల నాగేశ్వరరెడ్డి, సెక్రటరీ అంబవరపు నారాయణరెడ్డి, ట్రెజరర్ కర్ణ రమణారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, రెడ్డిమాసు శ్రీను, రాజారెడ్డి, పేరిరెడ్డి, మర్తల భాస్కర్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కి చిరువ్యాపారులు సహకరించాలి

**దర్శి, ఆగస్టు 19, ప్రభాతవార్త**



దర్శిగడియారస్తంభం సెంటర్లో అద్దంకి రోడ్డు కురిచేడు రోడ్డు పొదిలి రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు అక్రమణాలు తొలగించడం జరుగుతుందని ఫొటోగ్రఫీ మీద తోపుడు పనులు చిరువ్యాపారులు బండ్లు పెట్టడం వలన ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలుగతుందని ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా చిరు వ్యాపారులు సహకరించాలని నగరకమీషనర్ వై.మహేశ్వరరావు తహశీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్, ఎస్సై ఎం.మురళిలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతోటి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడియారస్తంభం సెంటర్లో ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతుందని దీనిని చిరు వ్యాపారస్తులు వ్యాపారస్తులు తోపుడు బండ్లు వాళ్ల గమనించాలని అదే విధంగా సెంటర్లో సైడు కాలువ మీద ఉన్న రోడ్లపైకి వచ్చిన వ్యాపారస్తుల బండ్లు తొలగించడం జరుగుతుందని దీనిని వ్యాపారస్తులు గమనించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మానవతా శాంతియుత ర్యాలీ

**దర్శి, ఆగస్టు 19, ప్రభాతవార్త**




మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రపంచ మానవత్వపు దినోత్సవం(ఆగష్టు-19)లను పురస్కరించుకుని మంగళవారం స్థానిక చౌటపాలెం రోడ్డు నందు గల ఎంపీడీఓ ఆఫీసు వద్ద నుండి ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శాంతి ర్యాలీ దర్శి మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### ఒంగోలు లాడ్జిలో పసుపుగల్లు యువకుడు ఉరేసుకుని అనుమానస్పద మృతి

### - శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

**ముండ్లమూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త**



మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన కీర్తి శ్రీనివాసులు కోటేశ్వరమ్మల కుమారుడు కీర్తి ఆంజనేయులు(22) సోమవారం రాత్రి పసుపుగల్లు గ్రామం నుండి ఒంగోలుకి వెళ్లి ఒంగోలులో ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇతను డిగ్రీ పూర్తి చేసుకున్నాడు. మృతుడికి అన్నయ్య చెల్లెలు కలరు. వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధుమిత్రులు కొడుకు మరణ వార్త వినగానే మునిగిపోయారు. మృతుడు కీర్తి ఆంజనేయులు చనిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## చిన్నారుట్ల వద్ద రోడ్డు ప్రమాదం

### - మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతి

### - ఒకరికి స్వల్ప గాయాలు

**పెద్దదోర్నాల, ఆగష్టు 19, ప్రభాతవార్త**



ఓ మోటారు సైకిల్ స్కిడై ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పెద్దదోర్నాల మండల పరిధి శ్రీశైలం ఘాట్ రోడ్డు చిన్నారుట్ల వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనలో కడప జిల్లా సిద్దవటం మండలానికి చెందిన కొంగ సుబ్బారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మోటారు సైకిల్ వెనుక వైపున కూర్చున్న తన బంధువు మహిళ ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. మోటారు బైక్‌పై శ్రీశైలం నుండి దోర్నాల వైపుకు వస్తుండగా చిన్నారుట్ల సమీపంలో మోటారు బైక్ స్కిడ్ అయి కొండకు ఢీకొని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తన బంధువుకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దోర్నాల ఎస్సై వి.మహేష్ హుటాహుటీన సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని మార్కాపురం మార్చురికి తరలించారు. ఎస్సై వి.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈ హాజరు.. విధులకు ఉండదు గైర్హాజరు..!

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పాఠశాల పనిమీద విద్యాశాఖ కార్యాలయానికి వెళ్తున్నట్లు లీప్ యాప్‌లో స్పెషల్ డ్యూటీ కింద నమోదు చేసి వెళ్తుంటేవారు. పాఠశాల పనికోసం కాక ఒక ట్యూషన్ సెంటర్‌కు వెళ్లివస్తుండడం గమనార్హం. అనంతరం యధావిధిగా పాఠశాలలో హాజరు వేసి సొంత పని చక్కబెట్టుకున్నారు. ఒక ప్రధానోపాధ్యాయుడు ఉపఖజానా అధికారి కార్యాలయానికి వెళ్తున్నట్లు నమోదు చేసి బంధువుల వేడుకకు హాజరయ్యారు. కొంత మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సొంత పనులపై బడి నుంచి బయటకు వెళ్లి విధుల్లో ఉన్నట్లు నమోదు చేస్తున్నారు. ఇకపై అలా తరగతులు ఎగగొట్టి సొంత పని చక్కబెట్టుకుందామనుకుంటే కొదరదు.. ఈ హాజరు విధానంలో విద్యాశాఖ కీలక మార్పులు చేసింది. చాలా కాలం కొనసాగుతున్న అసంబద్ధ విధానాలకు అడ్డుకట్ట వేసి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే విధంగా చర్యలు తీసుకుంటుంది. పాఠశాల పనిపై బయటకు వెళ్లే వారు ఎప్పటిలాగే లీప్ యాప్‌లో దరఖాస్తు చేయాలి. కొత్త విధానంద్వారా డీఈఓ ఈ హాజరు లేని తన లాగిన్‌కు వెళ్లి పరిశీలిస్తారు. జీపీఎస్ ద్వారా అధికారికి తెలిసిపోయేలా యాప్ రూపొందించారు. ఆన్‌లైన్‌లో పేర్కొన్న వివరాలు, ఉద్యోగి ఉన్న చోటు ఒకటే అయితేనే ఓటీపీ ద్వారా స్పెషల్ డ్యూటీకి అనుమతి ఇస్తారు. అప్పుడే వీరి హాజరు తీసుకుంటుంది. లేని పక్షంలో ఈ యాప్‌లో తిరస్కరిస్తుంది. అంటే వీరిని గైర్హాజరు కింద చూపిస్తారు. దీనికి తోడు ప్రత్యేక పనిపై బయటకు వెళ్లిన ఉద్యోగి అక్కడ సంబంధిత అధికారిని కలిసినట్లు డీఈఓ ఫోన్ ద్వారా తెలుసుకుంటారు. ఈ విధానాన్ని ఉన్నతాధికారులు ఇటీవల తీసుకువచ్చారు.పాఠశాల విద్యాశాఖలో ఇది శుభపరిణామం. డీఈఓకు ముందస్తు సమాచారంతో ప్రత్యేక విధులకు అనుమతి లభిస్తుంది.

### అన్నదాత సుఖీభవ సుఖీభవ ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలి

**కొండపి, ఆగష్టు 19, ప్రభాతవార్త**

కొండపి రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ నగదు అందని రైతులు ఈ నెల 20వ తేదీన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు కొండపి మండలం పరిధి లో గోగినేనివారిపాలెం మరియు1 మిట్టపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి అధ్యక్షత వహించి, రైతులను ఉద్దేశించి, మాట్లాడారు అన్నదాత సుఖీభవ సంబంధించి అర్హత ఉండి డబ్బులు రానివాళ్లు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు విధంగా ఆధార్ నంబర్స్ తప్పుగా లింక్ అయ్యిన వాళ్ళు మరియు కుటుంబం లో రైతులు చనిపోయి ఉంటే వాళ్ళ కి సంబంధించిన కుటుంబం సభ్యులు మ్యుటేషన్ చేయించుకోవడానికి ఈ నెల 31 వరకు ప్రభుత్వం వారు అవకాశం కల్పించారు. అలా చేయించుకున్న వారికి అన్నదాత మొదటి విడత వెంటనే పడతాయి అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ కుమార్ గ్రామ రైతులు పాల్గొన్నారు..


## టీ షర్ట్స్ అందజేత



**వేటపాలెం ఆగష్టు 19, ప్రభాతవార్త**

వేటపాలెం మండలం కొత్తపాలెం గ్రామం నందు ప్రిపేర్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో యువతి యువకులకు గేమ్స్, స్పోర్ట్స్‌పై ఆసక్తి కలిగిన యువతీ, యువకులకు ప్రిపేర్ స్వచ్ఛంద సేవా సంస్థ తరుపున టీ షర్టు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కెనరా బ్యాంకు మేనేజర్ చీరాల, ప్రిపేర్ సేవా సంస్థ సీనియర్ ఎంప్లాయిస్ ఎస్వీ రమణారెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు కోఆర్డినేటర్ ఆశ,కమ్యూనిటీ హెల్త్ నర్సులు హెప్సీబా,స్వాతి, మంజుల, రాజకుమారి, నాగ జ్యోతి, మెర్సీ, శ్రీలేఖ మయూరి, ప్రసన్న కుమార్, ఆగ్రామంలోని రైతులు యువతీ యువకులు పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ చీరాల ఎం.పరమేశ్వరయ్య మాట్లాడుతూ యువతీ, యువకులకు ఎడ్యుకేషనల్ లోన్స్, బిజినెస్‌లోన్స్, సబ్సిడీ లోన్స్, గొర్రెలు, కోళ్ల పెంపకంకు లోన్స్ పిల్లల చదువులకు కావాల్సినటువంటి లోన్లు సబ్సిడీ రూపంలో అందిస్తామని, చదువుకునే పిల్లలు 14 సంవత్సరాల వయస్సు నుంచే చక్కగా స్పోర్ట్స్ పై మంచి అవగాహన, నైపుణ్యాలను పెంచుకొని స్పోర్ట్స్ ద్వారా కూడా మంచి ఉపాధిని పొందవచ్చునని తెలియజేశారు. అదే విధంగా ప్రిపేర్ స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలను అభినందించడం జరిగింది. అదే విధంగా ప్రిపేర్ సీనియర్ సిబ్బంది మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రకృతి వ్యవసాయ లాభాలు, కషాయాలు, మల్టీ గ్రైన్స్ పురాతన వ్యవసాయ పద్ధతులను తెలియజేయడం జరిగింది.

### నూతన వధువరులను ఆశీర్వదించిన మాజీమంత్రి శిద్దా



**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

గుంటూరు శ్రీకన్వెన్షన్ హాల్‌లో జరిగిన నంబూరు శివ నాగేశ్వరావు, సునీత దంపతుల కుమారుడు శ్రీకర్, నిఖితల వివాహం అనంతరం జరిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత వేడుకలలో రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు శిద్దా రాఘవరావు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఓక్లాండ్ విశ్వవిద్యాలయంతో క్విస్ ఒప్పందం

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించే దిశగా అడుగులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, గ్లోబల్ స్థాయిలో అధునాత విద్యను అందించే విధంగా క్విస్ మరో మైలు రాయిని చేరుకుంది. అమెరికాలోని మిచిగాన్‌లో ప్రముఖ ఓక్లాండ్ విశ్వవిద్యాలయం, క్విస్ విద్యాసంస్థల మధ్య అవగాహన ఒప్పందం జరిగినట్లు యాజమాన్యం తెలియజేసింది. ఈ మేరకు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఓక్లాండ్ విశ్వవిద్యాలయంలోని డెసిషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ విభాగం చైర్ ప్రొఫెసర్ డాక్టర్ విజయన్ సుగుమారన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. క్విస్ కి చెందిన విద్యార్థులు ఓక్లాండ్‌లో జరిగే ఆర్టికల్ ప్రోగ్రామ్ లో, ముఖ్యంగా బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లో ప్రోగ్రామ్ లో పాల్గొనేందుకు ఉపయోగపడుతుంది. ఏటా దాదాపు 20 మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ ప్రోగ్రామ్ లో పాల్గొనవచ్చు. దీని ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి కోర్సులు, సర్టిఫికెట్లు రావడమే కాకుండా గ్లోబల్ గా కూడా గుర్తింపు లభించనుంది. ఇలాంటి ఒప్పందాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి అన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో క్విస్ విద్యాసంస్థలు ఎప్పుడు ఉంటాయని ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు అన్నారు. ఈ ఎంవోయూ కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ జాఫర్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయోకరమైన ఎంవోయూ ఇది అని ఆయన అభిప్రాయపడ్డారు.



20-8Pg5 9thpage_20-8Pg5.qxd 8/19/2025 10:35 PM Page 1



# 6 వేల విద్యార్థి వీసాలు రద్దు!



## అమెరికా ప్రభుత్వం తాజా నిర్ణయం

### నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు: ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 19:** అమెరికాలో నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకొంటున్నారు. తాజాగా 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు బిబిసి రిపోర్టులో పేర్కొంది. అమెరికా విదేశాంగ శాఖ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. 4,000 మంది దేశ చట్టాలు ఉల్లంఘించడం, దాడులు, మత్తులో డ్రైవింగ్, దోపిడీలకు పాల్పడటం వంటివి చేసినట్లు తెలుస్తోంది. అమెరికా చట్టాల్లోని ఐఎన్ఎ 3బి కింద ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300 మంది కూడా ఈ జాబితాలో ఉన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో ఈ వీసాల రద్దు వ్యవహారం వెలుగులోని రావడం గమనార్హం.

ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే పనిలో పడ్డారు. ప్రధాన విశ్వవిద్యాయాలను లక్ష్యంగా చేసుకొని తీవ్రస్థాయిలో పాలసీల మార్పులు చేపట్టారు. ఇవి అంతర్జాతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. తొలుత జనవరిలో యాంటీ సెమిటిజమ్‌ను (యూదులపై వ్యతిరేకత) అరికట్టేలా బిల్లును పాస్‌చేశారు. అంతర్జాతీయ విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా ఆందోళనలు చేపడితే ఈ ఆదేశాల ప్రకారం వారిని దేశ బహిష్కరణ చేయవచ్చు.

విదేశీ విద్యార్థులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను నిలిపివేస్తూ జూన్‌లో ట్రంప్ కార్యవర్గం నిర్ణయం తీసుకొంది. అనంతరం సోషల్ మీడియా వెట్టింగ్‌ను కఠినతరం చేశారు. ఫారెన్ స్టూడెంట్స్ కచ్చితంగా వారి సామాజిక మాధ్యమ ఖాతాలు బహిర్గతం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పోస్టులు, కామెంట్లు, లైక్‌లను అమెరికా అధికారులు పరిశీలించి.. వారు జాతీయ భద్రతకు ముప్పు కాదు అని భావిస్తే మాత్రమే వీసా ప్రక్రియలో ముందుకువెళతారు. ఇక కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధుల్లో కోత విధించారు. క్యాంపస్‌ల్లో పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న చాలామంది విదేశీ విద్యార్థులను అరెస్టు చేయించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థులను నియమించుకోకుండా బ్లాక్ చేశారు. ఈ క్రమంలో ట్రంప్ కార్యవర్గం, విశ్వవిద్యాలయం మధ్య న్యాయపోరాటం మొదలైంది.

గతేడాది గణాంకాల ప్రకారం.. దాదాపు 10 లక్షల మందికిపైగా అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. వారి నుంచి దాదాపు 43.8 బిలియన్ డాలర్లు అమెరికాకు లభించాయని ఎన్ఎఎఫ్ఎస్ఎ అసోసియేషన్ వెల్లడించింది. దేశంలోని మొత్తం విద్యార్థుల్లో వీరు 6 శాతం వరకు ఉంటారు.



## యుఎస్-ద.కొరియా సైనిక విన్యాసాలు

### ఉత్తర కొరియా నియంత కిమ్ కన్నెర్ర

**ప్యాంగ్‌యాంగ్, ఆగస్టు 19:** అమెరికా, దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ మళ్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ అణ్వాయుధ దళాన్ని విస్తృతం చేస్తానని వ్యాఖ్యానించారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన అధునాతన యుద్ధనౌకను పరిశీలించిన కిమ్. ప్రత్యర్థుల సైనిక విన్యాసాలు శత్రుత్వాన్ని పెంచేవేనని అన్నారు. అమెరికా, ద.కొరియా చేపడుతున్న సైనిక కసరత్తులను దండయాత్రకు సన్నాహాలుగా వాదిస్తున్న కిమ్.. తన సైనిక, అణ్వాయుధ కార్యక్రమాలను సమర్థించుకుంటున్నారు. ఈ క్రమంలోనే అణుసామర్థ్యం కలిగిన చో హ్యోన్ అనే యుద్ధనౌకను తాజాగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యర్థుల సైనిక కసరత్తులు శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని, యుద్ధాన్ని ప్రేరేపించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవి మునుపటి కంటే ఎక్కువ ఉద్రిక్తతలు పెంచేవిగా ఉన్నాయని, వాటికి దీటుగా ప్రతిస్పందించేందుకు తాము కూడా సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

'ఉ. కొరియా చుట్టూ భద్రతా పరిస్థితులు రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇప్పటికే ఉన్న సైనిక, అణు సామర్థ్యాలను వేగంగా మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉంది' అని కిమ్ పేర్కొన్నట్లు ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ కెసిఎన్ఎ వెల్లడించింది. ఉత్తర కొరియా నుంచి పొంచి వున్న ముప్పును ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్న అమెరికా, దక్షిణ కొరియా బలగాలు.. వార్షిక సైనిక విన్యాసాలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నాయి. 11 రోజులపాటు కొనసాగే ఈకసరత్తుల్లో సియోల్‌కు చెందిన 18 వేల మందితో సహా మొత్తం 21వేల మంది సైనికులు పాల్గొంటున్నారు. క్షేత్రస్థాయి శిక్షణ, కంప్యూటర్ సిమ్యులేటెడ్ కమాండ్ పోస్టుతో పాటు ఆయుధ పరీక్షలు కూడా నిర్వహించనున్నారు.

## కాంగోలో ఊచకోత

### 52 మందిని నరికేసిన రెబల్స్

**కిన్షాస, ఆగస్టు 19:** ఆఫ్రికా దేశమైన కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు కలిగిన తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. కత్తులు, గొడ్డళ్లతో 52 మందిని నరికి చంపారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులు తెలిపారు. కాంగో దళాల చేతిలో ఓటమి పాలవడంతో రగిలిపోయిన అలైట్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఎడిఎఫ్) సభ్యులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని అక్కడి అధికారి తెలిపారు. బెని, లుబెరో ప్రాంతాల్లోని పౌరులపై ఎడిఎఫ్ తిరుగుబాటుదారులు దాడికి పాల్పడినట్లు వెల్లడించారు. నిద్రపోతున్న ప్రజలను లేపి.. తాళ్లతో చేతులు కట్టి కత్తులు, గొడ్డళ్లతో అతికిరాతకంగా నరికి చంపారన్నారు. మెలియా గ్రామంలోనే దాదాపు 30 మంది ప్రాణాలు తీశారన్నారు. ఎనిమిది మంది మహిళలు, ఇద్దరు చిన్నారులతోసహా మొత్తం 52 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు. ఇళ్లకు కూడా నిప్పంటించారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇటీవల ఓ కాథ్యలిక్ చర్చి ప్రాంగణంలో తిరుగుబాటు దారులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 38 మంది ప్రాణాలుకోల్పోయారు. ఇస్లామిక్ స్టేట్‌తో ముడిపడి ఉన్న తిరుగుబాటు సంస్థ ఎడిఎఫ్. ఈ సంస్థ ఉగాండా, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. పౌరులే లక్ష్యంగా కొన్నేళ్లుగా దాడులకు పాల్పడుతోంది. 2013నుంచి ఇప్పటి వరకు దాదాపు ఆరు వేల మందికిపైగా బలిగొన్నట్లు నివేదికలున్నాయి. ఎడిఎఫ్‌పై అమెరికా, ఐరాస భద్రతామండలిలు ఆంక్షలు విధించాయి.

## అభిప్రాయం చెప్తాం.. తీర్పు ఇవ్వం



### తమిళనాడు కేసుపై స్పష్టం చేసిన సిజెఐ

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** తమిళనాడు కేసుపై తమ బెంచ్ అభిప్రాయం వెల్లడిస్తుందే కానీ తీర్పు ఇవ్వదని సుప్రీంకోర్టు సిజెఐ బిఆర్ గవాయ్ పేర్కొన్నారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా తేల్చాలని కోర్టులు నిర్దేశించవచ్చా అన్న అంశంపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. తొలుత ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టడంపై ఉన్న అర్హతలను వింటామని చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బిఆర్ గవాయ్ వెల్లడించారు. దీనిపై సీనియర్ న్యాయవాది కెకె వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ అంశంలో చాలా విషయాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను చూడాలని పేర్కొన్నారు. పంజాబ్, తమిళనాడు, తెలంగాణ కేసుల్లో వీలైనంత త్వరగా అన్న పదంవల్ల జాప్యం చోటుచేసుకొందన్నారు. తమిళనాడు కేసు వల్ల ఇప్పుడుగడువు విధించారని వెల్లడించారు. దీనిపై సిజెఐ స్పందిస్తూ స్వయంగా రాష్ట్రపతి దీనిపై రిఫరెన్స్ అడిగారు. దీనిలో మీకున్న సమస్య ఏమిటని ఆయన ప్రశ్నించారు. మరోవైపు అటార్నీ జనరల్ వెంకటరమణి స్పందిస్తూ తాము రాజ్యాంగ ధర్మాసనం పరిశీలన కోరతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు కూడా విన్న సిజెఐ గవాయ్ స్పందిస్తూ తాము కేవలం అభిప్రాయాలు మాత్రమే చెబుతామని తమిళనాడు కేసుపై తీర్పు మాత్రం ఇవ్వమని పేర్కొన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నరసింహ కూడా తమబెంచ్ కేవలం అభిప్రాయం మాత్రమే వెల్లడిస్తుందని, అది తమిళనాడు కేసు జడ్జిమెంట్‌పై ఎలాంటి ప్రభావం చూపదని పేర్కొన్నారు.

తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్ఎన్‌రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ యేడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్ గరిష్టంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈతీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టు ఉందని జస్టిస్ జెబిపార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్ ధర్మాసనం తేల్చిచెప్పింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధించడంపై అభిప్రాయాలు తెలియచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఇప్పటికే దీనిపై కేంద్రం స్పందించింది. ఒక రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం రాజ్యాంగపరమైన గందరగోళానికి దారి తీస్తుందని సుప్రీంకోర్టుకు తెలియచేసింది. అలాచేయడం ప్రభుత్వం తనకు రాజ్యాంగం ఇవ్వని అధికారాన్ని అందిపుచ్చుకుని చెల్లాయించినట్లువుతుందని పేర్కొంది.

## నెలాఖరులో ప్రధాని చైనా పర్యటన: దోవల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెలలో చైనాలో పర్యటించనున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వెల్లడించారు. భారత్ పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ సందర్భంగా దోవల్ ఈ విషయాన్ని ధృవీకరించారు. తియాంజిన్ నగరంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని మోడీ పాల్గొననున్నారని చెప్పారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీతో 24వ ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు ఢిల్లీలో జరిగాయి. ఈ సందర్భంగా అజిత్ దోడల్ మాట్లాడుతూ గడిచిన తొమ్మిది నెలల్లో సరిహద్దుల్లో పరిస్థితులు మెరుగుపడ్డాయని, ప్రస్తుతం అక్కడ ప్రశాంత వాతావరణం కొనసాగుతుందన్నారు. తాజా ద్వైపాక్షిక చర్చలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్న ఆయన ఇరు దేశాధినేతలు కజాన్‌లో భేటీకావడం ఉద్రిక్తతలను తగ్గించిందన్నారు. చైనాలోజరిగే ఎస్‌సిఒసదస్సుకు ప్రధాని మోడీ హాజరవుతున్నారని అధికారికంగా ప్రకటించారు. వాంగ్ యీ మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా మనం ఎదుర్కొంటున్న సవాళ్లు మన ప్రయోజనాలకు అనుగుణంగా లేవు. మోడీ, జిన్‌పింగ్‌లు కజాన్‌లో భేటీ కావడం, ఆ తర్వాత సరిహద్దులోనూ పరిస్థితులు స్థిరంగాఉండటం సంతోషకరమైన విషయం. ఎస్‌సిఒ సదస్సుకు ప్రధాని మోడీ రాకను స్వాగతిస్తున్నాం. భారత్, చైనాల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు దీర్ఘకాలిక ప్రయోజనాలకు దోహదం చేస్తాయని చరిత్ర, వాస్తవికత రుజువు చేస్తోంది అని చెప్పారు.

## 75 వేల కిలోల రాకెట్‌ను సిద్ధం చేసిన ఇస్రో

### ఇప్పటిదాకా ఇదే 'పవర్‌ఫుల్'

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు పెద్ద ముందడుగు వేస్తూ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇప్పటివరకు అత్యంత శక్తివంతమైన రాకెట్‌పై పని చేస్తోంది. ఈ రాకెట్ 40 అంతస్తుల ఎత్తు ఉంటుంది. ఇది 75,000 కిలోల బరువు గల ఉపగ్రహాన్ని భూమికి దగ్గరి కక్ష్యలోకి తీసుకెళ్తుంది. ఈ ప్రాజెక్టును ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ప్రకటించారు. 35 కిలోల నుండి 75,000 కిలోలకు ప్రయాణం ఇస్రో ప్రారంభ దశలను గుర్తు చేసుకుంటూ నారాయణన్ డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో రూపొందించిన మొదటి రాకెట్ 17 టన్నుల బరువు ఉంటుందని, అది కేవలం 35 కిలోలను మాత్రమే భూమికి దగ్గరి కక్ష్యలో ఉంచగలదని చెప్పారు. 'ఈ రోజు, మేము 75,000 కిలోలను కక్ష్యలో ఉంచగల రాకెట్‌ను రూపొందిస్తున్నాము. ఈ రాకెట్ 40 అంతస్తుల భవనం ఎత్తు ఉంటుంది' అని ఆయన అన్నారు. ఇది భారతదేశ సాంకేతిక అభివృద్ధిలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. 2025లో ఇస్రో కార్యక్రమాలు ఇస్రో చేపట్టనున్న కార్యక్రమాలు నావిక్ ఉపగ్రహాలు భారత స్వతంత్ర జీపీఎస్ వ్యవస్థను మెరుగుపరచడం.కొత్త ఎన్1 రాకెట్, ఇది భారీ ప్రయోగాలకు వెన్నెముకగా పనిచేస్తుందని భావిస్తున్నారు. 6,500 కిలోల అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహ ప్రయోగం, ఇది భారతదేశ తక్కువ ధర ప్రయోగ వాహనాలపై ప్రపంచ దేశాలకు పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తుంది.

**టెక్నాలజీ డెమోన్‌స్ట్రేషన్ శాటిలైట్ ప్రయోగం.**

భారత నావికాదళం కోసం ఒక సైనిక కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్7ఆర్ ప్రయోగం, ఇది పాతబడిపోయిన జీశాట్7 (రుక్మిణి) స్థానంలో వస్తుంది. భారతదేశ ఉపగ్రహాల సంఖ్యను పెంచడం ప్రస్తుతం, అంతరిక్షంలో భారతదేశానికి 55 ఉపగ్రహాలు పనిచేస్తున్నాయి. అవి నావిగేషన్, కమ్యూనికేషన్, రక్షణ, వాతావరణ శాస్త్రం, భూమి పరిశీలనలకు ఉపయోగపడుతున్నాయి.

ఈ సంఖ్య రాబోయే మూడు నుంచి నాలుగు సంవత్సరాలలో మూడు రెట్లు పెరుగుతుందని నారాయణన్ చెప్పారు. ప్రపంచ పరిస్థితి, ప్రాధాన్యత ఈ ప్రకటన భారతదేశాన్ని అమెరికా, చైనా, రష్యా వంటి అభివృద్ధి చెందిన అంతరిక్ష దేశాల సరసన నిలుపుతుంది. ఈ దేశాలు కూడా భారీ ప్రయోగ వాహనాలను రూపొందిస్తున్నాయి.

## ఇది పరిహాసమా.. ఒక జిల్లా మొత్తాన్ని రాసిస్తున్నారా?

### ఒక కంపెనీకి 992 ఎకరాల భూమిని కేటాయించడంపై గువాహతి హైకోర్టు సీరియస్!

**గువాహతి, ఆగస్టు 19:** రాష్ట్రంలోని డిమా హసావో జిల్లాలో మహాబల్‌సిమెంట్స్ అనే ప్రైవేట్ సిమెంట్ కంపెనీకి ఏకంగా 3,000 బీఘాల (దాదాపు 992ఎకరాలు) భూమిని కేటాయించడంపై గువాహతి హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయాన్ని అసాధారణమైనదిగా అభివర్ణించిన న్యాయస్థానం 'ఇది పరిహాసమా.. ఒక జిల్లా మొత్తాన్ని రాసిస్తున్నారా?' అంటూ సీరియస్‌గా ప్రశ్నించింది.

విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కుమార్ మేధి భూ కేటాయింపుల గురించి తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒక ప్రైవేట్ కంపెనీకి 3000 బీఘాలా? అది బీడు భూమి అయినా ఇంత పెద్ద మొత్తంలో కేటాయించడం ఏమిటి? ఇక్కడ కంపెనీకి ఎంత భూమి అవసరం అన్నదికాదు, ప్రజా ప్రయోజనమే ముఖ్యం' అని వ్యాఖ్యానించారు. ఈ భారీ భూకేటాయింపుకు సంబంధించిన అన్ని రికార్డులు, ప్రభుత్వ విధాన పత్రాలను తమముందు ఉంచాలని నార్త్ కచార్ హిల్స్ అటానమస్ కౌన్సిల్‌ని న్యాయస్థానం ఆదేశించింది. డిమా హసావో జిల్లా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ పరిధిలోకి వస్తుందని, ఇక్కడి గిరిజన తెగల హక్కులు, ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోర్టు గుర్తుచేసింది. కంపెనీ తరఫు న్యాయవాది వాదిస్తూ అది పూర్తిగా బీడు భూమి అని ఫ్యాక్టరీ నిర్మాణానికి అంతభూమి అవసరమని చెప్పారు. టెండర్‌ద్వారా పొందిన మైనింగ్ లీజుకు కొనసాగింపుగానే ఈ కేటాయింపు జరిగిందని తెలిపారు.

## మరో 15 యేళ్లలో చంద్రుడిపైకి భారత్ వ్యోమగామి




### 2027లో మానవసహిత గగన్‌యాన్

### శుభాంశు శుక్లా ఘనతపై లోక్‌సభ చర్చలో కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** వికసిత భారత్‌కు దూతగా 2040లో భారతీయ వ్యోమగామి చందమామపై అడుగుపెట్టనున్నాడని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. శుభాంశు శుక్లాను అభినందిస్తూ కేంద్రమంత్రి జితేంద్రసింగ్ సోమవారం లోక్‌సభలో చర్చను ప్రారంభించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలక పాత్ర పోషిస్తుందని సింగ్ చెప్పారు. 'సంస్కరణల ద్వారా అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించాక సంబంధిత వాణిజ్యం 800 కోట్ల డాలర్లకు చేరింది. వచ్చే దశాబ్ది నాటికి ఇది 4,500 కోట్ల డాలర్లకు చేరుతుంది. వ్యోమమిత్ర అనే రోబోను వచ్చే యేడాది అంతరిక్షంలోకి పంపించనున్నాం. 2027లో తొలిసారిగా మానవసహిత అంతరిక్ష యాత్ర చేపట్టనున్నాం. 2040లో చంద్రుడిపై భారత వ్యోమగామి పాదం మోపి.. త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తారు. 2035కల్లా మనకూ సొంత అంతరిక్ష కేంద్రం ఉంటుంది' అని జితేంద్ర సింగ్ వివరించారు. బీహార్ ఓటరు జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు లోక్‌సభలో నినాదాలు చేశాయి. జితేంద్ర సింగ్ ప్రసంగిస్తున్న సమయంలోనూ ఇవి కొనసాగాయి. వాకౌట్ చేసిన ప్రతిపక్షాల తీరును ఎన్డీయే నేతలు తప్పుబట్టారు. 'మీకు బిజెపిపై, ప్రభుత్వంపై కోపం ఉండవచ్చు. వ్యోమగామిపైనా మీరు కోపంగా ఉండటం ఆశ్చర్యకరం. ఆయనొక వ్యోమగామి మాత్రమే కాకుండా క్రమశిక్షణ గల వాయుసేన సైనికుడు. ఆయనకు ఏ పార్టీతో సంబంధం లేదు' అని జితేంద్ర చెప్పారు.

**ఇలాంటి వాటిపైనా రాజకీయాలా? : రక్షణమంత్రి రాజ్‌నాథ్**

దేశం అభివృద్ధి చెందడం ప్రతిపక్షాలకు ఇష్టంలేదని, వాటి తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శించారు. దేశానికి గర్వకారణమైన అంశాల్లోనైనా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రశ్నోత్తరాల సమయానికి అడ్డుపడిన సభ్యులపై స్పీకర్ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలు ప్రశ్నలడిగితే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. విపక్ష నిరసనలతో సభ వాయిదా పడినందువల్ల అసంపూర్తిగా మిగిలిన చర్చ మంగళవారం కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళనతో రాజ్యసభ కూడా వాయిదా పడింది. గందరగోళం మధ్యనే భారతీయ ఓడరేవుల బిల్లును సభ ఆమోదించింది. విపక్షాలు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ అరాచకంగా వ్యవహరిస్తున్నాయని సభాపక్ష నేత జెపి నడ్డా విమర్శించారు.

## సంక్షిప్తంగా..

### నెహ్రూ దేశాన్ని రెండుసార్లు విభజించారు: ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భారతదేశాన్ని రెండుసార్లు విభజించారని ప్రధాని నరేంద్రమోడీ ఆరోపించారు. ఒకసారి రాడ్‌క్లిఫ్ లైన్‌తో విభజిస్తే భారత్‌కు చెందిన సింధూ నదిని ముక్కలు చేసి మరోసారి విభజించారన్నారు. దీనివల్ల దేశంలో వ్యవసాయానికి గణనీయమైన నష్టం వాటిల్లిందన్నారు. కొంత కాలానికి పాకిస్తాన్‌తో తాను చేసుకున్న సింధూ నది ఒప్పందం వల్ల 80 శాతం నీరు ఆ దేశానికి వెళ్లాయని భారత్‌కు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేదనే విషయాన్ని నెహ్రూనే స్వయంగా అంగీకరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు వ్యతిరేకి అనేదానికి ఆయన తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమన్నారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోడీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచేశారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం అధికారం చేపట్టాకే వారి అభివృద్ధి మొదలయిందని, ఎన్డీఎ పాలనలో దేశం మూడో ఆర్థిక శక్తిగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందన్నారు.

### హద్దుమీరితే అరెస్టులే: అసోం సిఎం శర్మ

**గౌహతి, ఆగస్టు 19:** ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు తమ రాష్ట్రంలో పర్యటించడంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 'కొత్త వ్యక్తులు' రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారని, సున్నిత అంశాలపై రాజకీయం చేస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. కేరళ, ముంబయి, ఢిల్లీ ఇలా ఎక్కడివారైనా నిబంధనలకు లోబడి నడుచుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యటించే కొందరిపై నిఘా ఉంచాం. ఎన్ఆర్‌సి అప్‌డేషన్ సమయంలోనూ కొందరు అలజడులు సృష్టించడానికి ప్రయత్నించారు. అప్పుడు వారిపై ప్రభుత్వం అంతగా దృష్టి పెట్టలేదు. కానీ ఇప్పుడు మాత్రం వారిపై కన్నేసి ఉంచాం. నిబంధనలు అతిక్రమించి హద్దులు దాటి ప్రవర్తిస్తే అరెస్టు చేస్తాం అని సిఎం హిమంత పేర్కొన్నారు. రాష్ట్రంలోని సున్నితమైన అంశాలపై రాజకీయం చేస్తే సహించే ప్రసక్తే లేదని అస్సాం ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేరళ, ముంబయి లేదా ఢిల్లీ ఎక్కడి నుంచి వచ్చినా కొన్ని వర్గాల వారి కార్యకలాపాలను ప్రోత్సహించే ప్రయత్నాలను ఉపేక్షించమన్నారు.

### నేడు రాధాకృష్ణన్ నామినేషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 :** ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాధాకృష్ణన్ నామినేషన్ పేపర్లపై ఎన్డీఎ పక్ష నేతలు సంతకాలు చేయనున్నారు. ఆయనకుమద్దతుగా 20 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఎన్నిక సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై మంగళవారం ఉదయం ఎన్డీయే పక్ష నేతలు సమావేశం కాగా, సాయంత్రం 4.30 గంటలకు మరోసారి సమావేశమయ్యారు.

**ప్రతిపక్షాల మద్దతు కోరిన మోడీ**

కాగా, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ప్రతిపక్షాలు మద్దతివ్వాలని ప్రధానమంత్రి మోదీ కోరారు. ఏకగ్రీవంగా ఆయననుఎన్నుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులోని బాలయోగి ఆడిటోరియం మంగళవారం ఉదయం ఎన్డీయే ఎంపీల సమావేశం జరిగింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ప్రధాని స్వయంగా ఎంపీలకు పరిచయం చేశారు. అనంతరం రాధాకృష్ణన్‌ను సన్మానించారు. కాగా, 20వ తేదీ ఉదయం 11 గంటలకు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని కిరణ్ రిజిజు చెప్పారు.

### అమెరికాలో మెలోనీ విడియో వైరల్..

**వాషింగ్టన్, ఆగస్టు 19:** భారత ప్రధాని నరేంద్రమోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీల పేర్లు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వీరిమధ్య ఎలాంటి భేటీ జరగలేదు. అయితే, అమెరికాలోని వైట్‌హౌస్‌లో సమావేశంకోసం వచ్చినఆమె.. అక్కడిఅధికారులను భారతీయ సంప్రదాయంలో నమస్తే అంటూ పలకరించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారగా.. మోడీ ఎఫెక్ట్ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. రష్యాతో యుద్ధం ముగించే అంశంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో భేటీఅయిన సంగతి తెలిసిందే. ఈ సమావేశానికి యూరోపియన్ నేతలు కూడా హాజరయ్యారు. అందులో ఇటలీ ప్రధాని మెలోనీకూడా ఉన్నారు. వైట్‌హౌస్‌కుచేరుకున్న ఆమెకు ట్రంప్ పరిపాలనాధికారులు స్వాగతం పలికారు. ముందుగా షేక్‌హ్యాండ్స్‌తో వారినిపలకరించిన మెలోనీ.. అనంతరం నమస్కారం చేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

20-8Pg6exHMNWJQE 10_20-8Pg6exHMNWJQE.qxd 8/20/2025 12:33 AM Page 1



## ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ దేశానికి ఆదర్శంగా ఉండాలి

### పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత్ భారత్ 2047లో ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ దేశానికి ఆదర్శంగా నిలవాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ఏపీకి కేంద్రం 935 పీఎంశ్రీ పాఠశాలలను కేటాయించిందని, ఇది శుభపరిణామమని పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047 సంకల్పంలో భాగంగా విజయవాడలో సోమవారం 'స్కూలింగ్-బిల్డింగ్ బ్లాక్స్' అనే అంశంపై రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా కోన శశిధర్ మాట్లాడుతూ 'అభివృద్ధి చెందిన ,సుసం పన్నమైన దేశంగా మార్చడమే వికసిత్ భారత్ సంకల్పం.ఈ లక్ష్య సాధనకు పాఠశాల,విద్య కీలకం. ఉపాధ్యాయులు, అధికారులు ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో భాధ్యతాయుతమైన సమిష్టి కృషి చేయాలి. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 125 పురపాలికల్లో అటిజం కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాం. త్వరలో మంగళగిరిలో ప్రారంభించనున్నాం. పునాది దశ నుంచే లిటరసీ,న్యూమరసీలో నైపుణ్యం సాధించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం'అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టర్లు విజయ రామరాజు, కృతిక శుక్లా,స్ఎస్ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎండిఎస్ తాజా నోటిఫికేషన్

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** నీట్-పీజీ(ఎండీఎస్) కటాఫ్ శాతాన్ని 19,863కి తగ్గించిన నేపథ్యంలో విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం కన్వీనర్,యాజమాన్య కోటా సీట్ల భర్తీకి తాజాగా సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కటాఫ్ తగ్గించిన తర్వాత అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 18 రాత్రి 7 గంటల నుంచి 21 వరకు రాత్రి 7 గంటల ల్లోగా కొత్తగా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలి. మాప్-అప్ రౌండ్ కౌన్సిలింగ్ అనంతరం కన్వీనర్ కోటాలో 15 సీట్లు, యాజమాన్య కోటాలో 96 సీట్లను విశ్వ విద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.కొత్తగా ధరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మార్గ నిర్ధేశకాల్లో సందేహాలుంటే 89787 80501 నంబరుకు,సాంకేతిక సమస్యలు తలెత్తితే 90007 80707 నంబరుకు ఫోన్ చేయచ్చని రిజిష్టార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

## వెంకటపాలెం వేంకటేశ్వర ఆలయంలో పవిత్రోత్సవాలు

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి: వెంకటపాలెం(అమరావతి)** శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో అంతర్భాగంగా ఉదయం యాగశాలలో పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ట, అధివాసం, సర్వదైవత్య హోమం చేపడుతారు. ఆగష్టు 20న ఉదయం పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమములు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణము, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఆగష్టు 21వ తేదీ బుధవారం ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమములు, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, ఋత్విక్కులకు బహుమానం, యాజమాన ఆశీర్వాచనం చేపడుతారు.

## వైఎస్సార్సీ ఎంపి మిథున్ రెడ్డి పై చంద్రబాబు తప్పుడు కేసులు బనాయించారు

### ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఆగస్టు 19 (ప్రభాతవార్త):** వైయస్ఆర్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పై సిఎం చంద్రబాబు నాయుడు అన్యాయంగా తప్పుడు కేసులు బనాయించి సెంట్రల్ జైల్లో పెట్టించారని ఉభయగోదావరి జిల్లాల వైఎస్ఆర్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్,ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో మిథున్ రెడ్డి తో ములాఖత్ అయ్యేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ఎంపీ మిథున్ రెడ్డి పై చంద్రబాబు నాయుడు అన్యాయంగా తప్పుడు కేసులు పెట్టినందుకు జైల్లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని కలిసేందుకు వచ్చానన్నారు.అధికార బలంతో ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా కోర్టులో వాటిని రుజువు చేయలేరని త్వరలోనే మిథున్ రెడ్డి నిర్దోషిగా బయటకు వస్తారని బొత్స అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన అధికార కూటమి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదన్నారు.

## సెప్టెంబర్ 5నుండి పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు

**తిరుచానూరు,ఆగస్టు19ప్రభాతవార్త:** తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 5వతేదీ శుక్రవారం నుండి 7వతేదీ ఆదివారం వరకు మూడురోజులు పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు సెప్టెంబర్ 2వతేదీ మంగళవారం సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతిఉత్సవం ,అంకురార్పణ చేపట్టనున్నారు. ఆలయంలో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలిసీతెలియక దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు మూడురోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సెప్టెంబర్ 5వతేదీ పవిత్రప్రతిష్ట, 6న పవిత్ర సమర్పణ, 7వతేదీ పూర్ణాహుతి కార్యక్రమాలు జరగనున్నాయి. 750 రూపాయలు చెల్లించి పవిత్రోత్సవాలు టిక్కెట్ పొందే గృహస్థభక్తులకు 2లడ్డూలు, 2వడలు బహుమానంగా అందజేస్తారు. ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 2న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, సెప్టెంబర్ 4న అంకురార్పణ సందర్భంగా అమ్మవారికి జరిగే తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, 5వతేదీ అభిషేకానంతరం దర్శనం, లక్ష్మీపూజ సేవలు రద్దుచేశారు. అలాగే సెప్టెంబర్ 5,6,7తేదీల్లో మూడురోజులు కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, వేద ఆశీర్వచనం, కుంకుమార్చన,ఊంజల్‌సేవలు టిటిడి రద్దుచేసింది.

## అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేసిన కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ, ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లా అధికారుల సమష్టి కృషితోనే ఎన్నో మెగా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించగలిగామని.. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఉత్తమ ఫలితాల సాధనకు సమర్థవంతమైన అధికారులు, సిబ్బంది పాత్ర కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాజధాని హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కలెక్టర్ లక్ష్మీశ. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన 376 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావడంలో భాగస్వాములు కావాలంటూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విజయవాడ నగరంలో గత ఏడాది కాలంలో ఎన్నో భారీ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని.. ఒకవైపు ఆయా శాఖల కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తూనే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషిచేశారని పేర్కొన్నారు. అవార్డులు అందుకున్న ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, కళాకారులు ఇలా ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఉందని.. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తుచేసుకోవాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. .అవార్డుల గ్రహీతలు:.. కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమం సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## రైల్వే వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్‌ల పని విధానంపై నిర్దిష్టమైన ఆదేశాలు!

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 19,ప్రభాతవార్త** రైల్వే వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు తమ విధి నిర్వహణలో భాగంగా బాధిత రైల్వే సిబ్బంది, కుటుంబాలను నిర్ణీత పని వేళలలో మాత్రమే సంప్రదించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ సిపిఓ ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు రాష్ట్రాలలోని కొన్ని రైల్వే డివిజన్‌లలో వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పిసిపిఓఈ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. రైల్వే ఉద్యోగి మృతి, నార్మల్ రిటైర్మెంట్, అధర్ ధాన్ నార్మల్ రిటైర్మెంట్,విఆర్ఎస్,మెడికల్ డీ-క్యాటగిరైజేషన్,మిస్సింగ్,రాజీనామా,కంపల్సరీ రిటైర్మెంట్ తదితర కారణాల వల్ల ఏర్పడిన సమస్యలను సదరు బీట్,సెక్షన్,యూనిట్ స్టాఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతలతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కారుణ్య నియామకాలు, సెకండరీ ఫ్యామిలీ పెన్షన్ తదితర కేసులను నిర్ణీత కాలవ్యవధిలోగా నివేదికలను సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించే పనిలో భాగంగా సమయం, సందర్భం లేకుండా ఎప్పుడుబడితే అప్పుడు బాధిత కుటుంబాలను విసిగించరాదని, రైల్వే ఉద్యోగి మృతిచెందితే ఆఫీసులకు తిప్పుకోకుండా సదరు ప్రాంత వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ బాధ్యత తీసుకుని రైల్వే శాఖ మానవతా దృక్పథంతో చెల్లిస్తున్న రూ.25వేల ఫెనరల్ అడ్వాన్స్‌ను బాధిత కుటుంబ సభ్యులకు అందచేయాల్సి ఉంటుంది. కొందరు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు ఫెనరల్ అడ్వాన్స్ మొత్తం ఇవ్వలేదు.

## జలాశయాల్లో నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలి : అదనపు ఇఒవెంకయ్య చౌదరి

**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:**తుఫాన్ ప్రబావంతో వరుసగా వర్షాలు కురుస్తున్నా తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలకు నీరుచేరకపోవడంతో ఉన్న నీటిని పొదుపుగా సద్వినియోగం చేసుకోవాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ప్రణాళికాబద్దంగా వినియోగించుకుంటే నిరంతర సరఫరా సాధ్యమవుతుందని సూచించారు. రానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ,తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటినిల్వలపై మంగళవారం సాయంత్రం గోకులం విశ్రాంతి భవనంలో అదనపు ఇఒ చౌదరి సమీక్షించారు. తిరుమల,తిరుపతిలోని అన్ని డ్యామ్‌లలో నీటిలభ్యత, వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. తిరుమలలోని డ్యాముల ధృఢత్వంపై సమగ్ర నివేదిక అందించాలని వాటర్‌వర్క్సు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఐదు జలాశయాల్లో నీటినిల్వలు డిసెంబర్ వరకు భక్తుల అవసరాలకు సరిపోతాయని,

రాబోయే కార్తీక మాసంలో వర్షపాతం ఆధారంగా భవిష్యత్ అవసరాలకు సరిపడే విధంగా నీటిని వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆయన చెప్పారు.

## ప్రభుత్వ వైద్యశాలలో తమకు రక్షణ లేదంటూ నర్సింగ్ సిబ్బంది పోరుబాట




**నెల్లూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మేల్ నర్సు వెంకటయ్య మరో మేల్‌నర్స్ కళ్యాణ్ కుమార్‌పై పీజీలు, హౌస్ సర్జన్ల దాడి ఘటనపై జీజీహెచ్‌లోని నర్సింగ్ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు మేల్ నర్సులపై దాడికి పాల్పడ్డ ట్రైనీ వైద్యులను శిక్షించాలంటూ జీజీహెచ్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింగ్ సిబ్బంది, హెడ్ నర్సులు మాధురి, శాంతి, వరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ పీజీలు, హౌస్ సర్జన్లు మేల్ నర్సు వెంకటయ్యను, మరో మేల్ నర్స్ కళ్యాణ్ కుమార్‌ను విచోణ రహితంగా కొట్టడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలతో ఆసుపత్రిలో ప్రశాంత వాతావరణం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులు జరుగుతున్నా దీనిపై పర్యవేక్షణ లేదని, ఈ ఘటనలతో తమకు అభద్రతా భావం ఏర్పడుతుందని వెల్లడించారు. జరిగిన దాడి ఘటనపై ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్లో కంప్లైంట్ చేశామని, అయితే సోమవారం సాయంత్రం జరిఇన దాడి పై ఫిర్యాదు చేస్తే ఇంత వరకు చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఇదేమని సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ మాధవి ని వివరణ కోరగా కేసు పెడితే జైలుకెళ్తారు. ఏమవుతుంది అని వివరణ ఇచ్చారని, ఆమె బాధితుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారో ఈ విషయం తేట తెల్లం చేస్తుందన్నారు.

## ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ ఆపాలి

### - ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ విజ్ఞప్తి

**తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 19 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఏబీసీ వర్గీకరణ అమల్లోకి వచ్చే వరకు ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ ఆపాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీఎంఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.స్థానిక డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మంగళవారం అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి దండు వీరయ్య మాదిగ హాజరై మాట్లాడారు. ఏపీలో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ కోసం మాదిగ ఉప కులాలు 31 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేపట్టడం జరిగిందన్నారు. 2000లో అమల్లోకి వచ్చిన వర్గీకరణ 2004 నవంబరున సుప్రీంకోర్టు తీర్పుతో రద్దయిందన్నారు.

## సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసేవారిపై చర్యలకు ప్రత్యేక చట్టం

### - హోంమంత్రి వంగలపూడి అనిత




**సచివాలయం,ఆగస్టు 19,ప్రభాత వార్త:** సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురిచేసే వారిపై ఇకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురానున్నట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే గాక అభద్రతా బావానికి గురి చేస్తున్నారని ఇకపై అలాంటి దుష్ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ విజయవంతంగా అమలుచేయడంతో ప్రతిపక్ష పార్టీ తట్టుకోలేక పోతుందని అందుకే సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని చేస్తుందని హోంమంత్రి అనిత విమర్శించారు.ఒక్క ఆగష్టు లోనే తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ,నేతన్నలకు నాయీబ్రాహ్మణులకు 200వరకు ఉచిత విద్యుత్ స్త్రీశక్తి పథకం కింద మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు.శ్రీకాంత్ అనే వ్యక్తి పెరోల్ రద్దు చేశాం ప్రస్తుత ం జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు మంత్రి అనిత పెరోల్ రావడం వెనుక ఏముంది ఎవరున్నారనే దానిపై పూర్తిగా విచారణ జరుపుతున్నాయని ఈ సంఘటనలో ఎవరున్నా వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత స్పష్టంచేవారు.శ్రీకాంత్ విషయంలో ఎస్కార్ట్ సిబ్బందిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు .క్రిమినల్ రికార్డు ఉన్న వ్యక్తికి పెరోల్ వచ్చిందని జైలు అధికారిచెప్పారని వెంటనే అతని పెరోల్ రద్దుచేసి తిరిగి జైలుకు పంపామన్నారు.ఈ ఘటనలో పోలీస్ అధికారులు ఎవరున్నా వారిపై కూడా విచారణ అనంతరం తగినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అరుణ అనే మహిళ దిశా ఫౌండేషన్‌కు సెల్ఫ్ డిక్లేర్డ్ సెక్రటరీ అని ఆమె నుంచి హోమ్‌శాఖ పేషీకి ఫోన్ వచ్చిందని దానిపై కూడా దర్యాప్తు చేస్తున్నామని ఆమె గురించి ఆమె వెనుకున్న వారి గురించి ఆరా తీస్తున్నా అని తెలిపారు.

## భవన నిర్మాణ కార్మికులకు మొండి చెయ్యి చూపిన కూటమి ప్రభుత్వం

### - ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ

– విజయవాడలో ఇఫ్టూ బిసి డబ్ల్యూయు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర స్థాయి ధర్నా

విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి: భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాకా కూటమి ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందనిఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఇఫ్టూ బిసి డబ్ల్యూయు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా మంగళవారం ధర్నా చౌక్ లో నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఇప్పుడూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 35 లక్షల కుటుంబాలు 36 రకాల వృత్తులలో భవననిర్మాణ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. నిత్యం ప్రమాదాలు అంచున పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుల భద్రత కోసం అనేక సంవత్సరాలు గా ఎన్నో ప్రభుత్వాలపై సుదీర్ఘంగా పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ఈరోజు న కార్మికులకు అందుబాటులో లేదు. 1996 కేంద్ర చట్టాన్ని అనుసరించి తయారుచేసిన ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 2007 అమలు చేసిన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసారు. సంక్షేమ బోర్డు నుండి దేశంలో భవన నిర్మాణ కార్మికులకు అనేక రాష్ట్రాలలో అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం 6 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డు వల్ల కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేకుండా సంక్షేమ బోర్డును నిరుపయోగంగా తయారు చేసిన పాలకవర్గాలు ప్రమాదాల బారిన పడ్డ కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి నష్ట పరిహారాలు ఇవ్వాలి అంటే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుండి రూపాయి తీయ్య నవసరం లేదు. భవన నిర్మాణ కార్మికులు పనిచేసే నిర్మాణాలు పది లక్షల దాటితే ఆ నిర్మాణాల వద్ద నుండి 1 సెక్స్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు కార్మిక శాఖ వసూలు చేసిన జమ చేస్తుంది. అలా జమ అయిన డబ్బులు కార్మికుల సంక్షేమాన్ని కి ఖర్చు పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వాలు వాటి ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయి.

## బిజెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా నాలి మధుసూదన్

**గూడూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త** భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షునిగా తిరుపతి జిల్లా గూడూరు పట్టణానికి చెందిన నాలి మధుసూదన్‌ను భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షులు శాంత్ ప్రకాశ్ జాతవ్ సూచన మేరకు ప్రధాన కార్యదర్శి ఏ డి వి రక్ష పాల్ సింగ్ నియమించారు. మధుసూదన్ విశ్వహిందూ పరిషత్ బాధ్యలగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసేవారు. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ పనిచేస్తోంది. ఈ క్రమంలో నాలి మధుసూదన్‌ను బిజెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం పట్ల పట్టణంలో పలు కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ తనను రాష్ట్ర అధ్యక్షునిగా నియమించేందుకు తోడ్పాటు అందించిన ఎన్డీఏ కూటమి ఎన్ సి పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు సూచనల మేరకు ప్రకటించిన భారతీయ మజ్దూర్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు బీజేఎంఎస్ నాయకులకు, కార్యకర్తలకు కార్మిక సంఘ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అనంతపురం జిల్లాలో 9601పిహెచ్ ఫించన్లు తొలగింపు

### రెండు రోజుల క్రితమే నోటీసులు జారీ - అప్పీలు అవకాశం కల్పించిన ప్రభుత్వం



**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త** బోగస్ ఫించన్లు ఏరివేతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 40 శాతం కంటే వికలాంగ శాతం తక్కువగా ఉండటంతో వికలాంగులకు సంబంధించి జిల్లాలో 9601 ఫించన్లు తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ఫించన్ దారులకు నోటీసులు జారీ చేసింది. అందులో అర్హులుంటే ఆయా మండల ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు అప్పీలు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అనంతపురం జిల్లాలో వివిధ క్యాటగిరిలకు సంబంధించి 2,83,219 ఫించన్లు ఉన్నాయి. ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీ రూ.125.960 కోట్లు ఫించన్లు రూపంలో పంపిణీ చేస్తుంది. అయితే గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా ఫించన్లు మంజూరు చేశారని కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా బోగస్ ఫించన్లు ఏరివేతకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మొదట విడతలో వికలాంగుల ఫించన్ల పరిశీలన ప్రక్రియను ప్రారంభించింది. 40 శాతం వికలాంగ శాతం తక్కువగా ఉన్న 9601 ఫించన్లు జిల్లాలో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి వారందరికి ఈనెల 14న నోటీసులు జారీ చేసింది. అందులో హెల్త్ ఫించన్స్ 326,డిజెబుల్ ఫించన్స్ 9275 మొత్తం 9601 ఫించన్లు బోగస్ ఉన్నాయి. వికలాంగుల ఫించన్లు తొలగిస్తున్నట్లు ప్రభుత్వం నుండి నోటీసులు అందుకున్న ఫించన్‌దారులకు ప్రభుత్వం మరొక అవకాశం కల్పించింది. పాత సదరం సర్టిఫికెట్ జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్, పెన్షన్ కోల్పోయిన నోటీస్, బియ్యం కార్డు జిరాక్స్‌తో సహా అప్పీలు దరఖాస్తులను ఆయా మండల ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలి. ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు ఫలాన రోజు ఫలాన ఆసుపత్రికి వెళ్లి చెకప్ చేసుకోవాలని మరలా ఫించన్‌దారులకు నోటీసులు అందజేస్తారు. ఆ నోటీసు ప్రకారంగా డాక్టర్లు చెకప్ చేసిన తర్వాత ఫించన్‌కు అర్హత ఉందని గుర్తించి సర్టిఫికెట్ ఇస్తే ఆ సర్టిఫికెట్‌ను ఎంపీడీవో, కమిషన్లకు అందజేస్తే ఫించన్‌ను పునరుద్ధరణ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే ఆ విధంగా తొలగించిన వికలాంగుల ఫించన్లలో ఎంత మంది అర్హత సాధిస్తారో అన్నది వేచి చూడాల్సిందే. అనంతపురం జిల్లాలో వికలాంగులకు సంబంధించి 9601 ఫించన్లు తొలగిస్తూ రెండు రోజులు క్రితం నోటీసులు ఇవ్వడం జరిగింది. అలా నోటీసులు అందుకున్న ఫించన్‌దారులు సంబంధిత పత్రాలతో ఆయా మండల ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు అప్పీలు చేసుకోనే అవకాశం వుంది. అలా అప్పీలు చేసుకున్న వారికి ఒక నోటీసు ఇచ్చి ఆసుపత్రిలో డాక్టర్‌తో చెకప్ చేయిస్తాం. డాక్టర్ ఇచ్చే

## దుర్గమ్మ ఆలయంలో వైద్యశాల ఆకస్మిక తనిఖీ



దాతలకు దుర్గమ్మ వారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 19, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులకందిస్తున్న వైద్య సౌకర్యాలను మంగళవారం క్షేత్రస్థాయిలో అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్ రంగారావు ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. ఆయనకు మెడికల్ ప్రాక్టీషనర్ కనకరావు, నర్సింగ్ సిబ్బంది తమ కార్యకలాపాలను వివరించారు. భక్తులకు సేవల ందిస్తున్న సేవలు వివరిం చారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,008ల విరాళాన్ని విజయవాడకు చెందిన కడియాల శాంతి సుభాష్ మంగళవారం ఇఒ వికె శీనా నాయక్‌కు అందించారు. అలాగే విజయవాడకు చెందిన రు.1,00,116ల విరాళాన్ని కొల్లి కృష్ణమోహన్‌రెడ్డి, తమ తండ్రి కొల్లి వీర వెంకట శివప్రసాద్ పేరిట అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ వారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

## అనంతపురం ఎమ్మెల్యే ఆడియోపై భగ్గు మన్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు - పలుచోట్ల నిరసనలు

**అనంతపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త బ్యూరో** సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 సినిమా రిలీజ్ సందర్భంగా ఇటీవల అనంతపురం ఎమ్మెల్యే ఒక వ్యక్తితో బూతులు తిట్టిన ఆడియో వైరల్ ఆయన నేపథ్యంలో అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు, చిత్తూరు , తదితర జిల్లాలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసనలకు దిగుతున్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ ఈ విషయంలో జూనియర్ ఎన్టీఆర్ కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అనంతపురం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసన వ్యక్తం చేయడంతో పాటు పలుచోట్ల కూడా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారు.. జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 సినిమాను అనంతపురంలో ఆడించే ప్రశ్నలేదని అంటూ జూనియర్ ఎన్టీఆర్ ను ఒక వ్యక్తితో తిట్టిన ఆడియో వైరల్ అయింది..ఆ ఆడియో నాది కాదు ఎవరో కావాలని నాపై కుట్రపడి ఇలా చేశారని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఒక వీడియో సందేశం ద్వారా స్పష్టం చేశారు.. అయినప్పటికీ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు తమ నిరసనను కొనసాగిస్తూనే ఉన్నారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ తో పాటు రాష్ట్రంలో మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై దర్యాప్ చేసి ఇవ్వాలని పార్టీ ముఖ్యులను ఆదేశించారు. సీఎం ఎలాంటి చర్యలు తీసుకుంటాడు అన్నది పార్టీ కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత దూషణలు ఏంటి అని జూనియర్ ఎన్టీఆర్ ఆక్రోషం.

## తాడిపత్రి అరాచకాలపై సిట్‌తో విచారణ జరిపించాలి

### - తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి డిమాండ్

**అనంతపురం, ఆగస్టు 19 ప్రభాతవార్తబ్యూరో** అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఉన్నారా లేదా..? తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ అరాచకాలు చేస్తున్నారని, పోలీసులను అడ్డం పెట్టుకొని వైసిపి నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వైసిపి నేత, తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. తాడిపత్రిలో జరుగుతున్న అరాచకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిట్ వేసి విచారం జరిపించాలని, సిట్‌తో విచారం జరిపిస్తే నేను తప్పులు చేశానో జేసీ ప్రభాకర్ రెడ్డి తప్పులు చేశారో తేలుతుందని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ..నేను వెదవలతో రాజకీయాలు చేయదలుచుకోలేదని.. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో జేసీ ప్రభాకర్ రెడ్డి లాంటి వారితో రాజకీయాలు చేయాల్సి వస్తోందన్నారు. నేను తాడిపత్రికి ఎక్కడ వస్తానో అని.. జెసి నిద్రలో కూడా కలవరించుకుంటున్నాడని ఆయన జోష్యం చెప్పారు. హైకోర్టు ఒక ఆర్డర్ ఇస్తే దానిని అమలు చేయకుండా.. నన్ను ఆపేందుకు 700 మంది పోలీసులను తాడిపత్రిలో పెడుతున్నారంటే పోలీసులు వ్యవస్థ ఏ విధంగా పనిచేస్తుందో అర్థమవుతోందన్నారు. రోజురోజుకీ పోలీసుల మీద ప్రజలకు నమ్మకం పోతుందని అని పెద్దారెడ్డి అభిప్రాయపడ్డారు. నేను ఇంటి నుంచి బయలుదేరగానే జెసి ప్రభాకర్ రెడ్డి తన ప్రైవేట్ సైన్యానికి, అనుచరులను ఇంటి వద్దకు రావాలంటూ మెసేజ్‌లు పెడుతున్నారన్నారు. పైగా తనను ప్రజలు అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



మంగళవారం కడెం ప్రాజెక్టును సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

# వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్,ఆగస్టు19, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టును ఉమ్మడి జిల్లా ఇంఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటి ఇన్‌ఫ్లో,అవుట్‌ఫ్లోపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఇప్పటికే 9 కోట్ల రూపాయల నిధులతో మరమ్మతు పనులు పూర్తిచేశామన్నారు.వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ వరదల కారణంగా పంట పొలాలు,నివాస గృహాలు,రహదారులు నష్టపోయాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన అనంతరం సంబంధిత శాఖలు సర్వే చేసి,నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాయని, అనంతరం బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.వరద నీటిలో కొట్టుకుపోయిన ఒక మత్స్యకారుని కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయని,ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి అన్నారు.కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టి,స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సమాచారం అందించాలని,అవసరమైన సహాయచర్యలు వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వాగులు,నదులు,ప్రాజెక్టుల్లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకిషర్మిల, ఎమ్మెల్యే దండేవిట్టల్,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్,ఆర్డీఓ రత్నా కళ్యాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ

## ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**సికింద్రాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రధాన అస్పత్రులను కార్పరేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్యం అందించే ఆస్పత్రులుగా తయారు చేయనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు జరుపుతున్నట్లు వివరించారు. మంత్రి గాంధీ ఆస్పత్రిని సందర్శించి పేషెంట్లు, అటెండెంట్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆస్పత్రిలో డ్రైనేజ్ సమస్య, ఎలక్ట్రిసిటీ, ఫైర్ సర్వీసులు, నర్సింగ్ విభాగంలో కొరతలు ఉన్నాయని గుర్తించామని తెలిపారు. మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు అన్నీ ఒకే ఫ్లోర్లో ఉండాలనే అభిప్రాయాలు కూడా వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆస్పత్రుల సంఖ్య పెరిగినా, పరికరాలు సరిపోవడం లేదని, క్రిటికల్ కేసుల్లో స్టాఫ్ కొరత ఎక్కువగా ఉన్నందున దీనిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. పేషెంట్ అటెండెంట్ల కోసం ప్రత్యేకంగా అకామిడేషన్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని, సీఎస్ఆర్ కింద శాశ్వత నిర్మాణం చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గాంధీ ఆస్పత్రిలో రెండు వేలకుపైగా బెడ్స్ ఉన్నందున వాటికి తగిన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. పాత పరికరాలను తొలగించి, కొత్త పరికరాలతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఐవీఎఫ్ సెంటర్లలో నిబంధనలు అతిక్రమిస్తున్న కొన్ని క్లినిక్లపై చర్యలు ప్రారంభమయ్యాయని, కొన్నిటిని ఇప్పటికే మూసివేశామని వెల్లడించారు. అలాగే పెట్లబురుజు, కొండాపూర్లో కొత్త ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాట్లు జరుగుతున్నాయని ఇప్పటికే కొన్ని చోట్ల పాజిటివ్ ఫలితాలు వచ్చాయని వివరించారు. హాస్టల్ నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని, పరికరాల నిర్వహణ, స్టాఫ్ నియామకాలు వంటి అంశాలపై త్వరలోనే పూర్తి స్థాయి నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఈ సమస్యలను సీరియస్‌గా తీసుకుంటోంది త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు.

# నేటి నుంచి ఐ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

## 28 వరకు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి

## సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు

సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 19:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 20నుంచి 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# కేన్సర్ రహిత తెలంగాణగా ప్రభుత్వ ప్రయత్నం

## కేన్సర్ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయులుతో మంత్రి దామోదర సమావేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 19:** తెలంగాణ రాష్ట్రాన్ని క్యాన్సర్ రహిత రాష్ట్రంగా చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ సలహాదారులు నోరి దత్తాత్రేయులుతో మంత్రి మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో నోరి దత్తాత్రేయులు రాష్ట్రంలో క్యాన్సర్ నిర్మూలనపై రూపొందించిన పలు అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఐసిఎంఆర్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2025 సంవత్సరానికి 55 వేల కేసులు నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ రహిత తెలంగాణగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన పలు అంశాలను మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించారు. రాష్ట్రంలో ఎయే ప్రాంతంలో క్యాన్సర్ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయో వైద్య శాఖ అధికారులు నోటిఫై చేయాలని మంత్రి ఆదేశించారు. క్యాన్సర్ బాధితుల డేటాను నమోదు చేసుకోవాలన్నారు. క్యాన్సర్ నివారణపై పరిశోధనలు నిర్వహించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్య సాయంను రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా సేవలను అందించడాన్ని స్వాగతించారు. 90 శాతం క్యాన్సర్ రోగాలను రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సేవలలో కవర్ అవుతున్నాయన్నారు. నిమ్స్, ఎంఎన్‌జె క్యాన్సర్ అసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలున్నాయన్నారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించేందుకు అన్ని జిల్లా ప్రభుత్వ అసుపత్రులలో క్యాన్సర్ లక్షణాలున్న వారిని గుర్తించిన వారికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాలని సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ లో పాజిటివ్ వచ్చిన బాధితులను గుర్తించి వారిని సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే అసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ అసుపత్రులలో క్యాన్సర్ బాధితుల కోసం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. నిమ్స్‌లో క్యాన్సర్ చికిత్సలను అందిస్తున్న సమాచారం ప్రజలకు తెలిసేలా క్యాన్సర్ అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండేలా ప్రమోషన్ల కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. క్యాన్సర్ బాధితుల వైద్యం కోసం ప్రతి 100 కిలోమీటర్ల పరిధిలో చికిత్స అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ క్యాన్సర్ బాధితులకు అందిస్తున్న పలు సేవలను మంత్రి దామోదర రాజనర్సింహ డాక్టర్ నోరి దత్తాత్రేయులకు వివరించారు. క్యాన్సర్‌పై అవగాహన కోసం వర్క్ షాపులను ప్రతి మెడికల్ కాలేజీలో నిర్వహించాలని మంత్రి వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని రేగ్యూలర్‌గా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తించేందుకు వైద్యశాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# సిఆర్‌పిఎఫ్‌ను హడలెత్తిస్తున్న నకిలీ యాప్

## కీలక సమాచారం విద్రోహులకు చేరవేసేందుకు సైబర్ నేరగాళ్ల కుట్ర

## జాగ్రత్తలు వహించాలని కేంద్ర హోం శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** కేంద్ర పారా మిలటరీ బలగాలలో అగ్రగామి అయిన సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని నకిలీ యాప్ హడలెత్తిస్తోంది. సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కోసం రూపొందించిన అసలు యాప్‌తో పోలివున్న ఈ నకిలీ యాప్ పేరు సంభవ్ అప్లికేషన్ రైటర్. ఈ యాప్ అసలు యాప్ ను పోలి వుండడంతో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది తమ రోజువారి కార్యకలాపాల నిర్వహణ సమయంలో కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నకిలీ యాప్‌ను సిఆర్‌పిఎఫ్ సిబ్బంది ఎవరైనా వాడేందుకు ప్రయత్నిస్తే వ్యక్తిగత సమాచారం అడుగుతోందని, దీనివల్ల భద్రతాపరమైన అంశాలు విద్రోహులకు చేరే వీలుందని సిఆర్‌పిఎఫ్ ఐటి విభాగం చెబుతోంది. కాగా ఈ నకిలీ యాప్ వాట్సాప్, యూట్యూబ్ వేదికలపై ప్రచారం అవుతుందని, దీనినే అధికారిక వెబ్‌సైట్‌గా నమ్మిస్తోందని సిఆర్‌పిఎఫ్ ఐటి విభాగం చెబుతోంది. సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కొన్నేళ్లుగా నక్సల్స్ ఆపరేషన్లలో పాల్గొంటుండడంతో పాటు విమానాశ్రయాలు, జాతీయ సంస్థలు, ప్రముఖుల భద్రత పర్యవేక్షిస్తున్నాయి. ఈ క్రమంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది రోజువారి అవసరాలకు అధికారిక వెబ్‌సైట్ సంభవ్ యాప్ ఎంతగానో దోహదం చేస్తోంది. కాగా అసలు యాప్‌ను రోజువారి కార్యకలాపాలకు వాడే సమయం లో సిఆర్‌పిఎఫ్ సిబ్బందికి వున్నట్లుండి కొన్నిసార్లు నకిలీ యాప్ ప్రత్యక్షమవుతోందని, దీనిని ఉపయోగించాలంటే సంబంధిత అధికారి లేదా సిబ్బంది వ్యక్తిగత ఐడితో పాటు ఏ యూనిట్‌లో పనిచేస్తున్నారనే వివరాలు కోరుతోందని, ఇతర సున్నితమైన వివరాలు అడుగుతోందని సిఆర్‌పిఎఫ్ ఐటి విభాగం చెబుతోంది. వాస్తవానికి ఇవన్నీ దేశ భద్రతకు సంబంధించిన కీలక అంశాలు కాగా వీటిని కొందరు సైబర్ నేరగాళ్లు దొంగిలించి విద్రోహుల కు అమ్మేందుకు యత్నిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అనుమానిస్తోంది. సిఆర్‌పిఎఫ్ విభాగం కోసం సిఆర్‌పిఎఫ్ సంభవ్ యాప్ వుండగా సైబర్ నేర గాళ్లు సంభవ్ అప్లికేషన్ రైటర్ పేరిట నకిలీ యాప్‌ను వాడుకలో తెచ్చారు. ఈ నకిలీ యాప్ కూడా సిఆర్‌పిఎఫ్ అధికారిక యాప్‌లోని అనేక అంశాలను చూపుతోందని హోంశాఖ పరిశీలనలో వెల్లడయ్యింది. నకిలీ యాప్ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర హోం శాఖ దీనిని వెంటనే గూగుల్ ప్లే స్టోర్ వంటి ప్లాట్ ఫామ్‌ల నుంచి తొలగించాలని సైబర్ భద్రతా సంస్థలను కోరింది. ఇదే సమయంలో సిఆర్‌పిఎఫ్‌కు సంబంధించిన అన్ని యూనిట్ల అధికారులకు నకిలీ యాప్ విషయంలో జాగ్రత్తలు వహించాలని ఆదేశించింది. తమ తమ యూనిట్లలోని అందరు అధికారులు, సిబ్బందికి నకిలీ యాప్ విషయంలో జాగ్రత్తలు వివరించి వాటిని పాటించేలా చూడాలని కేంద్ర హోం శాఖ కోరింది. నకిలీ యాప్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరూ డౌన్ లోడ్ చేసుకోవద్దని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి ఎలాంటి సమాచారం వెల్లడించవద్దని కేంద్రం ఆదేశించింది.

# సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు తెలంగాణ ఉద్యోగుల జెఎసి మద్దతు

**హైదరాబాద్,ఆగస్టు19,ప్రభాతవార్త:** సి.పి.ఎస్ విధానం రద్దుచేయాలని కోరుతూ తెలంగాణ సి.పి.ఎస్ ఉద్యోగుల సంఘం టిజిసిపిఎస్ఈయు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని గినిరితిది చైర్మన్ వి లచ్చి రెడ్డి తెలిపారు.భద్రత లేని సి.పి.ఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ దశాబ్దకాలంగా పోరాటం చేస్తున్న 2 లక్షల పై చిలుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులసంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచొరవ తీసుకుని సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుదనదరించాలని విజ్ఞప్తిచేశారు. పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కాంగ్రెస్‌ను అబాసుపాలు చేయడానికి కుట్ర

## రాష్ట్రానికి వెంటనే యూరియా కోటా విడుదల చేయాలి

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 19, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అబాసు పాలు చేయాలని బిజెపి,బిఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. బిజెపి,బిఆర్ఎస్ లోపాయికార ఒప్పందంతోనే యూరియాను అడ్డుకుంటున్నారని ప్రజా స్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదు అని ఆయన ఆవేదన చెందారు.తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను తక్షణమే కేంద్రం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మీద అక్కసుతో నే రాష్ట్రానికి రావాల్సిన వాటాను ఇవ్వట్లేదని అన్నారు. యూరియా కోసం ఇక్కడ రైతులు ఆందోళన చేస్తుంటే కిషన్ రెడ్డి ఢిల్లీలో పడుకుండని ఎద్దేవా చేశారు.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖ రాశారని గుర్తుచేశారు.

# గోబ్యాక్ నినాదాలతో అభివృద్ధి కుంటుపడుతోంది

## మాజీ పిసిసి చీఫ్ మాజీ ఎంపి హనుమంతరావు

**హైదరాబాద్,ఆగస్టు 19,ప్రభాతవార్త:** మార్వాడీ గో బ్యాక్ ఎక్కడి నినాదం ఇలాంటి నినాదాలలో అభివృద్ధి కుంటుపడుతుందని మాజీ పిసిసి చీఫ్ మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ నిజాంకాలం నుంచి మార్వాడీలు ఇక్కడ వ్యాపారాలు చేస్తున్నారని వారిని వెనక్కిపోవాలని అనకూడదని హితవు చెప్పారు.రిలయన్స్, డీమార్ట్ లాంటి బడాకంపెనీలలో అన్ని వస్తువులు దొరుకుతున్నాయి, మరి వాళ్ళను ఎందుకు గోబ్యాక్ అనడంలేదని ప్రశ్నించారు. తరతరాలుగా మార్వాడీలు తెలంగాణలో ఉంటున్నారనీ మార్వా డీలను గో బ్యాక్ అనడం ఏంటి అని ఆయన ఆవేదన చెందారు.తెలంగాణ అభివృద్ధి జరుగు తుందని దీంతో ఇతరరాష్ట్రాల నుంచి చాలా మంది వస్తున్నారని ఆయన భాష్యం చెప్పారు. ఈ విధమైన నినాదాలతో అభివృద్ధి కుంటుపడుతుంది. రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే తప్పకుండా ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచి వేయాలని సూచించారు. ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు.

# యూజీ కోర్సుల కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థులకు ప్రవేశ ధ్రువపత్రం అందజేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్,డా.శరత్ చంద్ర,తదితరులు

**అత్తాపూర్ ఆగస్టు19,ప్రభాతవార్త :** 2025-26 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మాణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని వివిధ యూజీ కోర్సులలో ప్రవేశాలకు మొదటి దశ కౌన్సిలింగ్ మంగళవారం ప్రారంభమైంది. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరుగుతున్న ఈ కౌన్సిలింగ్‌కు పీజెటీఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సీ హెచ్. విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు.తెలంగాణ ఈఏపీసెట్ 2025లో 221 ర్యాంకు సాధించిన పిడిశెట్టి వర్ణితకు రాజేంద్రనగర్ లోని వెటర్నరీ కళాశాలలో బివిఎస్‌సీలో ప్రవేశం కల్పిస్తూ వెటర్నరీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్రతో కలిసి ఆయన ధ్రువపత్రాన్ని అందజేశారు.262వ ర్యాంకు పొందిన రిగ్వేద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ప్రవేశంపొందాడు.అలాగే 273ర్యాంకర్ సత్యనారాయణరెడ్డి, 276 ర్యాంకర్ మధుమిత, 316 ర్యాంకర్ ఆర్. మధుమిత, 362 ర్యాంకు పొందిన ఎస్. హరిచందన వరుసగా రాజేంద్రనగర్ లోని వెటర్నరీ కళాశాల మరియు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశం పొందారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ తాము ఈ మూడు విశ్వవిద్యాల యాల్లోని కోర్సుల్లో చివరి సీటు నిండే వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ కోర్సులలో ఎంత కష్టపడి చదివితే అంత ఫలితం ఉంటుందని చెప్పారు. గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలలోనే చేరి మీ డిగ్రీలకు విలువను జోడించుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణలో కేవలం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మాత్రమే ఐసీఎఆర్ గుర్తింపు ఉందని తెలిపారు.

ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవి ద్యాలయాల అధికారులు డాక్టర్ ఈశ్వరి, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ రమణారావు, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ జయలక్ష్మితో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

# ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బిసిని ఎందుకు ప్రకటించలేదు?

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు





**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా కాంగ్రెస్‌పార్టీ బిసి వ్యక్తిని ఎందుకు ప్రకటించలేదని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మాట్లాడారు. ఇండియా కూటమి నేతల సమావేశంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి, తెలంగాణకు చెందిన రిటైర్డ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును అభ్యర్థిగా ప్రకటించారు. ఏ రాజకీయ పార్టీకైనా, ఏ కూటమికైనా వారి ఇష్టానుసారం అభ్యర్థిని ప్రకటించుకోవచ్చు కానీ దీనిపై ఎవరికి అభ్యంతరం లేదు. అయితే, కాంగ్రెస్ పార్టీ చెప్పేది వేరు, చేసేది వేరుగా ఉందన్నారు. ఆచరణలో చెప్పింది కనిపించడం లేదు. సమతుల్యత ఏమీ పాటించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ రాజకీయాలు, రాహుల్ గాంధీ రాజకీయాలు, ప్రత్యేకంగా కాంగ్రెస్ రాజకీయాలు తెలంగాణ చుట్టే తిరుగుతున్నాయని, నిత్యం కాంగ్రెస్ పార్టీ బిసి జపమే చేస్తుంది. కానీ అభ్యర్థుల ఎంపికలో మాత్రం ఈ రాష్ట్రంలో గాని, దేశంలో గాని ఒక్క ఓబిసి అభ్యర్థి కూడా దొరకకపోవడం కాంగ్రెస్ పార్టీ దుస్థితిని బయటపెట్టిందన్నారు. రాహుల్ గాంధీ తానే ఓబిసిల ఉద్ధారకుడని చెప్పుకుంటున్నాడు. ఆయన తర్వాత రేవంత్ రెడ్డి తెలంగాణనే రోల్ మోడల్ అంటున్నాడు. కానీ వీరి మాటలు, మాయమాటలే తప్ప ఆచరణలో ఏదీ జరగడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, నిజానికి బిసి వ్యతిరేక ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా కనీసం ఒక బిసి అభ్యర్థిని కూడా రెఫర్ చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ పార్టీ పడిందన్నారు.

# బాలసదనాల్లో పెద్దఎత్తున ఖాళీలు

## పలు కేటగిరిల్లో 267 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తింపు

## భర్తీకి ప్రతిపాదనలు రూపొందిస్తున్న మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు

**హైదరాబాద్,ఆగస్టు18 ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటైన బాలసదనాలు,జిల్లా స్థాయి శిశు సంరక్షణ యూనిట్లలో పలు కేటగిరీల్లో 267 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి.నవజాత శిశువు మొదలు ఆదేళ్లలోపు ఉన్న చిన్నారుల సంరక్షణలో ఈ గృహాలు కీలక పాత్ర పోషిస్తాయి.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 17 శిశుగృహాలు,బాలసదనాలున్నాయి.వీటితో పాటు రాష్ట్రమహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ కమిషనరేట్ పరిధిలో శిశువిహార్‌ఉంది.మంజూరైన పోసుల్లో దాదాపు 60 శాతానికి పైబడి ఖాళీగా ఉన్నట్లు సమాచారం. పారామెడి ఈ గృహాల్లో మొత్తం 32 మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 8 మంది మాత్రమే కొనసాగుతున్నారు.నర్సుల కేటగిరిలో 70 శాతం మేర పోస్టులు ఖాళీగా ఉన్నాయి.ఇవి కాకుండా సూపరింటెండెంట్, మ్యాట్రిన్స్,నైట్ వాచ్‌మెన్ పోస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి.రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా స్థాయి శిశు కేంద్రాల్లో చాలా కేటగిరీల్లో వేకెన్సీ ఉంది.శిశు గృహాల్లో మొత్తం 267 పోస్టులు ఖాళీగా ఉండగా జిల్లా స్థాయి శిశు సంరక్షణ కేంద్రాల్లో 67 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు గణాంకాలు వెల్లడించారు.వీటి భర్తీకి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# కేంద్రమంత్రి నడ్డాను కలిసిన గువ్వల బాలరాజు

**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** బిజెపి జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవలే మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు బిజెపిలో చేరిన సంగతి తెలిసిందే. ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు పార్లమెంటరీ బోర్డు సభ్యులు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్‌సైతం నడ్డాను మర్యాదపూర్వకంగా కలిసారు.

# ఎస్సీ గురుకులాలను ఆకస్మిక తనిఖీ చేసిన అలగు వర్షిణి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 19:** రాష్ట్రంలోని పలు ఎస్సి గురుకుల విద్యాసంస్థలను సొసైటీ కార్యదర్శి, ఎస్సి సంక్షేమ శాఖ కమిషనర్ అలగు వర్షిణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిగి, కొడంగల్, మద్దూరు, శంకర్‌పల్లి ప్రాంతాల్లోని గురుకులాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తనిఖీల్లో స్పెషల్ ఆఫీసర్ వెంకట రెడ్డి, జాయింట్ సెక్రటరీ (అకడమిక్) సక్రూ నాయక్, డిప్యూటీ సెక్రెటరీ రజినీ, ఇంజనీర్లు పాల్గొన్నారు. పరిగి గర్ల్స్ జూనియర్ కాలేజీని సందర్శించి అక్కడ విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం, వసతి, బోధన విధానాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ మెనూ పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. రోజువారీగా అందిస్తున్న భోజనం రుచి, నాణ్యతపై ఎలాంటి సమస్యలూ లేవని విద్యార్థులు తెలిపారు. అంతేకాకుండా మైక్రో షెడ్యూల్ ( పాఠ్య ప్రణాళిక )వల్ల పోటీ పరీక్షలకు మరింత సమగ్రంగా సిద్ధమయ్యే అవకాశం కలుగుతోందని తమ ఆనందాన్ని సెక్రటరీతో పంచుకున్నారు. కొడంగల్ బాయ్స్ జూనియర్ కాలేజీని సందర్శించారు.కొడంగల్‌లో విద్యార్థుల క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని కార్యదర్శి ప్రకటించారు. శంకర్‌పల్లి (గౌలిదొడ్డి విస్తరణ)లో నడుస్తున్న ప్రత్యేక కోచింగ్ సెంటర్‌ను కూడా సెక్రటరీ అలగు వర్షిణి పరిశీలించారు.

# భారత్ ఐటీ, టెలికం రంగాల పితామహుడు రాజీవ్ గాంధీ

## రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 19:** భారత ఐటీ, టెలికం రంగాల పితామహుడు మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా నివాళులు అర్పించారు. భారత్‌లోకి టెక్నాలజీని తీసుకొచ్చిన రాజీవ్ గాంధీని కంప్యూటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా అని పిలుస్తారని అన్నారు. 21వ శతాబ్దిలో దేశాన్ని కొత్త దిశగా నడిపించి దిశానిర్దేశం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్మరించుకున్నారు. ప్రపంచంతో ఇండియా పోటీపడేలా అడుగులు వేయించారని.

# ఎసిబి వలలో తహశీల్దార్, సర్వేయర్

## పాసుబుక్కులో జెండర్ మార్పుకు లంచం డిమాండ్

## రూ.50 వేలు తీసుకొని మరో లక్ష డిమాండ్‌తో పట్టుబడ్డ అధికారులు

**ఆమనగల్లు, ఆగస్టు19, ప్రభాతవార్త:** ఆమనగల్లు తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. గంటల తరబడిగా చేపట్టిన సోదా, విచారణలో అధికారులు తహశీల్దార్ చింతకింది లలిత, సర్వేయర్ కోటరవిలు అవినీతికి పాల్పడినట్లు రుజువు కావడంతో ఏసిబి అధికారులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు.బాధితుని ఫిర్యాదు మేరకు తెలంగాణ ఏసిబి రేంజ్ సిటి2 యూనిట్ అధికారులు ఆమనగల్లు తహశీల్దార్ కార్యాలయంపై దాడులు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన దాడులు మధ్యాహ్నం 4గంటల వరకు కొనసాగించారు. ఏసిబి అధికారి తెలిపిన వివరాల ప్రకారం భూమిపాసుపుస్తకంలో జెండర్ సవరణ కొరకు రెండు వారాల క్రితం ఒకవ్యక్తి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారని, అందుకు గాను తహశీల్దార్ సిహెచ్ లలిత రూ.50 వేలు లంచం డిమాండ్ చేయడంతో సదరు వ్యక్తి ధరణి ఆపరేటర్ ద్వారా ముట్టజెప్పినట్లు తెలిపారు. అట్టి పని పూర్తి కాకపోవడంతో బాధితుడు తిరిగి వారంరోజుల తరువాత కార్యాలయానికి వచ్చి జెండర్ మార్పు గురించి మరోసారి తహశీల్దార్‌ను అడిగినట్లు ఏసిబి అధికారి తెలిపారు. దీంతో తహశీల్దార్ మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సదరు వ్యక్తికి సూచించారన్నారు. బాధితుడు మీసేవలో ప్రయత్నించగా సర్వర్ సమస్య వస్తుందన్న విషయాన్ని తహశీల్దార్‌కు వివరించాడు. దీంతో



మీసేవతోపాటు జెండర్ ప్రక్రియ కూడా మేమే చేస్తామని చెప్పి తహశీల్దార్ లలిత, సర్వేయర్ కోటరవిలు కలిసి మరో లక్ష రూపాయాలు అదనంగా డిమాండ్ చేశారన్నారు. దీంతో బాధితుడు రెండు వారాల క్రితం ఏసిబి సిటి2 యూనిట్ అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించిన్నట్లు ఏసిబి అధికారి వివరించారు. దీంతో కేసు నమోదు చేసుకుని దాడులు చేసినట్లు ఆయన తెలిపారు.

విచారణలో తహశీల్దార్ లలిత 50వేలు లంచం తీసుకున్నట్లు, మరో లక్ష అదనంగా డిమాండ్ చేసినట్లు నిర్ధారించుకుని ఇరువురిని అరెస్టు చేసినట్లు ఏసిబి అధికారి వెల్లడించారు.

20-08pg10 12 ONG_20-08pg10.qxd 8/19/2025 10:38 PM Page 1



ఆట

# సింక్‌ఫీల్డ్ కప్ విజేతగా ప్రజ్ఞానంద



**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్, సింక్‌ఫీల్డ్ కప్-2025 విజేతగా భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు నిలిచాడు, ఈ విజయం ప్రజ్ఞానందను ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానానికి చేర్చింది. అంతేకాకుండా ప్రత్యక్ష రేటింగ్‌లో అమెరికన్ గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువానాను కూడా అధిగమించాడు. మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో మంగళవారం సింక్‌ఫీల్డ్ కప్ ప్రారంభ రౌండ్‌లో ప్రజ్ఞానంద ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజును ఓడించాడు. తెల్లటి పావులతో ఆడుతున్న ప్రజ్ఞానంద, గుకేష్‌పై ఆధిపత్యాన్ని సంపాదించి అతడిని ఓడించాడు. ఈ నేపథ్యంలో 36 కదలికలలో ప్రపంచ ఛాంపియన్ పదవి నుంచి రాజీనామా చేయవలసి వచ్చింది. ఆట ప్రారంభంలో గుకేష్ స్వల్ప పొరపాటు చేసి, అభివృద్ధిలో వెనుకబడ్డాడు. ప్రజ్ఞానంద ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. గుకేష్ పోరాటాన్ని ప్రదర్శించినప్పటికీ, సింక్‌ఫీల్డ్ కప్‌లో తన కెరీర్‌లో తొలి విజయం కోసం ప్రజ్ఞానంద ఆధిక్యాన్ని కోల్పోకుండా చూసుకున్నాడు. ఈ విజయం మూడు సంవత్సరాలలో క్లాసికల్ చెస్‌లో గుకేష్‌పై ప్రజ్ఞానంద సాధించిన తొలి విజయాన్ని కూడా సూచిస్తుంది. అతను చివరిసారిగా 2022లో గుకేష్‌ను ఓడించాడు. అంతేకాకుండా, ఈ విజయం ప్రజ్ఞానందను లైవ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ముందుకు తీసుకెళ్లింది. అతను ఇప్పుడు 2784 లి.జుని రేటింగ్‌తో ప్రపంచంలో 3వ స్థానంలో ఉన్నాడు, 2783.2తో మూడవ స్థానంలో ఉన్న ఫాబియానో కరువానాను అధిగమించాడు.

## ఆసియా కప్ కోసం టీమిండియా

# కెప్టెన్‌గా సూర్య

### గిల్‌కు వైస్, బుమ్రా, సంజుకు చోటు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ కోసం ఖరారు చేసిన 15 మంది సభ్యులతో కూడిన జట్టులో శుభ్‌మాన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, సంజు సామ్సన్‌లు ఎంపికయ్యారు. మంగళవారం మధ్యాహ్నం ప్రకటించిన ఈ జట్టుకు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం వహిస్తారు మరియు గిల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ లను నియమించబడిన స్పిన్నర్లుగా ప్రకటించారు. పేస్ అటాక్‌లో ముగ్గురు స్పెషలిస్ట్‌లు మాత్రమే ఉన్నారు. బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్-సీమ్-బౌలింగ్ ఎంపిక కాగా, హార్దిక్, శివమ్ చోటు దక్కించుకున్నారు. ఆసియా కప్ కోసం ఖరారు చేసిన టీమిండియా పూర్తి జట్టులో సూర్యకుమారన యాదవ్ (కెప్టెన్), శుభమన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), హర్షిత్ సింగ్ రాణా ఉండగా, ఐదు స్టాండ్ బైలుకు సంబంధించి ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ ఉన్నారు.

# వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్‌కు ప్లేస్ నిల్

### ఆల్‌రౌండర్లలో దక్కని స్థానం.. అఫ్గానిస్థాన్ ప్లేయర్లదే హవా



**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో ఆసియా ఆటగాళ్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ క్రికెట్‌లో ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌ను నిర్ణయించే ఐసీసీ తాజాగా వన్డే ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఈసారి ర్యాంకింగ్స్‌లో ఆసియా క్రికెటర్లు ఆధిపత్యం చెలాయించారు. ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్ళ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే, ఈ ర్యాంకింగ్స్‌లో ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే టాప్5లో ఒక్క భారత ఆటగాడికి కూడా చోటు దక్కలేదు.

ముఖ్యంగా, అఫ్గానిస్తాన్ క్రికెటర్లు అద్భుతమైన ప్రదర్శనతో టాప్ 2 స్థానాలను కైవసం చేసుకున్నారు. జింబాబ్వే, బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌కు చెందిన స్టార్ ఆటగాళ్లు కూడా టాప్ 5లో చోటు దక్కించుకున్నారు. ఈ తాజా ర్యాంకింగ్స్‌లో టాప్5లో అఫ్ఘనిస్తాన్ యువ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 296 రేటింగ్‌తో మొదటి స్థానంలో నిలిచాడు. 2025లో లాహోర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో అతను అద్భుత ప్రదర్శన చేసి, తన కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ సాధించాడు. అలాగే సీనియర్ ప్లేయర్, అఫ్ఘనిస్తాన్ మాజీ కెప్టెన్ మహ్మద్ నబీ 292 రేటింగ్‌తో రెండో స్థానంలో ఉన్నారు. నబీ చాలా కాలంగా అఫ్ఘన్ జట్టుకు వెన్నెముకగా నిలిచారు.

2017లో గ్రేటర్ నోయిడాలో ఐర్లాండ్‌పై అతను తన కెరీర్ బెస్ట్ 350 రేటింగ్ సాధించారు. ఇక జింబాబ్వే స్టార్ ఆల్ రౌండర్ సికిందర్ రజా 290 రేటింగ్ పాయింట్‌లతో మూడో స్థానంలో ఉన్నారు. అతను తన జట్టు కోసం బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ నిలకడగా రాణిస్తున్నాడు. 2024లో పాకిస్తాన్‌పై అతను 299 రేటింగ్ సాధించారు. బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ మెహదీ హసన్ మిరాజ్ 249 రేటింగ్‌తో నాలుగో స్థానంలో ఉన్నారు. 2022లో మీర్‌పూర్‌లో భారత్‌పై అతను కెరీర్ బెస్ట్ 295 రేటింగ్ సాధించారు. టాప్ 5లో న్యూజిలాండ్ స్థానం సంపాదించింది. న్యూజిలాండ్ ఆల్ రౌండర్ మైఖేల్ బ్రేస్‌వెల్ 246 రేటింగ్ పాయింట్‌లతో ఐదో స్థానంలో ఉన్నారు. 2025లో బే ఓవల్‌లో పాకిస్తాన్‌పై అతను తన కెరీర్ బెస్ట్ రేటింగ్ నమోదు చేశారు.



## యూరప్ స్మాష్‌లో..

# శ్రీజ, ఠక్కర్ సంచలన విజయం

### 3-2 తేడాతో మనికా ఓటమి

**న్యూఢిల్లీ:** యూరోప్ స్మాష్‌లో తెలంగాణ ప్లేయర్ అకుల శ్రీజ మానికా బాత్రాను ఓడించగా, పురుషుల విభాగంలో మానవ్ ఠక్కర్ ప్రపంచ 23వ ర్యాంక్‌ను ఓడించాడు. స్వీడన్‌లో జరిగిన డబ్ల్యూటిటి యూరప్ స్మాష్‌లో నిర్వహించిన అఖిల భారత మహిళల సింగిల్స్ పోరులో శ్రీజ అకుల మణికా బాత్రాపై విజయం సాధించింది. ప్రపంచంలోనే అత్యధిక ర్యాంక్ పొందిన భారత మహిళల సింగిల్స్ ప్యాడ్లర్ అయిన అకుల, 2025 సీజన్‌లో పేలవమైన ఫామ్‌తో మరింతగా విస్తరించిన అనుభవజ్ఞురాలైన బాత్రాపై 3-2 తేడాతో సంచలన విజయం సాధించి తన సత్తా చాటింది. తొలి గేమ్‌ను 5-11 తేడాతో ఓడించిన అకులకు అంతగా మంచి ఆరంభం లభించలేదు, కానీ ఆ తర్వాతి రెండు గేమ్‌లను 11-9, 15-13 తేడాతో గెలిచింది.

బాత్రా పుష్‌ఓవర్ ద్వారా నాల్గవ గేమ్‌ను 12-10 తేడాతో ఆధిక్యం సాధించినా, ఐదవ గేమ్‌లో అకుల 11-8 తేడాతో గెలిచి, 45 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. ఇక పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో మానవ్ ఠక్కర్ జపాన్‌కు చెందిన ప్రపంచ 23వ ర్యాంకర్ హిరోటో షినోజుకాపై సంచలన విజయం సాధించాడు. భారత పురుషుల సింగిల్స్ ప్యాడ్లర్‌లో అత్యున్నత ర్యాంక్ పొందిన థక్కర్, షినోజుకాపై ఆధిపత్యం సంపాదించాడు.

భారత ఆటగాడు కేవలం 30 నిమిషాలకు పైగా జరిగిన ఈ పోటీలో 12 -10, 11-5, 5-11, 11-8 తేడాతో గెలిచి రెండవ రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. పురుషుల డబుల్స్ భారత్ జోడీ థక్కర్ మనుష్ షా, మిక్స్‌డ్ డబుల్స్ జత షాదియా చిటాలే మొదటి రౌండ్ బైలు పొందారు.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్..

# కపిల్‌కు స్వర్ణం

### మనుకు డబుల్ కాంస్య పతకాలు





**న్యూఢిల్లీ:** 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్‌లో భారత్ ఖాతాలో తొలి స్వర్ణం నమోదైంది. ఎయిల్ పిస్టల్ విభాగంలో కపిల్ బైన్స్లా స్వర్ణ పతకం, వ్యక్తిగత విభాగంలో డబుల్ మెడలిస్ట్ మను భాకర్ ఒక కాంస్య పతకాన్ని సాధించారు. అంతేకాకుండా జట్టు విభాగంలో ఒలింపిక్ మను భాకర్, సురుచి సింగ్, పాలక్ గులియాతో కూడిన భారత్ బృందం కాంస్య మరో పతకం సాధించింది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పురుషుల జూనియర్ ఫైనల్‌లో భారత్ షూటర్ కపిల్ బైన్స్లా 243.0 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. కపిల్ క్వాలిఫికేషన్‌లో 579 పాయింట్లు సాధించి 4వ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో బ్లాక్‌ల వెలుపల అత్యంత వేగంగా ఆడిన ఆటగాడు ఇల్కోంబెక్‌ను కపిల్ 15వ షాట్ తర్వాత మొదటిసారి దాటాడు. 20వ షాట్ తర్వాత ఉజ్బెక్ చివరి రెండు షాట్‌లకు కపిల్ కంటే ముందున్నాడు. అయితే ఆ తర్వాత కపిల్ 10.8 మరియు 10.6తో ముగించగా, ఇల్కోంబెక్ తన 23వ రేసులో 10.4తో దూసుకెళ్లి 9.4తో ముగించి కపిల్‌కు టైటిల్‌ను అందించాడు. కాగా రెండవ రోజు రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మను భాకర్ రెండు కాంస్య పతకాలతో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. 23 ఏళ్ల మను 219.7 పాయింట్లు సాధించింది. మను భాకర్, సురుచి ఫోగట్ మరియు పాలక్ గులియాలతో కూడిన భారత త్రయం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలో 1730 స్కోరుతో కాంస్యం గెలుచుకుంది. వ్యక్తిగతంగా అర్హత రౌండ్‌లో, మను చివరి షాట్‌లలో పరిపూర్ణ 100 పరుగులు సాధించి, 583 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచింది. ఫైనల్లో మను మొదటి ఐదు షాట్ల తర్వాత 50.3 పాయింట్లతో ఐదవ స్థానంలో నిలిచింది. తదుపరి క్రమంగా పాయింట్లను పెంచుకునే యత్నం చేయడంతో పదకొండవ షాట్‌లో బలమైన 10.5 స్కోరుతో ఆమె రెండవ స్థానానికి ఎగబాకింది.

## వాణిజ్యం




## నాల్గో రోజూ

# లాభాల్లో సూచీలు

### రూ.25 వేలకు చేరువలో నిఫ్టీ

**హైదరాబాద్,ఆగస్టు19, ప్రభాతవార్త:** జీఎస్టీ విషయంలో కేంద్రం తలపెట్టిన సంస్కరణలు, రష్యా ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల్లో పురోగతి కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలను ముందుండి నడిపించాయి. ఇతర ఆటోమొబైల్ షేర్లు కూడా రాణించడం సూచీలకు కలిసొచ్చింది. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1400 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 25 వేల స్థాయికి చేరువైంది. సెన్సెక్స్ ఉదయం 81,319.11 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,273.75) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడేలో 81,755.88 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 370.64 పాయింట్ల వద్ద 81,644.39 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103.70 పాయింట్ల లాభంతో 24,980.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, రిలయన్స్, ఎటెర్నెల్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫినసర్వ్, పవర్గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్సీఎల్ టెక్నాలజీస్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.81 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3343 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఆసికా మార్కెట్లు చాలావరకు నష్టాల్లో ముగియగా ఐరోపా మార్కెట్లు లాభాలతో ట్రేడింగ్ ఆరంభించాయి.

# అమెజాన్‌లో కొలువుల జాతర

### పండుగ సీజన్‌లో 1.50 లక్షల జాబ్స్

### భర్తీకి 400కుపైగా నగరాల్లో రిక్రూట్‌మెంట్!

### వరంగల్, గుంటూరు, రాజమండ్రి తదితర నగరాల్లోనూ ఉద్యోగ అవకాశాలు





**హైదరాబాద్,ఆగస్టు 19, ప్రభాతవార్త:** పండుగ సీజన్‌లో ఏకంగా 1.50 లక్షల మందికిపైగా ఉద్యోగులను భర్తీ చేసేందుకు ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ రెడీ అవుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం లాంటి పెద్ద నగరాలతో పాటు వరంగల్, గుంటూరు, రాజమండ్రి లాంటి చిన్న నగరాల్లోనూ జాబ్ రిక్రూట్‌మెంట్లు చేయబోతోంది. పండుగల సీజన్ వస్తోంది. ఆగస్టు 26న వినాయక చవితి, సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు నవరాత్రులు, అక్టోబరు 2న దసరా, అక్టోబరు 21న దీపావళి పండుగలు ఉన్నాయి. ఏటా ఈ ఫెస్టివల్ సీజన్‌లో అమెజాన్‌కు ఆర్డర్లు వెల్లువెత్తుతుంటాయి. వాటిని కస్టమర్లకు సకాలంలో డెలివరీ చేయడానికి అమెజాన్‌కు అదనపు మానవ వనరులు అవసరం. అందుకోసమే ఏటా పండుగల సీజన్‌లో ఉద్యోగాలను భర్తీ చేస్తుంటుంది. ఈ ఉద్యోగాల్లో భర్తీ అయ్యేవారు అమెజాన్‌కు చెందిన ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, సార్టేషన్ హబ్‌లు, డెలివరీ స్టేషన్లలో వివిధ విధులను నిర్వర్తిస్తారు. అమెజాన్ ఏటా పండుగల సీజన్‌లో ఉద్యోగాలను భర్తీ చేస్తుంటుంది. అయితే మునుపటి కంటే అత్యధికంగా ఈదఫా 1.50 లక్షల మందికిపైగా యువతకు ఉద్యోగాలను ఇవ్వబోతోంది. ఇప్పటివరకు అమెజాన్ నిర్వహించిన అతిపెద్ద సీజనల్ ఉద్యోగ నియామక డ్రైవ్ ఇదేనని అంటున్నారు. ఈసారి దేశంలోని చిన్న నగరాలు, పట్టణాలను కూడా ఈ డ్రైవ్‌లో భాగం చేశారు. దీనివల్ల దాదాపు 400కుపైగా నగరాల్లోని యువతకు ఉద్యోగ అవకాశాలు లభించబోతున్నాయి. వారంతా తమతమ ఇళ్లకు సమీపంలోనే ఉంటూ, అమెజాన్‌లో ఉద్యోగాలు చేసుకోవచ్చు. అమెజాన్‌కు చెందిన ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, సార్టేషన్ హబ్‌లు, డెలివరీ స్టేషన్లలో ఉండే ఖాళీలను అమెజాన్ భర్తీ చేయబోతోంది. ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల ద్వారా ఆర్డర్ల స్వీకరణ, నిల్వ, ప్యాకింగ్, పంపిణీ వంటి పనులన్నీ జరుగుతాయి. అమెజాన్ ఆర్డర్ల ప్యాకేజ్‌లు నేరుగా సార్టేషన్ హబ్‌లకు చేరుకుంటాయి. వాటిని అక్కడ వివిధ ఏరియాల వారీగా వేరు చేస్తారు. అనంతరం వాటిని కస్టమర్ అడ్రస్‌కు డెలివరీ చేస్తారు. ఇక డెలివరీ స్టేషన్లలో అమెజాన్ ఆర్డర్ల ప్యాకేజ్‌లను పంపిణీ కోసం సరిగ్గా, సవ్యంగా సిద్ధం చేస్తారు. అమెజాన్‌లో అసోసియేట్‌లుగా ఉద్యోగాలు పొందేవారు కస్టమర్ల ఆర్డర్లను స్వీకరించడం, ప్యాకింగ్, సార్టింగ్, లాస్ట్ మైల్ డెలివరీ వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అమెజాన్ ఇచ్చేవి సీజనల్ ఉద్యోగాలే అయినప్పటికీ, కొందరు పండుగ సీజన్ తర్వాత కూడా కంటిన్యూ అవుతుంటారు. ఇంకొందరు ఏటా పండుగల సీజన్‌లలో అమెజాన్ కోసం సేవలు అందిస్తుంటారు. లాజిస్టిక్స్, ఈ కామర్స్‌లో అనుభవం పొందాలని భావించే యువతకు ఈ ఉద్యోగాలు మంచి అవకాశం. అమెజాన్‌లో ఉద్యోగాలు పొందే వారికి నెలవారీ వేతనంతో పాటు మరిన్ని సౌకర్యాలు, ప్రయోజనాలు లభిస్తాయి. ఆఫీసుల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాష్‌రూమ్‌లతో పాటు గోదాంలలో విశ్రాంతి గదులు ఉంటాయి. పెద్ద అమెజాన్ కేంద్రాలలో ఏసీ టిఫిన్ సెంటర్లు కూడా ఉంటాయి. ఉద్యోగులకు వైద్యసాయం అందించేందుకు శిక్షణ పొందిన నర్సులతో,యామాకేర్ ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహిస్తారు. మెరుగైన వైద్యం అవసరమైతే ఉద్యోగులను ఇతర ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు. తీవ్రమైన ఎండలు, వర్షాలు ఉన్నప్పుడు, అందుకు అనుగుణంగా ఉద్యోగాల డ్యూటీ టైంలను సర్దుబాటు చేస్తారు. అమెజాన్ ఉద్యోగులు ముందస్తు చెల్లింపు కార్యక్రమంతో ప్రయోజనాన్ని పొందొచ్చు. ఇందులో భాగంగా వారు శాలరీ పడే తేదీ కంటే ముందే వేతనంలో 80 శాతం భాగాన్ని తీసుకోవచ్చు. ఈ ఫీచర్ వారికి అత్యవసరాల్లో చేదోడుగా నిలుస్తుంది. అమెజాన్ అసోసియేట్‌లకు ప్రతినెలా రెండు వీక్లీ ఆఫ్‌లు, వార్షిక సెలవులు, అనారోగ్య సెలవులు లభిస్తాయి. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), గ్రాట్యుటీ, ఈఎస్ఐసీ బీమా కవరేజ్ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు సైతం ఉద్యోగులు పొందొచ్చు. మొత్తం మీద ఈ ఉద్యోగం వల్ల ఆర్థిక స్థిరత్వం, సామాజిక భద్రత లభిస్తాయి. అమెజాన్ ఈ సంవత్సరంలో ఇప్పటివరకు వేలాది మంది భారతీయ మహిళలకు అసోసియేట్‌లుగా ఉద్యోగాలు ఇచ్చింది. అమెజాన్ ఉద్యోగుల్లో దాదాపు 2,000 మందికిపైగా దివ్యాంగులు సైతం ఉన్నారు. అన్ని వర్గాలకు ఉద్యోగాల భర్తీలో అమెజాన్ ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పిస్తోంది.




# చాట్ జిపిటి గో రూ.399కే

**హైదరాబాద్,ఆగస్టు19, ప్రభాతవార్త:** భారత్లో లో చాట్ జీపీటీ గో పేరుతో ఓపెన్ ఏఐ కొత్త సేవలను ప్రకటించింది. రూ.399కే ఈ ప్లాన్ అందుబాటులో ఉండనున్నట్లు తెలిపింది. మెసేజ్‌లు, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్లోడ్ల సంఖ్యను భారీగా అనుమతించనుంది. ఇండిక్ లాంగ్వేజీ సపోర్టుతోపాటు యూపీఐతోనూ చెల్లింపులు చేసే సౌలభ్యాన్ని తీసుకొచ్చినట్లు తెలిపింది. ఉచిత ప్లాన్‌తో పోలిస్తే జీపీటీ గో లో మెసేజ్ లిమిట్, ఇమేజ్ జనరేషన్, ఫైల్ లేదా ఇమేజ్ అప్లోడ్లు 10 రెట్లు ఎక్కువగా ఉండనున్నాయి. మెమొరీ కూడా ఉచిత ప్లాన్లో పోలిస్తే రెండింతలు ఎక్కువగా ఉండనుంది. భారత్‌లో ఓపెన్ ఏఐ టూల్స్‌కు భారీగా పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఈ అధునాతన కృత్రిమ మేధ టూల్స్‌ను అందుబాటులో ధరల్లో అందించేందుకు చాటీజీపీటీ గో పేరుతో కొత్త ప్లాన్లను ప్రవేశపెడుతున్నాం" అని తాజా ప్రకటనలో వెల్లడించింది. ఇదివరకే అందుబాటులో ఉన్న రూ.1999 చాట్ పీటీ ప్లస్ ప్లాను అదనంగా ఇది ఉండనుంది. దీంతోపాటు నిపుణులు. సంస్థల కోసం ఇప్పటికే ప్రో ప్లాన్‌కు రూ.19,900తో అడ్వాన్స్డ్ ఫీచర్లను అందిస్తోన్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని చాటే జీపీటీ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ నిక్ టర్లీ పేర్కొంటూ. భారత్‌లో లెర్నింగ్, వర్క్, క్రియేటివిటీ, ప్రాబ్లమ్‌సాల్వింగ్ కోసం నిత్యం లక్షలాది మంది యూజర్లు చాటిజీపీటీని ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం నుంచి ఓపెన్ ఏఐ ప్రేరణ పొందుతోందన్నారు. ఈ నేపథ్యంలో యుపిఐ ద్వారా ఈ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చాట్‌జిపిటీ లోగోను ప్రవేశపెడుతున్నామన్నారు. ధరలు కూడా భారత్ కరెన్సీలోనే కనిపించనున్నాయని ఆయన ఇతర దేశాలకు విస్తరించే ముందు భారత్‌లో వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఓపెన్ ఏఐ అత్యంత ఆడ్వాన్స్‌డు ఏఐ మోడల్ చాట్‌జిపిటీ 5ను ఇటీవల పరిచయం చేసింది. ఈ సందర్భంగా ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్టమన్ మాట్లాడుతూ చాట్‌జిపిటిని మార్కెట్‌లలో రెండో స్థానంలో ఉన్న భారత్ త్వరలోనే అతిపెద్ద మార్కెట్‌గా అవతరించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు నిపుణులు ,డెవలపర్లు క్రియేటర్లు, సంస్థలకు చెందిన లక్షలాది మంది యూజర్లతో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఓపెన్ ఏఐ ఇప్పటివరనకు తయారు చేసిన అత్యంత శక్తివంతమైన మేడల్‌గా దీన్ని పేర్కొంది.




# 1జిబి ప్లాన్‌కు మంగళం!

**హైదరాబాద్,ఆగస్టు19, ప్రభాతవార్త:** ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్టెల్ కూడా వినియోగదారులకు షాకిచ్చింది. ఎంట్రీలెవల్ ప్రీపెయిడ్ ప్లాన్ రూ.249కు మంగళం పాడేసింది. బుధవారం (ఆగస్టు 20) నుంచి ఈ ప్రీపెయిడ్ ప్లాన్ యూజర్లకు అందుబాటులో ఉండదు.

1జీబీ డేటా ప్లాన్ను జియో తొలగించిన కొన్ని గంటల్లోనే ఎయిర్టెల్ నుంచి ఈ నిర్ణయం వెలువడింది. వొడాఫోన్ ఐడియా నుంచి ఇదే తరహా నిర్ణయం వెలువడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 24 రోజులకు 1 జీబీ డేటా, అపరిమిత కాల్స్తో ప్రస్తుతం ఎయిర్టెల్ ఈ ప్యాక్ అందిస్తోంది. ఇకపై ప్రతి యూజర్ కనీస రీఛార్జి రూ.319 చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్యాక్ నెలరోజుల వ్యాలిడిటీతో వస్తోంది.

ప్రస్తుతం వొడాఫోన్ ఐడియా రూ.299కు 1జీబీ/డే ప్లాన్ను అందిస్తోంది. తొలుత జియో..: 28 రోజులకు రోజుకు 1 జీబీ డేటా అందించే ప్లాన్ ను జియో నిలిపివేసింది. ఇకపై రోజుకు 15 జీబీ ప్లాన్లే ఆప్షన్గా అందుబాటులో ఉంటాయి. ఇప్పటికే ఈ మార్పు అమల్లోకి వచ్చింది. జియో వెబ్సైట్లో 1జీబీ ఎంట్రీ లెవల్ ప్లాన్ కనుమరుగైంది. ప్రస్తుతం 28 రోజులకు రూ.299తో 1.5 జీబీ/డే, రూ.349తో 2 జీబీ/డే ప్లాన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. తిళిశిగీ పెంచుకునేందుకే ఎంట్రీ లెవల్ ప్లాన్లు సవరించడం వల్ల యూజర్లు కనీసం రోజుకు 1.5జీబీ అందించే ప్లాన్కు మారాల్సి ఉంటుంది. దీంతో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయాలు (తిళిశిగీ) ఆ మేర పెరగనున్నాయి. జియో యూజర్లలో 20 25 శాతం మంది 1జీబీ ప్లాన్ వాడే వాళ్లుంటారని అంచనా ఎయిర్టెల్ యూజర్లలో 1820 శాతం మంది ఎంట్రీ లెవల్ ప్లాన్ యూజర్లు ఉంటారు. ఈ ప్లాన్లు తొలగింపు వల్ల ఆయా టెలికాం సంస్థల ఆదాయాలు 47 శాతం, సగటు ఆదాయం రూ.1013 మేర పెరుగుతుందని బ్రోకరేజీ సంస్థలు అంచనా.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps